ఈనాడు ప్రకాశం

సోమవారం 21 ఆగస్టు 2017 16 పేజీలు



ఒంగోలు శివారులోని విష్ణుప్రియ కన్వెన్షన్ హాలులో ఆదివారం రాత్రి ప్రకాశం-గుంటూరు జిల్లాల 18వ గనుల భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న దత్తా, నీరజ్ కుమార్, రాఘవరెడ్డి, ఎం.ఎ.అజీమ్, లక్ష్మీనారాయణ తదితరులు 16 లో...

గొలుసు తెగింది...

షరతులు వర్తిస్తాయి...!

- దుకాణాలు తొలగిస్తున్నా ఆగని అమ్మకాలు
- పోలీసుల గట్టి నిఘా... పాతదారిలోనే ఎక్సైజ్ సిబ్బంది

చింత చచ్చినా... పులుపు చావలేదనే నానుడి గొలుసు దుకాణాల వ్యవహారానికి అతికినట్టు సరిపోతుంది. గ్రామాల్లో గొలుసు దుకాణాలు తొలగించినా విచ్చలవిడి విక్రయాలను మాత్రం పూర్తిగా నియంత్రించలేకపోయారు. రాష్ట్రవ్యాప్తంగా గొలుసు దుకాణాలను పూర్తిగా నిర్మూలించాలంటూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అందుకు అనుగుణంగా జిల్లాలో దాడులైతే జరుగుతున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో సిబ్బంది వైఫల్యం కారణంగా అనుకున్నంత ఫలితాలు సాధించలేకపోతున్నారు. గతంలో ఉన్నట్లు గొలుసులు లేకపోయినా, ఇళ్లలోను, చిన్నచిన్న దుకాణాల్లోను అమ్మకాలు జరిగిపోతున్నాయి...! – ఒంగోలు



పుల్లలచెరువు మండలం ఏంద్రవల్లి గ్రామంలో ఓ ఇంట్లోని దుకాణం వద్ద చాటుగా మద్యం అమ్మకం

జిల్లావ్యాప్తంగా గతంలో కంటే పరిస్థితి మెరుగుపడింది. అధికారులు పైకి ప్రకటిస్తున్నట్లు పూర్తిస్థాయిలో కాకపోయినా పోలీసులు, రెవెన్యూ, ఆబ్కారీ శాఖ సిబ్బంది కలిసి పనిచేస్తుండడంతో గడచిన నెల రోజుల్లో 520 గొలుసు దుకాణాలను తొలగించారు. జిల్లాలో అనధికారిక లెక్కల ప్రకారం 800 వరకు దుకాణాలు ఉంటాయని అధికారులు గతంలో పేర్కొన్నారు. ఈ లెక్కన చూసుకున్నా మిగిలిన దుకాణాలను తొలగించాల్సి ఉంది. అయితే ఎక్కడ, ఏ రూపంలో, ఎవరు నిర్వహిస్తున్నారనే విషయం తెలుసుకోలేకపోతున్నారు. ఉన్నతస్థాయిలో అంతా బాగానే జరుగుతున్నా లోపమంతా క్షేత్రస్థాయి సిబ్బందిలోనే ఉంది. కొందరు ఎక్సైజ్ కానిస్టేబుళ్లు దుకాణాల వద్దకు తమ సన్నిహితులతో కలిసి నడుపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

మచ్చుకు కొన్ని...!

చాలా గ్రామాల్లో శివారు ప్రాంతాల్లోని కొన్ని ఇళ్లలోను, కిళ్లీ, శీతల పానీయాల దుకాణాల్లోను అనధికారికంగా అమ్మకాలు జరుగుతున్నాయి. కేవలం తెలిసిన వాళ్లకు, తరచూ తీసుకువెళ్లేవాళ్లకు మాత్రమే సీసాపై రూ. 20 అధికంగా తీసుకుని మిగతా 11లో »




ప్రకాశం జిల్లా వాసి... పద్మశ్రీ పురస్కార గ్రహీత, పారిశ్రామిక వేత్త బీవీ మోహన్‌రెడ్డికి ఆయన స్వగ్రామమైన మోక్షగుండంలో ఆదివారం సత్కారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన సేవలను గ్రామస్థులు కొనియాడారు. ఊరిలో పర్యటిస్తూ... గ్రామస్థులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, మోహన్‌రెడ్డి.

వివరాలు 7లో

చిత్రం... భళారే స్త్రీ వేషం...
మధ్య పేజీల్లో....



పనిచేయక పోవడంతో చీరాలలోని పాఠశాలలో పక్కన పెట్టిన బయోమెట్రిక్ యంత్రాలు



సాంకేతిక సమస్యలు చూపిస్తున్న బయోమెట్రిక్ పరికరం

పడకేసిన పారదర్శకత!

- బయోమెట్రిక్ యంత్రాలకు సాంకేతిక సమస్య
- పాత పద్ధతిలోనే విద్యార్థులకు హాజరు

చీరాల అర్బన్, పర్చూరు, న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలల్లో 'విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరులో పారదర్శకత పాటించేందుకు ప్రభుత్వం బయోమెట్రిక్ విధానానికి శ్రీకారం చుట్టింది... ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చారు. మొదటి దశలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఈ విధానం అమలు చేయాలని నిర్ణయించి... వాటికి బయోమెట్రిక్ యంత్రాలు పంపిణీ చేశారు. అయితే సాంకేతిక సమస్యతో పలుచోట్ల అవి మొరాయిస్తున్నాయి. కొన్ని చోట్ల అంతర్జాలం పనిచేయడంలేదు. మరికొన్ని చోట్ల విద్యార్థుల వివరాలు పూర్తిగా యంత్రాల్లో నిక్షిప్తం చేయని పరిస్థితి ఏర్పడింది. అప్‌డేట్ చేయమని సూచించడం, తదితర సమస్యలు వస్తుండడంతో బయోమెట్రిక్ పరికరాలను ఉపయోగించకుండా పక్కన పెడుతున్నారు. చాలా చోట్ల పాతపద్ధతిలో హాజరుపట్టీలోనే విద్యార్థుల హాజరు నమోదు చేస్తున్నారు... దీంతో ప్రభుత్వ ఆశయం నెరవేరని పరిస్థితి నెలకొంది.

సమస్యలు పరిష్కరించరేం?

విద్యార్థుల సంఖ్యాపరంగా జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు, కచ్చితత్వం కోసం, ఉపాధ్యాయులు సక్రమంగా హాజరయ్యేలా చూసేందుకు బయోమెట్రిక్ హాజరు పద్ధతిని తీసుకొచ్చారు. తొలి విడతగా జిల్లాలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశ పెట్టారు. జిల్లావ్యాప్తంగా 729 బయోమెట్రిక్ పరికరాలు పాఠశాలలకు మిగతా 11లో »

ఎడాపెడా... ఏం చేసినా...

అంతా ఆయన ఇష్టం..!

- పురపాలక సంఘంలో నాసిరకంగా అభివృద్ధి పనులు
- బినామీలతో రూ.కోట్ల పనులు చేయిస్తున్న నాయకుడు
- కన్నెత్తి చూడని ఇంజినీరింగ్ అధికారులు



తూర్పువీధిలో నిర్మాణ సమయంలోనే కనిపిస్తున్న నాణ్యత లోపం



ప్లాస్టింగ్‌కు వాడుతున్న నాసిరకం ఇసుక



మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే

నాణ్యమైన సిమెంటు, ఇసుక, కంకర సమపాళ్లలో కలిపి పనులు చేస్తే నిర్మాణాలు కలకాలం నిలిచి ఉంటాయి. అది లోపిస్తే నిర్మాణాల భవిష్యత్తుకు భద్రత లేనట్లే. మార్కాపురం పట్టణంలో అధికారం అండతో కొందరు గుత్తేదారులు కాసులకు కక్కుర్తిపడి అభివృద్ధి పనులను అత్యంత నాసిరకంగా చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించి నాణ్యతను పరిరక్షించాల్సిన ఇంజనీరింగ్ యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. దీంతో పురపాలక సంఘంలో ఎస్‌డీఎఫ్, 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 కోట్లతో జరుగుతున్న పనుల్లో గుత్తేదారులు నాణ్యతకు తిలోదకాలిచ్చి యథేచ్ఛగా సాగించేస్తున్నారు.

కంకర మినహా అంతా నాసిరకమే...

మార్కాపురం పురపాలక సంఘంలో గత మూడు మాసాలుగా ఎస్‌డీఎఫ్ నిధులు రూ.1.25 కోట్లతో 32 పనులు, రూ.1.8 కోట్లతో 10 పనులు జరుగుతున్నాయి. వాటిల్లో కూడా ఎక్కువగా మురుగు కాలువల నిర్మాణాలకే ప్రాధాన్యమిచ్చారు. మిగిలిన వాటిల్లో లక్ష్మీచెన్నకేశవనగర్‌లోని మాగుంట సుబ్బరామిరెడ్డి పార్కు ప్రహరీ నిర్మాణం, ఎస్సీ, ఎస్టీల ఆవాసాల్లో పలుచోట్ల సీసీ రహదారుల నిర్మాణాలు ఉన్నాయి. పనులు దక్కించుకున్న మిగతా 11లో »

నెక్ కోడిగ్రుడ్ల ధరలు

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.59 పైII
నెక్ విజయవాడ ఆఫీసు. ఫోన్: 0866-6582559

ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించుకోవచ్చు

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: తపాలాశాఖలో పని చేస్తున్న గ్రామీణ డాక్ సేవక్స్ నిరవధిక సమ్మెలో ఉన్నందున తపాలా జీవిత బీమా పాలసీదారులు తమకు దగ్గర్లోని సబ్ పోస్టాఫీసుల్లో ఆన్‌లైన్ (సీబీఎస్ ఫైనాన్సు) సిస్టమ్ ద్వారా లావాదేవీలు జరుపుకోవచ్చని తపాలాశాఖ ఎస్‌ఎస్‌పీ టీవీవీ శర్మ తెలిపారు. రిజిస్టర్డు ఆర్టికల్స్, మనీ ఆర్డర్లు, ఇతర ముఖ్యమైన సేవలను గ్రామీణ తపాలా కార్యాలయాలకు సంబంధించిన సబ్‌పోస్టాఫీసుల్లో తగిన గుర్తింపు పత్రాలు చూపించి తీసుకునే సదుపాయం కల్పించామన్నారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె కారణంగా వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్‌బీ, ఆర్‌డీ ఖాతాదారులతోపాటు జీవిత బీమా పాలసీదారులు సీబీఎస్ ఫైనాన్స్ సిస్టమ్ ద్వారా ఆన్‌లైన్ సేవలు పొందాలని కోరారు.

చికెన్ ధరలు



కోళ్ల ఫారం ధర

బ్రాయిలర్ (వెన్‌కాబ్) (కిలో 1కి రూ.లలో)

హైదరాబాద్-86, కర్నూలు-86, విజయవాడ-88, తూర్పు, పశ్చిమ గోదావరి-88, చిత్తూరు-86, నెల్లూరు - 86, విశాఖపట్నం - 79, గుంటూరు -88, ఒంగోలు - 90.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.



యాగ ప్రాంగణానికి పల్లకీపై తరలివస్తున్న లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులు



యాగస్థలికి వస్తోన్న పట్టణ ప్రజలు

వైభవంగా ముగిసిన వరుణయాగం



స్వామివారికి జలాభిషేకం అనంతరం పూజలు చేస్తున్న దృశ్యం

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: తీవ్ర నీటి ఎద్దడితో అల్లాడుతున్న మార్కాపురంలో సమృద్ధిగా వర్షాలు కురిసి అంతా సుభిక్షంగా ఉండాలని లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా చేపడుతున్న వరుణ యాగం ఆదివారంతో వైభవంగా ముగిసింది. తొలుత స్థానిక లక్ష్మీచెన్న కేశవస్వామి దేవస్థానం నుంచి శ్రీదేవి, భూదేవి సమేతుడైన చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి పల్లకీపై ఊరేగింపుగా చెరువులో నుంచి సుమారు ఆరు కిలో మీటర్ల దూరంలోని యాగశాలకు తీసుకువెళ్లారు. పెద్ద ఎత్తున మహిళలు నైవేద్యాలు నెత్తిన పెట్టుకుని ముందుకు సాగగా... బాజాభజంత్రీలు, అర్చకుల వేదమంత్రాల నడుమ స్వామివారు యాగ స్థలానికి చేరుకున్నారు. కంచి పీఠాధీశ్వర్లు జగద్గురు భారతీతీర్థ మహాస్వామి శిష్యులు, గుంటూరుకు చెందిన అవ్వారు దీక్షితుల పర్యవేక్షణలో స్థానిక వేదపండితులు జొన్నాభొట్ల రాముశర్మ, నంద్యాల తిరుమలాచార్యులు, శ్రీపతి అప్పనాచార్యులు మండపారాధన, వరుణహోమం, చెన్నరాయుని విగ్రహానికి జలాభిషేకాలు నిర్వహించారు. స్వామివారి శిల జలంలో పూర్తిగా మునిగే వరకు అభిషేకాలు కొనసాగాయి. పూర్ణాహుతితో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు ముగిశాయి.

వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

ఆలయ ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో పట్టణం నుంచి యాగస్థలం వరకు బస్సులు ఏర్పాటు చేయడంతో పట్టణంలోని అన్ని ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కొందరు మహిళలు ఇళ్ల వద్దే నైవేద్యాలను తయారు చేసి... పొంగళ్లను నెత్తిన పెట్టుకుని వచ్చి స్వామివారికి సమర్పించారు. వరుణ యాగ క్రతువు ముగిసిన తర్వాత పట్టణానికి చెందిన ముస్లిం, క్రైస్తవ సోదరులు కూడా వర్షాలు కురవాలని కాంక్షిస్తూ చెరువులో ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అక్కడే వన భోజనాలు జరిగాయి. వేలాదిగా వచ్చిన భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఆర్డీవో కె. పెంచలకిషోర్, డీఎస్పీ ఎన్‌వీ రామాంజనేయులు పూజల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ వక్కలగడ్డ రాధిక మల్లికార్జున్, ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ యక్కలి కాశీవిశ్వనాథం, ట్రస్ట్ బోర్డు సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

జై జవాన్... అని ఎలుగెత్తి చాటుదాం

ఘనంగా రెండు కవితా సంపుటాల ఆవిష్కరణ




పుస్తకాల ఆవిష్కరణలో పాల్గొన్న జిల్లా ముస్లిం రచయితల సంఘం ప్రతినిధులు

ఒంగోలు సాంస్కృతిక విభాగం, న్యూస్‌టుడే: మంచు పర్వతాల మధ్య, ఎముకలు కొరికే చలిలో, వడగాలులు వీచే ఎడారుల్లో రేయనక, పగలనక విధి నిర్వహణ చేస్తూ కంటికిరెప్పలా దేశ రక్షణ చేస్తున్న జవాన్లకు సమాజమంతా బాసటగా నిలిచి వారికి మరింత ఉత్తేజం ఇవ్వాల్సిన తరుణం ఆసన్నమైందని వక్తలు అన్నారు. జిల్లా ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కేశవస్వామిపేట మల్లయ్య లింగం భవన్‌లో రెండు కవితా సంపుటాల ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. సంఘం అధ్యక్షుడు, విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడు షేక్ మహబూబ్ జాన్ రచించిన జై జవాన్, అమ్మకు వందనం కవితా సంపుటాలను సీనియర్ న్యాయవాది ఎస్. వి. మల్లికార్జునరావు, విద్యాదాత కొల్లిబోయిన చినవెంకయ్య మాస్టర్ ఆవిష్కరించి ప్రసంగించారు. జాన్ మాస్టర్ 2000లో దేశం కోసం(కథలు)తో ప్రారంభించి భారత నోబెల్ గ్రహీతలు(కథలు), జయహో అమరావతి లాంటి 25 పుస్తకాలు రచించి, ఇప్పుడు దేశభక్తి, మాతృభక్తి చాటి చెబుతూ రెండు సంపుటాలు తీసుకురావడం హర్షణీయమన్నారు. మాజేటి వెంకటసుబ్బయ్య శాస్త్రి పుస్తక సమీక్ష చేస్తూ జననీ జన్మభూమిశ్చ, స్వర్గాదపీ గరీయసీ అన్న సూక్తికి జాన్ మాస్టర్ తన కవితార్చనతో సరైన నీరాజనం అందించాని ప్రశంసించారు. చిన్నారి షేక్ ఫాతిమా తస్రీన్ ఆలపించిన సారే జహాసే గీతం, గాయకుడు ఎం. వి. బ్రహ్మయ్య అమ్మ గురించి పాడిన పాటలు, భువనగిరి పురుషోత్తం వ్యాఖ్యానం అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ సాహిత్య, ప్రజా సంస్థల ప్రతినిధులు ఎండీ ఫజులుల్లా, షేక్ హుమాయూన్‌బాషా, కుర్రా ప్రసాద్‌బాబు మాట్లాడారు. సీనియర్ కవులు పిన్ని వెంకటేశ్వర్లు, కె. బాదరయ్య, మేళ్లచెరువు కాంతారావు, మల్లవరపు రాజేశ్వరరావు, శనగపల్లి సుబ్బారావు, ఎం. వి. వి. సుబ్రహ్మణ్యం, కళారంగాల ప్రతినిధులు మైనంపాటి సాయికుమార్, ఏనుగుల సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవమాన భారంతో యువకుడి ఆత్మహత్య

శరీరంపై సిగరెట్టుతో కాల్చిన గాయాలు

కొరిశపాడు(మేదరమెట్ల), న్యూస్‌టుడే: అవమాన భారం మరచి పోలేక ఓ యువకుడు ఇంటి వద్దే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం కొరిశపాడులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కొరిశపాడు గ్రామానికి చెందిన యర్రమోతు సుబ్బారావు, రమణమ్మ దంపతుల కుమారుడు యర్రమోతు వేణు(18) ఆదివారం ఉదయం ఇంటి పక్కనే ఉన్న పాత గృహంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 16న అమ్మాయిల వెంటపడుతున్నారంటూ బాలిక బంధువులు దారుణంగా కొట్టి అవమాన పరచడంతో సహించ లేకపోయాడని, ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో తండ్రి బహిర్భూమికి వెళ్లగా, ఇంటి పక్కనే



ఉరి వేసుకున్నది ఈ ఇంటిలోనే..

ఉన్న పాత గృహంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. అద్దంకి సీఐ హైమారావు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. మృతుడి తండ్రి సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మృత దేహన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సీఐ వెంట అద్దంకి ఎస్సై సుబ్బరాజు, మేదరమెట్ల ఏఎస్సై హరిబాబు, దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్ర రావు ఉన్నారు.

హింసించారనే అవమాన భారంతో..

కొరిశపాడులో నివాసముంటున్న సుబ్బారావుకు ముగ్గురు కుమారులున్నారు. వారిలో చివరి వాడైన మృతుడు వేణు ఆరోతరగతి వరకే చదివాడు అనంతరం కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 16వతేదీన తన స్నేహితుడు మందా ప్రసన్న పిలవడంతో ఆయన వెంట వెళ్లాడు. మేదరమెట్ల గ్రామానికి చెందిన బాలికను ద్విచక్ర వాహనంపై వెంబడిస్తున్న క్రమంలో బాలిక తండ్రి, అతని బంధువులు వారిని వెంబడించారు. వెనుక కూర్చున్న మందా ప్రసన్న పారిపోగా..బండి నడుపుతున్న మృతుడు యర్రమోతు వేణు వారికి దొరికిపోయాడని మృతుడి తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అమ్మాయిల వెంట పడుతున్నారా? అంటూ ఆవేశంతో ఆ బాలిక బంధువులు మిద్దెలడొంకలో వేపచెట్టుకు వేణును కట్టేసి దారుణంగా కొట్టి దూషించారని తెలిపారు. సిగరెట్లతో కాల్చడంతో శరీరమంతా గాయాలయ్యాయని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న తాము మేదరమెట్ల చేరుకుని కుమారుడిని వదలాలని కోరగా, తమను కొట్టి కులం పేరుతో దూషించారని తెలిపారు.



మృతదేహన్ని పరిశీలిస్తున్న నీలం నాగేంద్రరావు (అంతర్‌చిత్రంలో మృతుడు వేణు)

బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో తమ కుమారుడిని వదిలి పెట్టగా కొరిశపాడులోని తమ ఇంటికి తీసుకు వెళ్లినట్లు తల్లిదండ్రులు చెప్పారని పోలీసులు తెలిపారు. గాయాల తీవ్రత, తనను కొట్టారనే అవమాన భారంతో కుంగిపోయిన వేణు దూలానికి ఉరి వేసుకుని మృతి చెందాడని తల్లిదండ్రులు విలపించారు.

'దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి'

మృతుడు వేణును చిత్రహింసలకు గురిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండు చేశారు. కొరిశపాడు యువకుడిని అపహరించి మేదరమెట్లలో వేప చెట్టుకు కట్టేసి కొట్టారని ఆయన ఆరోపించారు. ముఖంపై సిగెరెట్టుతో కాల్చిన గుర్తులున్నాయని, ఇది అత్యంత హేయమైన చర్య అని తెలిపారు. కుమారుడిని కొడుతున్న సమయంలో అడ్డువచ్చిన తల్లిదండ్రులను కొట్టి కులం పేరుతో అవమాన పరచడం ఎంతవరకూ న్యాయమన్నారు. తన కారణంగా తల్లిదండ్రులకు దెబ్బలు తగిలాయనే బాధే వేణు ఆత్మహత్యకు కారణమన్నారు. నిందితులపై కఠినచర్యలు తీసుకుంటేనే మిగిలిన వారికి కనువిప్పు కలుగుతుందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాడతామని తెలిపారు.

భర్త తాగుడు మానలేదని భార్య ఆత్మహత్య

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఎన్నిసార్లు చెప్పినా భర్త పద్ధతి మార్చుకోవడం లేదని ఓ భార్య తనువు చాలించింది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్డు నం. 10సిలోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం లింగంగుట్ట గ్రామానికి చెందిన వారికంటి రామిరెడ్డి, గోవర్ధిని(25) ఉంటున్నారు. రామిరెడ్డి మేస్త్రీగా పనిచేస్తుండగా గోవర్ధిని చిన్నచిన్న పనులు చేసుకుంటూ పిల్లలను చూసుకొనే వారు. రామిరెడ్డి మద్యానికి అలవాటుపడటంతో మద్యం మానేయాలని గోవర్ధిని చాలాసార్లు కోరింది. ఇంటి గురించి, పిల్లల గురించి పట్టించుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటూ నిత్యం కోరేది. భార్య మాటను పెడ చెవిన పెట్టిన రామిరెడ్డి శనివారం రాత్రి కూడా మద్యం తాగి ఇంటికి వచ్చారు. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కొద్ది సేపటి తరువాత లోపలి గదిలోకి వెళ్లిన ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. భర్త గుర్తించే సమయానికే ఆమె ప్రాణం విడిచింది. తన తాగుడే తన భార్య ప్రాణాలు తీసిందని, తాగుడు మానుకోవాలని, కుటుంబాన్ని చూసుకోవాలంటూ చెప్పినా వినలేదని ఈ కారణంగానే మనస్తాపంతో చనిపోయిందంటూ రామిరెడ్డి పోలీసులకు వివరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణానదిలో స్నానానికి దిగి విద్యార్థి మృతి

ఆలయానికి వెళ్తున్నామని వసతి గృహం నుంచి బయటకు వచ్చిన నలుగురు స్నేహితులు



హరిప్రసాద్ మృతదేహన్ని ఒడ్డుకు తీసుకు వస్తున్న మత్స్యకారుడు, సహ విద్యార్థులు

అవనిగడ్డ గ్రామీణం, మోపిదేవి, న్యూస్‌టుడే: దివిసీమ ముఖద్వారం పులిగడ్డలో మోపిదేవి వార్పునకు సమీపంలోని కాజ్ వే వద్ద కృష్ణానదిలో ఆదివారం స్నానానికి దిగిన నలుగురు పాలిటెక్నిక్ విద్యార్థుల్లో తూపాటి హరిప్రసాద్(16) ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడని ఎస్సై మణికుమార్ తెలిపారు. ప్రకాశం జిల్లా పెద ఆరవీడు మండలం కర్రోల గ్రామానికి చెందిన తూపాటి హరిప్రసాద్ కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం రామచంద్రపురంలోని దివిసీమ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం(కంప్యూటర్సు) చదువుతూ అవనిగడ్డలోని బీసీ కళాశాల విద్యార్థుల వసతి గృహంలో ఉంటున్నాడు. ఆదివారం కావడంలో హరిప్రసాద్ తన మిత్రులు డి. మోహన్‌సాయి, జి.వెంకటేశ్వరరావు, ఎం.యుగంధర్‌తో కలిసి మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి వెళ్తున్నామని వసతి గృహంలోని వారికి చెప్పారు. నలుగురు కలసి పులిగడ్డలోని కృష్ణానదిలో కాజ్‌వే వద్ద స్నానంచేయడానికి దిగారు. హరిప్రసాద్ కొద్దిలోతు ప్రాంతంలో స్నానానికి దిగి రెండు సార్లు అటూ ఇటూ గంతులు వేసినట్లుగా మిత్రులు తెలిపారు. మిగిలిన వారు కాజ్‌వేకు దగ్గరలో స్నానం చేస్తుండగా హరిప్రసాద్ కనపడకపోవడంతో వారు భయంతో కేకలు వేశారు. వెంటనే అవనిగడ్డ పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందటంతో ఎస్సై మణికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని హరిప్రసాద్ కోసం మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టారు. డీఎస్పీ ఖాదర్ బాషా ఘటనా స్థలానికి వచ్చి గాలింపు చర్యలను పర్యవేక్షించారు. మత్స్యకారులు పడవలో వలలతో గంటసేపు పైగా నదిలో గాలించగా హరిప్రసాద్ మృతదేహం లభించింది. హరిప్రసాద్ మృతదేహాన్ని చూడగానే సహచర విద్యార్థులు బోరున విలపించారు. అతని తల్లిదండ్రులకు సమాచారం అందించామని వారు పేర్కొన్నారు. ఈమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మణికుమార్ చెప్పారు. పులిగడ్డ వీఆర్వో సత్యనారాయణ శవ పంచనామా నిర్వహించి శవ పరీక్ష కోసం హరిప్రసాద్ మృతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి గాయాలు

పాలుట్ల(యర్రగొండపాలెం), న్యూస్‌టుడే: అడవికి ఎద్దులను మేపడానికి తీసు కెళ్లిన వ్యక్తిపై ఎలుగుబంటి దాడి చేసింది. ఆదివారం చోటుచేసుకున్న ఈ సంఘటనలో వై.పాలెం మండలం పాలుట్ల గిరిజన గూడేనికి చెందిన చెవుల గురవయ్యకు గాయాలయ్యాయి. గూడెం సమీపంలోని అడవిలోకి ఎద్దులను మేపుకునేందుకు వెళ్లగా పొదల చాటునున్న ఎలుగుబంటి ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో పక్కనున్నవారు స్పందించి ఎలుగుబంటి నుంచి కాపాడారు. క్షతగాత్రుడి వీపుపై గాయాలయ్యాయి. వాహనంలో వెంటనే వై.పాలెంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

దేవరపల్లి భూముల్లో యథాతథ స్థితి

పర్యావరణ ట్రైబ్యునల్ ఆదేశం

పర్చూరు, న్యూస్‌టుడే: పర్చూరు మండలంలోని దేవరపల్లి కృష్ణంరాజు చెరువు భూముల విషయంలో యథాతథ స్థితిని కొనసాగించాలని చెన్నైలోని పర్యావరణ ట్రైబ్యునల్ ఆదేశించింది. చెరువు భూమి అన్యాక్రాంతం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామానికి చెందిన ముప్పాళ్ల శ్రీనివాసరావు ట్రైబ్యునల్‌లో వ్యాజ్యం దాఖలు చేశారు. విచారించిన ట్రైబ్యునల్ ఛైర్మన్ తదుపరి విచారణను సెప్టెంబరు 19కి వాయిదా వేస్తూ, అప్పటి వరకు యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

మద్యం మత్తులో దౌర్జన్యం

ప్రయాణికుడిని చితకబాదిన ఎక్సైజ్ కానిస్టేబుల్
తమ పరిధి కాదంటూ చేతులెత్తేసిన స్థానిక పోలీసులు
నంద్యాల జీఆర్‌పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో ఓ ప్రయాణికుడిపై ఎక్సైజ్ కానిస్టేబుల్, మరో ఇద్దరు వ్యక్తులు కలిసి దాడి చేయడం విమర్శలకు దారి తీసింది. గిద్దలూరు మండలం పొదలకుంటపల్లెకు చెందిన మిర్చి వ్యాపారి నంద్యాల ఖాశిం శనివారం రాత్రి 11 గంటలకు అనంతపురం వెళ్లేందుకు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ కోసం ఒకటో నంబర్ ప్లాట్



ఎక్సైజ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు

ఫాంపై వేచి ఉన్నాడు. ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి ఖాశిం వద్దకు వచ్చి గంజాయి తీసుకువెళుతున్నావంటూ ఘర్షణకు దిగాడు. ఇంతలో మరో వ్యక్తి, ఎక్సైజ్ కానిస్టేబుల్ కూడా అక్కడికి వచ్చారు. మాటా మాటా పెరిగి, ముగ్గురూ ఖాశింపై దాడి చేశారు. దీంతో బాధితుడు ఆర్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు స్పందించి నిందితులను ఆర్‌పీఎఫ్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆ ముగ్గురిలో ఒకరు ఎక్సైజ్ కానిస్టేబుల్ సీహెచ్ వెంకటేశ్వర్లు కాగా, మిగిలిన ఇద్దరినీ పగడి మురళి, బత్తుల రంగస్వామిగా గుర్తించారు. ఆర్పీఎఫ్ పోలీసుల సూచన మేరకు బాధితుడు గిద్దలూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాత్రి గస్తీలో ఉన్న కొమరోలు ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి నిందితులు ముగ్గురినీ స్టేషన్‌కు తరలించారు. ఆదివారం ఉదయం విషయం తెలుసుకున్న ఎక్సైజ్ అధికారులు పోలీసు స్టేషన్‌కు వచ్చారు. సంఘటన రైల్వేస్టేషన్ ఆవరణలో జరిగినందున జీఆర్‌పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని స్థానిక ఎస్ఐ కె.మల్లికార్జున బాధితుడు ఖాశింకు సూచించారు. అతనితో పాటు తమ స్టేషన్లోని ఒక కానిస్టేబుల్‌ను నంద్యాలకు పంపారు. ఆదివారం మధ్యాహ్నం బాధితుడు నంద్యాల వెళ్లి ఫిర్యాదు చేశారు. అక్కడి జీఆర్‌పీఎఫ్ ఎస్ఐ నారాయణ యాదవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడిని చికిత్సల కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. గిద్దలూరు స్టేషన్లో ఉన్న నిందితులను మధ్యాహ్నం విడిచిపెట్టారు.

ఎక్సైజ్ పోలీసులపై నిత్యం ఆరోపణలే..

గిద్దలూరు ఎక్సైజ్ శాఖ పోలీసుల పనితీరుపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం దుకాణాల సమీపంలోకి వెళ్లి ఎక్కువ మద్యం సీసాలు తీసుకువెళుతున్న వారిపై బెది



బాధితుడు నంద్యాల ఖాశిం

రింపులకు పాల్పడి వారి నుంచి మద్యం, డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఎక్సైజ్ సీఐ వారంలో రెండు రోజులు కూడా గిద్దలూరులో ఉండకపోవడంతో ఆ శాఖ సిబ్బందికి అడ్డూ అదుపు లేకుండా పోయిందనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


గిద్దలూరు

తెలుగు పీజీటీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రాచర్ల, న్యూస్‌టుడే : రాచర్ల ఆదర్శ ఉన్నత పాఠశాలలో పీజీటీ తెలుగు పోస్టు ఖాళీగా ఉందని ప్రిన్సిపల్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంఏ తెలుగు, బిఈడీ పూర్తయిన అభ్యర్థులు ఈ పోస్టుకు ఈ నెల 23 లోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు. వీరు ఈ నెల 25న మాదిరి పాఠం బోధించాల్సి ఉంటుందని, పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

చంద్రన్న బీమా నగదు అందజేత

రావిపాడు(కంభం), న్యూస్‌టుడే : ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో శనివారం మృతి చెందిన రావిపాడుకు చెందిన కృష్ణంశెట్టి పెద్ద కోటేశ్వరరావు (42) మట్టి ఖర్చుల నిమిత్తం చంద్రన్న బీమా కింద రూ.5 వేల నగదును బీమామిత్ర పద్మ ఆయన భార్యకు అందించారు. ఆ నగదును సర్పంచి కోటయ్య, ఎంపీటీసీ సభ్యుడు పుల్లయ్య చేతుల మీదుగా నామిని అయిన ఆయన భార్య రాములుకు అందించారు. కార్యక్రమంలో ఎంబీకె పద్మావతి పాల్గొన్నారు.


శ్లాబ్ పెచ్చులూడి పడుతున్న బేస్తవారపేట ఉర్దూ పాఠశాల


శిథిలావస్థకు చేరిన గలిజేరుగుళ్ల హైస్కూల్ భవనం


బేస్తవారపేట ఉర్దూ పాఠశాల వద్ద నిలిచిన మురుగు

శిథిల బడుల్లో.. భయం భయం

సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులు పట్టించుకోని అధికారులు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: మండలంలోని పలు పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. అవసరమైనన్ని తరగతి గదులు లేకపోవడంతో దెబ్బతిన్న గదుల్లోనే చదువులు సాగిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 43 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 7 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో 159 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు 2,680, ఆరు నుంచి పదో తరగతి వరకు 2,192 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బేస్తవారపేట ఉర్దూ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా దెబ్బతింది. ఇక్కడ 30 మంది పిల్లలు ఉన్నారు. బడి ఆవరణలోనే మురుగు నీరు నిలిచి ఉంటోంది. దాంతో దుర్వాసన వస్తోంది. తరచూ పెచ్చులూడి పడుతున్నాయి. నేకునాంబాదు, పిటికాయగుళ్ల, కోనపల్లి, జేబీకే పురం, పి.వి.పురం, ఆర్.కొత్తపల్లి తదితర గ్రామాల్లోనూ గదులు దెబ్బతిని ఉన్నాయి. ప్రతి పాఠశాలలోనూ సుమారు 30 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

ఉన్నత పాఠశాలల్లోనూ అంతే..

ఉన్నత పాఠశాలల్లోనూ గదులు దెబ్బతిని ఉన్నాయి. గలిజేరుగుళ్ల ఉన్నత పాఠశాలలో 362 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఏడు గదులు శిథిలావస్థకు చేరాయి. ఆంగ్లం, తెలుగు మాధ్యమాల్లో బోధన సాగుతోంది. పూర్తిగా దెబ్బతిన్న కొన్నింటిలో తరగతులు నిర్వహించడం లేదు. దాంతో తరగతి గదుల కొరత ఏర్పడుతోంది. శిథిలావస్థకు చేరిన వాటిని ల్యాబ్, స్టోర్ రూం, ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది గదులుగా ఉపయోగిస్తున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయంగా కాలం వెల్లదీయాల్సి వస్తోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో ఆరు తరగతి గదులు అవసరమవుతాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు చెబుతున్నారు. పిటికాయగుళ్ల ఉన్నత పాఠశాలలోనూ మూడు గదులు శిథిలావస్థకు చేరాయి. ఇక్కడ 136 మంది పిల్లలు చదువుకుంటున్నారు. చాలా కాలం కిందట అగ్ని ప్రమాదం జరగడంతో తరగతి గదులు దెబ్బతిన్నాయి. పిల్లలను రేకులు, దెబ్బతిన్న వాటిల్లో కూర్చోబెట్టి చదువులు చెబుతున్నారు. పదో తరగతి పరీక్ష కేంద్రం ఉండడంతో పరీక్షల నిర్వాహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్తపేట బడిలో కొన్ని తరగతి గదుల నిర్మాణాలు అయిదేళ్ల కిందట ప్రారంభించారు. వాటిని ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. బేస్తవారపేట బాలుర, బాలికల హైస్కూళ్లలోనూ గదుల కొరత వేధిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి కొత్తవి నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. శిథిలావస్థకు చేరిన గదుల వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఎంఈవో జింకా వెంకటేశ్వర్లు తెలిపారు. పూర్తిగా దెబ్బతిన్న వాటిల్లో పిల్లను కూర్చొబెట్టవద్దని ఉపాధ్యాయులకు సూచిస్తున్నామని చెప్పారు.


దెబ్బతిన్న గలిజేరుగుళ్ల పాఠశాల గోడలు

తాగు నీటికి ఇబ్బందే..



మా పాఠశాలలో తరగతి గదుల కొరత అధికంగా ఉంది. దెబ్బతిన్న వాటిల్లోనే కూర్చోవాల్సి వస్తోంది. గదులు లేకపోవడంతో ల్యాబ్, పీడీ రూములను ఉపయోగిస్తున్నాం. అప్పుడప్పుడు పెచ్చులూడి పడుతున్నాయి. కొత్తవి నిర్మించాలి. పాఠశాలలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. మరుగుదొడ్డికి వెళ్లేందుకు నీరు లేకపోవడంతో బయటకు వెళ్లాల్సి వస్తోంది. నీటి సమస్య పరిష్కరించాలి.

– అశోక్, తొమ్మిదో తరగతి, గలిజేరుగుళ్ల

సరిపడా గదులు లేవు



బడిలో సరిపడినన్ని తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నాం. శిథిలావస్థకు చేరిన వాటిల్లోనే చదువుకోవాల్సి వస్తోంది. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో కొందరు వెళ్లిపోయారు. కొన్ని ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రధానోపాధ్యాయుడు, ఫిజికల్ డైరెక్టర్, తెలుగు పోస్టులకు టీచర్లు రాలేదు. పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి. కొరత ఉన్న వాటికి ఉపాధ్యాయులను నియమించాలి. కొత్త తరగతి గదులు నిర్మించాలి.

– డి. సైదులు, పదో తరగతి, గలిజేరుగుళ్ల


సిద్ధమైన వినాయక విగ్రహాలు

నవరాత్రులకు సిద్ధమవుతున్న విగ్రహాలు

కొమరోలు, న్యూస్‌టుడే: ఈ నెల 25న వినాయక చవితి సందర్భంగా కొమరోలులో గణపతి విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దడం ఊపందుకుంది. రెండు నెలల కిందట లారీల్లో హైదరాబాదు నుంచి 90 వినాయక ముడి విగ్రహాలను అక్కడి వ్యాపారి స్థానిక షెల్టరుకు తీసుకువచ్చారు. రాజస్థాన్‌కు చెందిన కళాకారుడు రాము బృందం ఎనిమిదేళ్లుగా స్థానిక చెక్‌పోస్టు సమీపంలో విగ్రహాల తయారీ, విక్రయ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. గత ఏడాది వరకు రాజస్థాన్‌కు చెందిన కొన్ని కుటుంబాలు చెన్నై, హైదరాబాదు, రాజస్తాన్‌ల నుంచి ముడిసరుకులు తీసుకువచ్చి స్థానికంగానే వినాయక విగ్రహాలు తయారు చేసేవారు. ఈసారి అది వీలుకాక పోవడంతో హైదరాబాదు నుండి వచ్చిన ముడి విగ్రహాలకు రాజస్థాన్ నుంచి తీసుకువచ్చిన రంగులతో అందంగా తుదిమెరుగులు దిద్దుతున్నారు.

నవోదయకు గిద్దలూరు విద్యార్థుల ఎంపిక

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు నగర పంచాయతీ విశ్వభారతి పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల అధినేత బండారు ఆదిలక్ష్మి తెలిపారు. ఎస్.స్వాతిక, పి.భవ్య కలుజువ్వలపాడు జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

భాజపా మండల కార్యవర్గం ఎన్నిక

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : భాజపా గిద్దలూరు మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు సారె ఓబులపతి ఆధ్వర్యంలో ఎన్నుకొన్నారు. ఉపాధ్యక్షుడు మురహరిశెట్టి శ్రీనివాసులు, బంగారు శ్రీనివాసాచారి, కె.తిరుపాల్‌రెడ్డి, కమ్మరి స్వాతి, ప్రధాన కార్యదర్శి రెడ్డి మల్లారెడ్డి, కార్యదర్శులు శ్రావణ్, శ్రీనివాసరాజు, వి.విజయ్, కోశాధికారి కమ్మరి కృష్ణామాచారిలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు ఏనుగుల పద్మావతి, కె.వెంకటేశ్వరరావు, శివపురం రవి, ఎం.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

గుడిమెట్ట(రాచర్ల): ఉపాధ్యాయులు సేవలు మరువలేనివని మేడంవారిపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటరామిరెడ్డి అన్నారు. గుడిమెట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో బదిలీపై వెళుతున్న నలుగురు ఉపాధ్యాయులను ఆదివారం గ్రామస్థులు సన్మానించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్ మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులు ఎస్ఎండీ రఫి, బెనజీర్ బేగం, గౌరీ కోటేశ్వరి, సుధాకర్‌లను గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు పాపారాయుడు, పెద్దలు ఉస్మాన్, నాగూర్, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ ఛైర్మన్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నిమజ్జన ఏర్పాట్లపై పర్యవేక్షణ


కంభం చెరువును పరిశీలిస్తున్న ఎస్సై రామా నాయక్

కంభం, న్యూస్‌టుడే : ఈ నెల 26న కంభంలో జరిగే వినాయక నిమజ్జనం కోసం కంభం చెరువును ఎస్సై రామా నాయక్ పరిశీలించారు. చెరువులో కేవలం పెద్ద కంభం తూము వద్ద ఉన్న కొద్దిపాటి నీటిలో మాత్రమే విగ్రహాలను వేయనున్నట్లు ఎక్కువ మంది గత ఏడాది మాదిరిగానే రామన్న కతువకు విగ్రహాలను తరలిస్తారని ఆయనకు తెలిపారు. నిమజ్జనం వేళ భక్తులు కంభం చెరువు కట్టపైకి వచ్చే వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకునేందుకు ఆయన తమ సిబ్బందితో ఆదివారం పరిశీలించారు. రహదారి వెంట ఉన్న ప్రమాదకర మలుపుల వద్ద కూడా పోలీసులను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆమేరకు చెరువు కట్ట నుంచి ఆయన తురిమెళ్ల వరకు వెళ్లి పరిశీలించారు. విగ్రహాలు ఏర్పాటు చేసే వారందరూ పోలీసు అనుమతి తీసుకోవాలని సూచించారు.

నేడు, రేపు ఉపాధ్యాయులకు టెలీ కాన్ఫరెన్స్

రాచర్ల, న్యూస్‌టుడే : మండలంలోని ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఈ నెల 21, 22 తేదీల్లో రాచర్ల ఎమ్మార్సీలో టెలీకాన్ఫరెన్స్ జరుగుతుందని ఎంఈవో ఎం.కాశీఈశ్వరరావు తెలిపారు. మండలంలోని ఎస్‌జీటీ తరగతులకు ఇబ్బందులు లేకుండా సగం మంది 21వ తేదీన, మిగిలిన సగం మంది 22న హాజరుకావాలని, సింగిల్ టీచర్ గల పాఠశాలల వారు గతంలో నిర్ణయించిన విధంగా హాజరుకావాలని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటలలోగా ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.

అవార్డు గ్రహీతకు ఘన స్వాగతం


ఊరేగింపుగా గ్రామంలోకి వస్తున్న మోహన్‌రెడ్డి

మోక్షగుండం (బేస్తవారపేట), న్యూస్‌టుడే: పద్మశ్రీ అవార్డు గ్రహీత బి.వి.ఆర్. మోహన్‌రెడ్డికి స్వగ్రామంలో ఆదివారం ఘన స్వాగతం లభించింది. మేళతాళాలు, పూలమాలలతో ఆహ్వానం పలికారు. ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకెళ్లారు. విద్యార్థులు రహదారికి రెండువైపులా నిలుచుని ఆహ్వానించారు. గ్రామస్థులతో ఆయన ఆప్యాయంగా మాట్లాడారు. పాఠశాలను సందర్శించారు. సెయింట్ ఫౌండేషన్ వారు నిర్మించిన శుద్ధజల కేంద్రాన్ని ఆయన తమ్ముడు అశోక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. తమ ఊరి బిడ్డకు పద్మశ్రీ రావడం గర్వకారణమని కొనియాడారు. పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయుడు రఘునాధరెడ్డి, ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు

తెరపై ఈనాడు

గిద్దలూరు పట్టణం: వెంకటేశ్వర– లై, నటరాజ్– జయ జానకి నాయక, కృష్ణ– నేనే రాజు నేనే మంత్రి, శ్రీనివాస– ఫిదా **బేస్తవారపేట** : కళ్యాణి - జయ జానకి నాయక, ఊర్వశి - నేనే రాజు నేనే మంత్రి **కంభం**: వెంకటేశ్వర: నేనే రాజు నేనే మంత్రి, స్టార్: లై, విక్టరీ: జయ జానకి నాయక

557 మంది అభ్యాసకుల హాజరు

కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ సార్వత్రిక విద్యాపీఠం, సాక్షరభారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలకు కొమరోలు మండలంలోని 14 పంచాయితీలల్లో 557 మంది అభ్యాసకులు హాజరయినట్లు మండల సమన్వయకర్త బి.జె.యం ఆర్నాల్డ్ తెలిపారు. ఈ పరీక్షలను 14 పంచాయతీ కేంద్రాల్లో నిర్వహించారు. పరీక్షల నిర్వహణను స్థానిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులు పర్యవేక్షణలో నిర్వహించారు. పరిశీలకలుగా నియోజకవర్గ పర్యవేక్షకుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీవో జయరామిరెడ్డిలు వ్యవహరించారు.

20 ఎం.ఎం. కంకరకు పెరిగిన గిరాకీ

వారం వ్యవధిలో రూ.600 పెరిగిన యూనిట్ ధర
మొదలైన ఇరిగేషన్, రహదారి పనులతో ఏర్పడిన కొరత



గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఇటీవల పంచాయతీరాజ్ రహదారుల నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయి. దానికి తోడు 'నీరు - ప్రగతి' పనుల క్రింద చెక్ డ్యాంల నిర్మాణాలు చేపడుతుండటంతో 20 ఎం.ఎం. కంకర వినియోగానికి గిరాకీ ఏర్పడింది. నెల్లూరు జిల్లాకు చీమకుర్తి కంకరను తీసుకు వెళుతుండటంతో గిరాకీ తగ్గట్టుగా ఉత్పత్తి లేక ఈ కంకరకు డిమాండ్ పెరిగింది. చీమకుర్తిలో కంకర పెద్ద మొత్తంలో తయారు చేసే కంపెనీలు రెండు మాత్రమే ఉన్నాయి. మిగతా చిన్న చిన్న కంకర క్రషింగ్ యంత్రాల్లో తక్కువ మొత్తంలో ఉత్పత్తి అవుతుండటంతో ఈ పరిస్థితి తలెత్తింది. వారం రోజుల వరకు యూనిట్ రూ.1,400 నుంచి 1,600 ఉన్న 20 ఎం.ఎం. కంకర ప్రస్తుతం యూనిట్ రూ.2 వేలకు చేరుకుంది. కంకరను రవాణా చేస్తున్న లారీ యజమానులు గత వారం వరకు కిలోమీటరుకు రూ.75 వంతున వసూలు చేస్తున్న వారు ప్రస్తుతం కంకర తయారీ అయ్యే వరకు కంకర మిషన్ వద్ద లారీలను నిలుపుకోవాల్సి వస్తోందన్న సాకుతో కిలోమీటరుకు రూ.85 వంతున వసూలు చేస్తున్నారు. చీమకుర్తిలోని పలు కంకర క్రషింగ్ యంత్రాల యజమానులు 20 ఎంఎం కంకరకు ఉన్న డిమాండ్‌తో యూనిట్ కంకరను రూ.2,200 వంతున విక్రయిస్తున్నారు. పంచాయతీరాజ్ అధికారులకు మండలానికి నెలకు 2 కిలోమీటర్లు రహదారి నిర్మాణాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ లక్ష్యాలు విధించడంతో గుత్తేదారులకు అధికారుల నుంచి ఒత్తిడి పెరిగి గ్రామాల్లో రహదారి నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. అయితే జిల్లాలోని పలు మండలాల్లో పనులు చేపడుతున్న గుత్తేదారులకు ఈ కంకర దొరక్క పోవడంతో రహదారి నిర్మాణం పనులను ఆపివేయాల్సి వస్తోందని గుత్తేదారులు వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న డిమాండ్‌తో కంకర యూనిట్ ధర రూ.2,500 వరకు చేరుకొనే అవకాశం ఉందని గుత్తేదారులు ఆవేదన చెందుతున్నారు.

ఈనాడు మీ తోడు



మీ సమస్య ఏదైనా దాని పరిష్కారానికి మీకు 'ఈనాడు' తోడుగా నిలుస్తుంది. మీరు చేయాల్సిందల్లా మీరు ఎదుర్కొంటున్న సమస్య, మీ పేరు, గ్రామం తెలుపుతూ మాకు ఫోన్ చేయడమే. సంబంధిత అధికారి దృష్టికి మీ ఇబ్బందిని తీసుకెళ్లి ఆయన సమాధానాన్ని పత్రికలో ప్రచురిస్తాం.

ఫోన్ చేయాల్సిన నంబర్లు:

గిద్దలూరు పట్టణం	80085 74135
రాచర్ల	80085 74136
కొమరోలు	80085 74137
కొమరోలు గ్రామీణం	8008574138
కంభం	8008574141
బేస్తవారపేట	8008632343
అర్ధవీడు	9652372246

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

అర్ధవీడు, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడపరాదని ఎస్సై కోటయ్య వాహనదారులను హెచ్చరించారు. మండలంలోని నాగులవరం నరవ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద రహదారిలో ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని రెండు వాహనాల చోదకులపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై కోటయ్య

సత్యమాంబకు బోనాలు

బేస్తవారపేట, న్యూస్‌టుడే : మండల పరిధి గొట్టమిండ్ల సమీపంలోని కోటా సత్యమాంబదేవి అమ్మవారు ఆదివారం లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మకు బోనాలు, పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించారు. కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీచక్రానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని మణికంఠస్వామి, పుట్ట వద్ద పూజలు చేశారు. కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. పండితులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కంభం, బేస్తవారపేట, గిద్దలూరు, మార్కాపురం, నంద్యాల తదితర ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. వాహన పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో సత్యమాంబదేవి

సురక్షితంగా ఆరోగ్య రక్ష శస్త్రచికిత్స

కంభం, న్యూస్‌టుడే : స్థానిక ప్రభుత్వ వైద్యశాల నుంచి ఆరోగ్య రక్ష ద్వారా శస్త్రచికిత్స చేయించుకుని సురక్షితంగా బయటపడ్డ పోతిరెడ్డి పద్మావతిని డాక్టర్ రంగారావు శనివారం పరీక్షించారు. బేస్తవారపేటకు చెందిన పద్మావతికి హైపో థైరాయిడ్‌తో బాధ పడుతోంది. ఆమె గర్భసంచి సమస్యతో బాధపడుతుండగా ఎన్టీఆర్ వైద్యసేవలో వారికి అవకాశం లేకపోయింది. దీంతో కంభం ప్రభుత్వ వైద్యశాలకు పరీక్షల నిమిత్తం వెళ్లి వారి సమస్యను వైద్యుడికి తెలిపారు. వైద్యమిత్ర రామాంజనేయులు సహాయంతో ఆరోగ్య రక్షకు మీసేవాలో నగదు చెల్లించి అర్హత పొందారు. వెంటనే ఆమెను ఒంగోలు ప్రకాశం వైద్యశాలలో చేర్పించి శస్త్రచికిత్స చేయించారు. ఎన్టీఆర్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్య మిత్ర అడపాల రామాంజనేయులు, డాక్టర్ రంగారావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



పద్మావతిని పరీక్షిస్తున్న డాక్టర్ రంగారావు



అలంకరణలో అమ్మవారు

అమ్మవారికి ప్రత్యేక పూజలు

అక్కపల్లి (రాచర్ల), న్యూస్‌టుడే : మండలంలోని అక్కపల్లి సమీపంలోని కనక సురభేశ్వరాలయంలో శ్రావణ మాసం చివరి ఆదివారం సందర్భంగా అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా అష్టోత్తర నామార్చన, కుంకుమ పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకుడు మహిమలూరి నారాయణ భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. రాచర్ల, తురిమెల్ల, చోళ్లవీడు, గిద్దలూరు తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

గ్యాస్ సమాచారం

గిద్దలూరు: విష్ణునారాయణ గ్యాస్ ఏజెన్సీలో ఆగస్టు 19న నమోదు చేసుకున్న వినియోగదారులకు సిలిండర్లు సరఫరా చేస్తారు.

శ్రీరామ భారత్ గ్యాస్ ఏజెన్సీలో ఆగస్టు 19న నమోదు చేసుకున్న వినియోగదారులకు సిలిండర్లు సరఫరా చేస్తారు.

అర్ధవీడు: జగదీష్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 20 వరకు నమోదు చేసుకున్న వారికి సిలిండర్లు సరఫరా చేస్తామని నిర్వాహకుడు రఘురామ్‌రెడ్డి తెలిపారు.

బేస్తవారపేట : అనితా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో ఈనెల 16 వరకు నమోదు చేసుకున్న వారికి సోమవారం సిలిండర్లు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకురాలు దేవదానమ్మ తెలిపారు.

కంభం: స్థానిక రంగా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో ఈ నెల 18 వరకు నమోదు చేసుకున్న వినియోగదారులకు సిలిండర్లు సరఫరా చేయనున్నట్లు నిర్వాహకురాలు కనక దుర్గాదేవి తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల అందజేత

బేస్తవారపేట, న్యూస్‌టుడే: గ్యాస్ సిలిండర్లను తప్పక వినియోగించాలని ఎంఈవో జింకా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని 52 పాఠశాలలకు ఆదివారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. మోక్షగుండం సర్పంచి కొండసాని గోవిందమ్మకు సిలిండర్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్యాస్ సరఫరాతో మధ్యాహ్న భోజన నిర్వాహకుల కష్టాలు తీరతాయని చెప్పారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ సిలిండర్లతో ఎంఈవో వెంకటేశ్వర్లు, సర్పంచి గోవిందమ్మ

డివైడర్ పనుల పరిశీలన

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు నగర పంచాయతీలోని గిద్దలూరు - నంద్యాల రహదారిలో డివైడర్ ఆధునికీకరణ పనులపై ఈనాడులో 'నాసిరకంగా డివైడర్ ఆధునికీకరణ' అన్న శీర్షికతో ఆదివారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన నగర పంచాయతీ అధికారులు ఆదివారం సాయంత్రం పనులను పరిశీలించారు. అధికారుల ఆదేశాలతో గుత్తేదారు అక్కడ గ్రానైట్ రాళ్ల వ్యర్థాలతో ఉన్న కంకరను కొంతమేర తొలగించివేసి కొత్తకంకర తెప్పించి కాంక్రీట్ పనులు చేపట్టారు. ఆదివారం సాయంత్రం పనులను తనిఖీ చేసిన కమిషనర్ పి.కృష్ణమూర్తి ఇకపై రహదారి నిర్మాణాలకు ముందుగా గుత్తేదారు కంకర, ఇసుక తోలిన అధికారులు పరిశీలించిన తరువాత మాత్రమే పనులు చేపట్టాలన్నారు. నిత్యం సిబ్బంది దగ్గర ఉండి పనులు పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఏఈ సాంబిరెడ్డి, డా.బి.వి.రంగారావు, కౌన్సిలర్లు రమేష్, మండ్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



చిన్నారులతో మాట్లాడుతున్న లక్ష్మీసుధ

అర్ధవీడు, న్యూస్‌టుడే : గిరిజన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీసుధ అన్నారు. కంభంలోని బాలికల గురుకుల పాఠశాలలను ఆదివారం తనిఖీ చేసేందుకు వచ్చిన నేపథ్యంలో షెడ్యూల కులాల పరిరక్షణ సొసైటీ అధ్యక్షులు కాటమాల చెన్నకేశవరావు ఇందిరానగర్ చెంచుకాలనీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలపై ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం సాయంత్రం ఇందిరానగర్ చెంచు కాలనీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాల దస్త్రాలను పరిశీలించి, చిన్నారులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు స్థానికంగా ఉండాలని, చిన్నారులకు నాణ్యమైన భోజనం, మౌలిక వసతులు కల్పించాలని ప్రధానోపాధ్యాయులు, బాలగురువులకు సూచించారు. పాఠశాలపై ఫిర్యాదులొస్తే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, గిరిజనులు ఉన్నారు.

మార్కెట్ ధరలు

టమోటా-50, పచ్చిమిర్చి-45, దొండకాయలు-25, బంగాళదుంపలు-30, బెండ-30, బీట్‌రూట్-50, కాకర-70, క్యాబేజి-30

ఒకరో, ఇద్దరో తప్ప అంతా మిథ్యే

విద్యకు దూరంగా ఉన్న గ్రామీణుల్లో అక్షరాస్యత పెంచేందుకు ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. వయోజన విద్యా కేంద్రాలను నెలకొల్పి రాత్రి సమయాల్లో విద్యాభ్యాసం అందిస్తూ అక్షరాస్యత పెంచుతున్నారు. ఆచరణలో సత్ఫలితాలనివ్వడం లేదు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా నేషనల్ లిటరసీ మిషన్ అథారిటీ(ఎన్ఎల్ఎంఏ) ద్వారా అక్షరాస్యతా పరీక్ష నిర్వహించగా సాక్షర భారత్ కేంద్రాల పనితీరు అందుకు దర్పణం పడుతోంది. అద్దంకి సాక్షర భారత్ సమన్వయకర్త నాలుగు రోజులుగా అందుబాటులో లేకపోవడం విశేషం.

–న్యూస్‌టుడే, అద్దంకి బృందం

సాక్షరభారత్ ద్వారా అక్షరాస్యత 'వట్టి' మాటే

సాక్షర భారత్ కేంద్రాల నిర్వహణ నీటి మీద రాతగా మారింది. ప్రభుత్వం ఆయా కేంద్రాల్లో పనిచేసే సమన్వయకర్తలకు గౌరవ వేతనం రూ.2వేల నగదు, కేంద్రంలో రాతపుస్తకాలు, పాఠ్య పుస్తకాలతోపాటు విద్యకు అవసరమైన వస్తువులు సమకూరుస్తారు. ఉదయం పనులు ముగించుకున్న వారంతా అక్షరాభ్యాసం కోసం కేంద్రాలకు రావాల్సి ఉంది. జిల్లాలో అక్షరాస్యత పెంచేందుకు గతంలో పని చేసిన కలెక్టర్ విజయ కుమార్ తీవ్రంగా కృషి చేశారు. నిరక్షరాస్యుల్ని గుర్తించడం, రాత్రి పూట విద్యాకేంద్రాల వద్దకు తరలించి అక్షరాలు నేర్పించే ప్రయత్నం చేశారు. అద్దంకి మండలంలో ధర్మవరం, చిన్నకొత్తపల్లి, కలవకూరు, కొత్తరెడ్డిపాలెం, బొమ్మనంపాడు, రామాయపాలెం, తిమ్మాయపాలెం, కొటికలపూడి, కొంగపాడుల్లో కలిపి మొత్తం 514 మంది పరీక్షలు రాయాల్సి ఉంది. ఇందులో కొత్త అభ్యర్థులు 200 మంది ఉండగా గతంలో ఉత్తీర్ణత సాధించలేని వారు 314మంది వరకు ఉన్నారు. వీరందరికీ ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల్లోపు నిర్దేశిత ప్రశ్నాపత్రంలో జవాబులు పూరించాల్సి ఉంది. మొత్తం 150 మార్కులకు మూడు విభాగాల్లో అందిస్తారు. చదవడం, రాయడం, లెక్క లకు ఒక్కో దానికి 50మార్కుల చొప్పున కేటాయిస్తారు. వీటి ఆధారంగా అక్షరాస్యత శాతాన్ని గుర్తించే వీలుంటుంది. ఆదివారం సాక్షర భారత్ కేంద్రాల్లో నిర్వహించాల్సిన అక్షరాస్యత పరీక్షలో అసలు నిజాలు బయటపడ్డాయి.

పరీక్షలు సాగాయిలా

అద్దంకి పరిధిలోని కలవకూరు సాక్షరభారత్ కేంద్రం నిర్వహణ స్థానిక ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నారు. పరీక్ష మధ్యాహ్నం రెండు గంటల వరకు జరగలేదు. సాక్షరభారత్ పర్యవేక్షకులు డి.నాగేశ్వరరావు వచ్చి వాకబు చేయగా అలాంటిది ఎక్కడా నిర్వహించడం లేదని స్థానికులు చెప్పారు. మధ్యాహ్నం మూడు గంటలకు గ్రామసమన్వయకర్త రంగంలోకి దిగారు. ప్రార్థనలకు వెళ్లారని.. పరీక్ష రాసేందుకు వచ్చినట్లు చిత్రాలను శాఖాధికారులకు పంపారు.



ఇది మండలంలోని నాగులపాడు బీసీ కాలనీలో ఉన్న సాక్షర భారత్ కేంద్రం మూతపడి ఉంది. పరీక్ష నిర్వహించాలనే ఆలోచన సమన్వయకర్తలకు తెలుసో లేదో గానీ మధ్యాహ్నం మాత్రం మూత వేశారు.



ఇది రామాయపాలెంలోని సాక్షర భారత్ కేంద్రం. ఇక్కడ రెండు కేంద్రాలుండగా 18మంది పరీక్షలు రాయాల్సి ఉంది. వీరికి అదనంగా ఐదుగురిని పరీక్ష రాసేందుకు అనుమతించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేంద్రం వద్దకు పరీక్ష రాసేందుకు అభ్యాసకులు రాలేదు. ప్రార్థనకు, మందిరానికి వెళ్లారని గ్రామ సమన్వయకర్త అంజనారెడ్డి తెలిపారు.

సంతమాగులూరు మండలంలోని 20 కేంద్రాల్లో 381మంది అభ్యాసకులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, అంతా హాజరై పరీక్ష రాసినట్లు మండల సాక్షరభారత్ సమన్వయకర్త శ్రీనివాసరెడ్డి తెలిపారు. పరీక్ష జరుగుతుందన్న సమాచారం గ్రామ సమన్వయకర్తలకు తెలియదు. పరీక్షల గురించి ఎంఈవోకు సమాచారం లేదు.

తాళ్లూరు మండలంలోని ఆదివారం నిర్వహించిన పరీక్షలకు 544 మంది వయోజనులు హాజరయ్యారు. మధ్యాహ్నం 30 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. కొందరికి కనీసం రాయడం రాకపోవడంతో ఒకరినొకరు చూసి రాయడం కనిపించింది.

బల్లికురవ మండలంలోని రామాంజనేయపురం, ఎస్.ఎల్.గుడిపాడు, వైదన, కొండాయపాలెం, మాల్లాయపాలెం గ్రామాల ప్రాథమిక పాఠశాల, పంచాయతీ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. వయోజనులు ఎవరూ కనిపించలేదు. పిల్లలు ఆడుకుంటూ కనిపించారు. అధికారుల సూచన మేరకు కొందరు పరీక్షలో పాల్గొనట్లు లెక్క చూపారు.



శివరాంపురంలో చూసి రాస్తున్న వయోజనులు



ఎస్.ఎల్.గుడిపాడులో మూసివేసిన కేంద్రం

సమన్వయకర్త అందుబాటులో లేడు

అద్దంకి సాక్షర భారత్ సమన్వయకర్త నాలుగు రోజులుగా అందుబాటులో లేరు. అందువల్లే నేను మోదేపల్లి గ్రామ సమన్వయకర్త సహకారంతో పరీక్షలు జరిగే అన్ని కేంద్రాలు పరిశీలిస్తున్నాం. అద్దంకిలో 23, సంతమాగులూరులో 20, కొరిశపాడులో 14 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. ధర్మవరంలోని రెండు కేంద్రాలు, కలవకూరు కేంద్రం పరిశీలించాను. అవసరమైన నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తా.

– నాగేశ్వరరావు, సాక్షరభారత్ పర్యవేక్షకులు, అద్దంకి

మామపై అల్లుడు దాడి

తురకపాలెం(తాళ్లూరు): కుటుంబ కలహాలతో తురకపాలెంలో తన మామపై స్వయానా అల్లుడు దాడి చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన కె.వెంకట సుబ్బారెడ్డికి, అతని అల్లుడు వై.భాస్కరరెడ్డికి గత కొంత కాలంగా విభేదాలున్నాయి. వారు స్వయానా మామా, అల్లుళ్లే. కుటుంబ కలహాలతో శనివారం పొలానికి వెళ్లి వస్తున్న వెంకట సుబ్బారెడ్డిపై అతని అల్లుడు భాస్కరరెడ్డి దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ఒంగోలు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు ఎస్సై వి.మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పేర్లు తొలగించాక పునరావాస కాలనీ ముఖద్వారం

పునరావాస కాలనీకి ప్రైవేటు వ్యక్తుల పేర్లు తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామం అయిన పెద్దారవీడు మండలం కలనూతల వారికి మార్కాపురం మండలం దరిమడుగు శివారులోని ఇడుపూరు పొలాల్లో పునరావాసకాలనీ ఏర్పాటు చేశారు. ఇంకా నివాసాల ఏర్పాటు జరగలేదు. కానీ... కొందరు వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా కాలనీకి తమ పేర్లు పెట్టుకున్నారు. స్థానికుల అభ్యంతరాలను పట్టించుకోలేదు. ఈ విషయమై జులై 21న 'ఈనాడు'లో కథనం ప్రచురితమవడంతో... వెలుగొండ ప్రాజెక్టు ప్రత్యేక కలెక్టర్ పి.కొండయ్య స్పందించారు. కాలనీ ముఖద్వారంలో ఏర్పాటు చేసిన ప్రైవేటు వ్యక్తుల పేర్లు తొలగించారు. గుత్తేదారు పేరు మాత్రం అలానే ఉంచడం గమనార్హం. – న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

ఎన్‌సీడీసీ నిధుల మళ్లింపు అవకాశం లేదు

పశు సంవర్ధక శాఖ ఏడీ రవికుమార్

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ద్వారా జిల్లా యూనియన్‌కు మంజూరు చేసిన నిధులు పూర్తిగా పశుసంవర్ధకశాఖ నిబంధనల మేరకే మంజూరు చేసినట్లు ఆ శాఖ ఏడీ డాక్టర్ ఎం.రవికుమార్ ఆదివారమం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు నిధులను గొర్రెల పెంపకందారుల రుణాల కోసం మంజూరు చేశామన్నారు. జిల్లాకు మొదటి విడత రూ.1.41 కోట్లు విడుదల కాగా, 47 సొసైటీలకు చెందిన 146 మంది లబ్ధిదారులకు రుణాలుగా మంజూరు చేశామన్నారు. రెండో విడత రూ.3.70 కోట్లు విడుదల కాగా, 76 సొసైటీలకు చెందిన 373 మంది లబ్ధిదారులకు రుణాలుగా అందజేశామన్నారు. లబ్ధిదారులందరూ గొర్రెల పెంపకం వృత్తిలో తరతరాలుగా కొనసాగుతూ సొసైటీలో సభ్యులుగా ఉన్నారని.. ఈ నిధులను వేరే పనులకు బదలాయించడానికి నిబంధనలు అంగీకరించవని అన్నారు. దీనిపై ఇప్పటి వరకూ ఎలాంటి ఫిర్యాదులూ రాలేదని అన్నారు.

శాస్త్రీయ భావజాలంతోనే ప్రగతి

సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యాలయ భవనం ప్రారంభం

ఒంగోలు సంతపేట, న్యూస్‌టుడే: శాస్త్రీయ భావ జాలం పెంపొందించుకున్నప్పుడే అన్ని రంగాలోల అభివృద్ధి సాధించగలరని జిల్లా పరిషత్తు అధ్యక్షుడు ఈదర హరిబాబు అన్నారు. నగరంలోని ఈమనిపాలెంలో నూతనంగా నిర్మించిన సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యాలయం తరిమెల నాగిరెడ్డి భవనాన్ని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సీపీఐ(ఎంఎల్) అనుబంధమైన పీఎస్ఎఫ్‌లో తాను పని చేశానని.. అందువల్లే ఛైర్మన్ స్థాయికి ఎదగగలిగానన్నారు. ఏఐఎఫ్‌టీయూ న్యూ జాతీయ అధ్యక్షుడు గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ తరిమెల నాగిరెడ్డి శత జయంతి సందర్భంగా భవనాన్ని నిర్మించడం సంతోషదాయకమని అన్నారు. ప్రజాతంత్ర, హేతువాద భావ జలాన్ని పెంపొందించే కేంద్రంగా భవనం ఉంటుందన్నారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ చట్ట సభలను, ఎన్నికలను పోరాట వేదికగా ఉపయోగించుకున్న మార్కిస్టు, లెనినిస్ట్ మేధావిగా నాగిరెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఆయన రాసిన పుస్తకం నేటి ప్రజా ఉద్యమాలకు దిక్సూచిగా మారిందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి డీవీఎన్ స్వామి, భవన నిర్మాణ కమిటీ నాయకులు పంగులూరి గోవిందయ్య, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాలా అంజయ్య, సీపీఎం(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కొంగర నరసింహం, జిల్లా అభివృద్ధి కమిటీ వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు, సుపరిపాలన వేదిక నాయకులు టి.గోపాలరెడ్డి, విశ్రాంత అదనపు సంయుక్త కలెక్టరు ఎండీ షంషేర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న సింహాద్రి ఝాన్సీ

అరకొర..

చిన్నవి... అధ్వానమైనవి సరఫరా

మధ్యాహ్న భోజనంలో ఏజెన్సీల మాయ

సంతనూతలపాడు మండలంలో మొత్తం 49 పాఠశాలలు ఉండగా- ఆగస్టు నెల మొదటి పక్షం రోజుల్లో సుమారు 20 పాఠశాలలకు మాత్రమే గుడ్లు సరఫరా అయ్యాయి.

పేర్నమిట్ల ప్రధాన పాఠశాలలో 192 మంది విద్యార్థులు ఉంటే- 139 గుడ్లు మాత్రమే అందజేశారు. వాటిని విద్యార్థులకు ఎలా సర్దుబాటు చేయాలో అర్థంగాక ఉపాధ్యాయులు తలలు పట్టుకున్నారు.

గుమ్మళంపాడు పాఠశాలలో వారానికి మూడు చొప్పున 63 మంది విద్యార్థులకు మొత్తం 189 కోడిగుడ్లు అవసరం కాగా- 123 గుడ్లు మాత్రమే అందజేశారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో ఇదే పరిస్థితి. గుడ్లు అందకపోగా.. సరిపోని సమయాల్లో ఏమి చేయాలనే అంశంపై అధికారుల నుంచి స్పష్టత కొరవడింది.

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఉన్న నాలుకకు మందేస్తే కొండ నాలుక ఊడిందన్న చందంగా తయారైంది ప్రభుత్వ పాఠశాలల్లో కోడిగుడ్ల సరఫరా పరిస్థితి. మధ్యాహ్న భోజనం సమకూర్చే వంట ఏజెన్సీలు మెనూ ప్రకారం విద్యార్థులకు కోడి గుడ్లు ఇవ్వడం లేదని గుర్తించిన ప్రభుత్వం- ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా ఆ బాధ్యతను కొన్ని ఏజెన్సీలకు అప్పగించింది. కొటేషన్ల పద్ధతిలో మొత్తం 13 జిల్లాలకు మూడు ఏజెన్సీలను ఎంపిక చేసి.. వాటితో ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, తూర్పు గోదావరి జిల్లాలకు నెల్లూరుకు చెందిన ఏజెన్సీ గుడ్లు సరఫరా చేస్తోంది. ఏజెన్సీనే నేరుగా ప్రభుత్వ పాఠశాలలకు గుడ్లు అందించేలా ఏర్పాటు చేశారు. నిన్నటి వరకూ వంట నిర్వాహకులే మెనూ ప్రకారం భోజనంలో విద్యార్థులకు కోడిగుడ్లు వండి పెట్టేవారు. ఇటీవల ప్రభుత్వం వారానికి మూడు రోజులు గుడ్లు పెట్టాలని ఆదేశించింది. ఈ నిర్ణయం తర్వాత ఏజెన్సీల నియామకం జరిగింది. ఆగస్టు ఒకటి నుంచి ఈ విధానం అమల్లోకి వచ్చింది.



గోళీల పరిమాణంలో ఉన్న కోడిగుడ్లు



పాఠశాలలకు ఏజెన్సీ ద్వారా అందిన గుడ్లు

ఇదీ నేపథ్యం

వారానికి మూడు గుడ్ల నిర్ణయం వచ్చాక, రాష్ట్ర వ్యాప్తంగా కొందరు వంట నిర్వాహక ఏజెన్సీలు పెరిగిన ధరలతో తాము ఆ మేరకు ఇవ్వలేమని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చిన్న పరిమాణంలో ఉన్న గుడ్లు ఇస్తున్నారనే ఫిర్యాదులు కూడా ప్రభుత్వం దృష్టికి వచ్చాయి. దీని దృష్టిలో పెట్టుకుని ఏకమొత్తంలో ఒకేసారి పాఠశాలకు వారానికి సరిపోయే గుడ్లు ఇచ్చేలా ఏజెన్సీలకు బాధ్యత అప్పగించారు. దీనిని పక్కాగా అమలు చేయడంతోపాటు నెలలో అయిదు వారాలకు అయిదు రంగులతో ముద్ర వేసి సరఫరా చేయాలని ఆదేశాలిచ్చారు. ఇంత వరకూ బాగానే ఉన్నా.. అమలులోనే డొల్లతనం బయటపడింది.



గోళీలతో పోటీ

ప్రభుత్వ పాఠశాలలకు పది రోజులుగా సరఫరా అవుతున్న గుడ్లను చూస్తే గుడ్లు తేలేయాల్సిన పరిస్థితి నెలకొంది. గుడ్లు ఇలా కూడా, ఇంత చిన్న పరిమాణంలోనూ ఉంటాయా అని నోరెళ్లబెట్టక మానరు. ఎందుకంటే గోళీలతో సమానంగా ఉన్న గుడ్లు పాఠశాలలకు అందాయి. అదీ లెక్కా పత్రం లేకుండానే. ఉన్న పిల్లల సంఖ్యకు సరఫరా చేస్తున్న గుడ్లకు పొంతన లేదు. ఏప్రిల్‌కు ముందు లెక్కల ప్రకారం గుడ్లు ఇస్తున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీని వల్ల కొత్తగా ఈ ఏడాది చేరిన పిల్లలకు గుడ్లు ఎలా పెట్టాలో అర్థం కావడం లేదని ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ఒక్కో మండలంలో 30 నుంచి 50కిపైగా పాఠశాలలు ఉండగా- మొదటివారం సగం పాఠశాలలకు కూడా గుడ్లు అందలేదు.

> 'గుడ్లు సరిపడా అందకపోవడానికి తోడు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యం సరఫరాలోనూ గందరగోళ పరిస్థితి నెలకొంది. రేషన్ డీలర్లు ప్రతి నెలా15వతేదీలోగా గోదాముల్లో బియ్యం తీసుకుంటున్నా.. పాఠశాలలకు మాత్రం అవి అందడం లేదు. ప్రతి నెలా 18వతేదీకల్లా పాఠశాలలకు తదుపరి నెల ఎన్ని బియ్యం కావాలనే ఇండెంట్లను డీఈవో కార్యాలయానికి పంపాలి. ముందు పెట్టిన ఇండెంట్ ప్రకారం బియ్యం అందకుండానే కొత్త ఇండెంట్లు పంపడం మండల స్థాయి అధికారులకు తలనొప్పిగా మారింది.'



మాట్లాడుతున్న పాలేటి రామారావు

చరిత్రలో యాదవులది కీలక స్థానం

సాంస్కృతిక సంపదను భావితరాలకు అందించాలి

చీరాల, న్యూస్‌టుడే : ప్రాచీన సాంస్కృతిక సంపదను, మానవ వికాసాన్ని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మాజీ మంత్రి పాలేటి రామారావు పేర్కొన్నారు. యాదవ జీవిత చరిత్ర, దేశభక్తియుత వీరోచిత పాత్ర అనే అంశంపై ఆదివారం అవగాహన సదస్సు జరిగింది. పేరాలలోని గోలి సదాశివరావు కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాలేటి మాట్లాడుతూ భారతదేశంలో యాదవులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. మిగిలిన కులాల్లోనూ గొప్ప సాంస్కృతిక సంపద ఉందని, అయితే ప్రస్తుతం ఆధునికీకరణ నేపథ్యంలో ఆ వారసత్వం కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. దీని కోసం అన్ని కులాల చరిత్ర తెలిసిన కవులు, మేధావులతో ఒక సమ్మేళనం ఏర్పాటు చేసి ఆయా కులాల గొప్పతనాన్ని ప్రజలకు వివరించేందుకు కృషిచేయాలన్నారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు, జానపద సాహిత్య పరిశోధకులు ఆచార్య జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో యాదవులది విడదీయరాని పాత్రన్నారు. ప్రాచీన కాలం నుంచీ యాదవులు ప్రకృతితో మమేకమై జీవించేవారని చెప్పారు. నేటి తరం యాదవులంతా ఆ సంస్కృతిని పరిరక్షించాలని సూచించారు. ప్రత్యేకంగా మ్యూజియం ఏర్పాటు చేసి వారసత్వ సంపదను భావితరాలకు అందించాలన్నారు. దీనిపై తాను పరిశోధన చేసి వివిధ ప్రాంతాలలో తిరిగి యాదవుల సంస్కృతికి సంబంధించిన వివరాలు సేకరించానన్నారు. లండన్ మ్యూజియంలో నేటికీ యాదవుల చరిత్ర, పరిపాలనాదక్షతకు సంబంధించిన సాక్ష్యాలు సజీవంగా ఉన్నాయన్నారు. యాదవులకు ఉన్న గొప్ప సాంస్కృతికత రాజకీయశక్తిగా ఎదగటానికి దోహదపడుతుందని చెప్పారు. అంతకు ముందు పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యాదవ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు పిన్నిక శ్రీనివాస్ యాదవ్, ఎంపీపీ గవిని శ్రీనివాసరావు, బాపట్ల మున్సిపల్ ఛైర్మన్ తోట మల్లేశ్వరి, మించాల సాంబశివరావు, పులి వెంకటేశ్వర్లు, పులి వెంకటరావు, పీవీ రామారావు, పాకల వెంకటరావు, కీర్తి కృష్ణారావు, వివిధ ప్రాంతాలకు చెదిన యాదవ రచయితలు పాల్గొన్నారు.



హాజరైన సంఘీయులు



డాక్టర్ ఎం.వెంకయ్యను సత్కరిస్తున్న దృశ్యం

డాక్టర్ వెంకయ్యకు సర్జన్ల సదస్సులో సత్కారం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: రిమ్స్‌లో పని చేస్తున్న శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ఎం.వెంకయ్యను గుంటూరు వైద్య కళాశాలలో జరిగిన సర్జన్ల సదస్సులో సత్కరించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఈ సదస్సులో జిల్లాకు చెందిన పలువురు వైద్యులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు వేల మంది పాల్గొన్నారు. చివరి రోజు ఆదివారం వెంకయ్యను సత్కరించారు. గ్రామీణ ప్రజలకు దీర్ఘకాలంగా సేవలు అందించడం, లక్షకుపైగా శస్త్రచికిత్సలు చేయడంతో పాటు రాష్ట్రపతి పురస్కారం, ముఖ్యమంత్రి చేతుల మీదుగా మురారి పురస్కారం అందుకున్న వెంకయ్యను సదస్సులో ప్రత్యేకంగా అభినందించారు. జీఎంసీ ప్రిన్సిపల్ జి.సుబ్బారావు, నిర్వాహకులు శ్రీనివాసరావు తదితరులు సదస్సులో వెంకయ్య సేవలను వివరించారు.

చదువుతోనే ప్రగతి

నైతిక విలువల్లో రాజీ పడొద్దు

పద్మశ్రీ అవార్డు గ్రహీత మోహన్‌రెడ్డికి ఘన సన్మానం



ఆర్వోప్లాంటును ప్రారంభిస్తున్న మోహన్‌రెడ్డి

మోక్షగుండం(బేస్తవారపేట), న్యూస్‌టుడే: చదువుతోనే ప్రగతి సాధ్యమని పద్మశ్రీ అవార్డు గ్రహీత, సెయింట్ ఫౌండేషన్ ఛైర్మన్ బోదనపు వెంకట రామమోహన్‌రెడ్డి అన్నారు. అవార్డు తీసుకున్న సందర్భంగా స్వగ్రామం మోక్షగుండంలో ఆదివారం సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి నైతిక విలువలను మరిచిపోకూడదన్నారు. విలువలకు కట్టుబడి పనిచేయడమే తన విజయ రహస్యమన్నారు. తన తల్లిదండ్రులు చదువు విలువ తెలియజెప్పారన్నారు. చిన్నతనంలో కంభంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివిన రోజులు ఇప్పటికీ గుర్తున్నాయన్నారు. వంద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మోక్షగుండం ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్పు చేయిస్తామన్నారు. పాఠశాల ఆట స్థలం కోసం భూమి కొనుగోలు చేస్తామన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. బీవీ మోహన్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలన్నారు. పాఠశాల, గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. ఇప్పటి వరకు పాఠశాల అభివృద్ధికి రూ.23 లక్షలు ఖర్చు చేశారన్నారు. నియోజకవర్గంలో విద్యకు ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. ఎంపీపీ ఓసూరరెడ్డి మాట్లాడుతూ మారుమూల గ్రామాల బడులను దత్తత తీసుకోవాలని కోరారు. సభకు కె.బాలిరెడ్డి అధ్యక్షత వహించారు. చేయుత మిత్ర మండలి సభ్యులు జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో గిద్దలూరు ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు ఐజయ్య, మండల ఉపాధ్యక్షుడు గాలిరెడ్డి, సర్పంచులు కొండసాని గోవిందమ్మ, ఎంపీటీసీ సభ్యుడు చిలకల కేశవరెడ్డి, విద్యాకమిటీ ఛైర్మన్ ఉప్పులూరి రామకృష్ణారెడ్డి, బేస్తవారపేట, కంభం ఎంఈవోలు వెంకటేశ్వర్లు, మాధవకృష్ణారావు, సర్పంచులు కర్నాటి మోహన్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, భూపాల్ రెడ్డి, ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి, శివారెడ్డి, పూర్వ ప్రధానోపాధ్యాయుడు రఘునాథ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



మెహన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ తదితరులు

ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది. శాస్త్ర పరిశోధనలు ప్రపంచాన్నే శాసిస్తున్నాయి. మన దేశ శాస్త్ర సాంకేతిక రంగం కూడా ఎంతో పురోభివృద్ధిని సాధిస్తోంది. ఎందరో ఔత్సాహికులు ఇటు వైపు మొగ్గు చూపుతున్నారు. ఇలాంటి వారి స్ఫూర్తితో గ్రామీణ ప్రాంత యువకులు కూడా అడుగులు వేస్తున్నారు. ఇందుకు పీసీపల్లి మండలం నేరేడుపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడే నిదర్శనం.

నానో సాంకేతికత సాయంతో క్యాన్సర్ కణాలను గుర్తించడం.. వాటిని తొలగించడం వంటి అంశాలపై విస్తృతంగా పరిశోధనలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో తాను రాసిన వ్యాసాలు అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమై పలువురి మన్ననలు అందుకున్నాయి. ఏకంగా కొన్ని దేశాలు తమ తరఫున పరిశోధనలు చేసేందుకు రావాలని ఆహ్వానించడం ఆ గ్రామీణ యువకుడి ప్రతిభకు తార్కాణం.

నేరేడుపల్లి కుర్రోడు.. పరిశోధనల్లో మెరిశాడు



- నానో పరిజ్ఞానంపై విస్తృత అధ్యయనం
- క్యాన్సర్ కణాల తొలగింపుపై పరిశోధన
- అంతర్జాతీయ జర్నల్స్‌లో వ్యాసాల ప్రచురణ
- ప్రశంసలందుకుంటున్న యువ శాస్త్రవేత్త బ్రహ్మయ్య


యువ శాస్త్రవేత్త బ్రహ్మయ్య

కనిగిరి, న్యూస్‌టుడే: పీసీపల్లి మండలం నేరేడుపల్లి గ్రామానికి చెందిన మీసరగుండ్ల రమణయ్య, అనంతలక్ష్మి దంపతుల కుమారుడు బ్రహ్మయ్య. ఇతను డిగ్రీ వరకు కనిగిరిలో చదువుకున్నారు. అనంతరం ఎమ్మెస్సీని విశాఖపట్టణంలో పూర్తిచేశారు. కోల్‌కతాలో రసాయనిక శాస్త్రంలో పీహెచ్‌డీ చేశారు. ఇందుకుగాను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సీఎస్ఐర్ మాజీ డైరక్టర్ ఆర్.ఏ.మసీల్కర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను బ్రహ్మయ్య అందుకున్నారు.

ప్రతిభతో ఫెలోషిప్‌లకు ఎంపిక...

బ్రహ్మయ్య నానో టెక్నాలజీ ద్వారా క్యాన్సర్ కణాల గుర్తింపుపై విస్తృత పరిశోధనలు సాగించారు. కణాలను గుర్తించడమే కాకుండా వాటిని తొలగించడం అనే అంశం దిశగా ఇవి సాగాయి. బ్రహ్మయ్య తన పరిశోధనలను కొనసాగించేందుకు మనదేశంలోని నేషనల్ పోస్ట్ డాక్టరోల్ ఫెలోషిప్ సంస్థ ఆర్థిక సహకారం అందించింది. ఈ అంశంపై తన పరిశోధనలు కొనసాగించేందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందించేందుకు గాను చైనా, జర్మనీ దేశాలు కూడా ముందుకు రావడం విశేషం. ఈ క్రమంలో అతను రాసిన ఎన్నో వ్యాసాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. వీటిని చూసిన ఎన్నో సంస్థలు పరిశోధనలకు తమవంతు సహకారం అందించేందుకు ముందుకొచ్చాయి. బ్రహ్మయ్య ప్రస్తుతం జర్మనీలోని గ్రీప్స్వాల్ట్ యూనివర్శిటీలో నానో పార్టికల్స్, గుండె జబ్బుల నిరోధకతపై పరిశోధనలు సాగిస్తున్నారు.


ఇంగ్లండ్, అమెరికా జర్నల్స్‌లో ప్రచురితమైన బ్రహ్మయ్య పరిశోధనలు



రసాయన శాస్త్రంలో డాక్టరేట్ పట్టా అందుకుంటున్న బ్రహ్మయ్య

మంచి శాస్త్రవేత్తగా పేరు తెచ్చుకోవాలి...

నాకు చిన్నప్పటి నుంచి సైన్స్ అంటే ఎంతో ఇష్టం. అందులో రసాయన శాస్త్రం అంటే మక్కువ. ఎప్పటికైనా మంచి శాస్త్రవేత్తగా పేరు తెచ్చుకోవాలని చిన్నప్పటి నుంచి అనుకునేవాడిని. ఇందుకు నా తల్లిదండ్రులు, మామయ్యల సహకారం ఎంతో ఉంది. మానవాళికి ఉపయోగపడే పరిజ్ఞానాన్ని ఎప్పటికైనా కనుగొని దేశానికి మంచి పేరు తెచ్చేలా కృషిచేస్తాను. –బ్రహ్మయ్య

చిత్రం.. భళారే స్త్రీ వేషం...

- మహిళల వస్త్రధారణలో పురుషులు
- ఆడబిడ్డల క్షేమం కోరుతూ మొక్కులు
- తరతరాలుగా కొనసాగుతున్న ఆచారం

మూడేళ్లకోసారి సాగే తిరునాళ్ల.. జీవనోపాధి కోసం ఉన్న ఊరు విడిచి ఎక్కడెక్కడో స్థిరపడిన వాళ్లంతా తరలివస్తారు.. ఊరంతా సందడిగా మారుతుంది.. బొల్లావుల ఊరేగింపులు.. ఔత్సాహికుల నృత్యాలు.. భక్తుల పూజలు షరామామూలే. ఇదంతా ఏ ఉత్సవాలు.. తిరునాళ్లలో అయినా కనిపించే దృశ్యాలే కదా.. అంటారా..!! అయితే ఈ సందడి మధ్యలో కొందరు పురుషులు మాత్రం ఇక్కడ ప్రత్యేకంగా కనిపిస్తారు. వీరు స్త్రీల వేషధారణలో మెరుస్తారు.. ఆభరణాలు ధరించి అలంకరణతో ముచ్చటగొలుపుతారు. చేతుల్లో చాటలు పట్టుకుని అమ్మవారి గ్రామోత్సవం ఎదుట నృత్యాలు చేస్తారు. ఊరేగింపు సాగినంత సేపు వీరు అదే వేషధారణలో ఉంటారు. తెల్లవారే సమయంలో అమ్మవారు దేవాలయ ప్రవేశం చేసిన తర్వాత ఆ వేషాన్ని తొలగిస్తారు. ఇదీ ఈ ఉత్సవం ప్రత్యేకత. ఈ ప్రత్యేక వేషధారణంతా ఎందుకంటారా.. అయితే ఆ విశేషాలేంటో మీరూ తెలుసుకోండి...


మొక్కుబడిలో భాగంగా స్త్రీల వేషధారణలో ఉన్న పురుషులు


చేతిలో చేటలతో ఊరేగింపులో స్త్రీ వేషధారుల ఉత్సాహం

గుడ్లూరు, న్యూస్‌టుడే: గుడ్లూరు మిట్టపాలెంలోని వడియరాజుల కాలనీలో ఉంది అంకమ్మ తల్లి దేవాలయం. సుమారు 500 సంవత్సరాల క్రితం కందుల, కుంచాల కుటుంబాలకు చెందిన కొందరు బంగారం తీసుకుని వస్తున్నారు. గమ్యస్థానం చేరిన తర్వాత పేటిక తెరిచి చూస్తే వారంతా కంగుతిన్నారు. అందులో బంగారం బదులు బాలిక ఉండటం ఇందుకు కారణం. దోష నివారణకు ఏంచేయాలని వారు ఆ బాలికను కోరారు. ఇందుకుగాను దేవాలయం నిర్మించి పూజిస్తే దోషం తొలగుతుందని ఆ బాలిక పలికింది. అప్పటి నుంచి దేవాలయం నిర్మించి పూజాదికాలు నిర్వహిస్తున్నారు.. ఇదీ ఇక్కడ వినిపించే ఓ గాధ.

మొక్కుబడి 'ప్రత్యేకం'.. వేషధారణ...

గ్రామ దేవత అంకమ్మ తల్లి కొలిచిన భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి. అంకమ్మను పూజించిన వారికి సకల సౌభాగ్యాలు కలుగుతాయని ఇక్కడి వారి నమ్మిక. గ్రామంలో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తారు. ఈ తిరునాళ్లకు ఓ ప్రత్యేకత ఉంది. కందుల, కుంచాల, వల్లెపు, గుంజి, తన్నీరు, పల్లపు, బెల్లంకొండ, చల్లా కుటుంబాల వారు వంశపారంపర్యంగా దేవత పూజల్లో ఉన్నారు.

◗ అమ్మవారిని తీసుకుని వచ్చే సమయంలో పురుషులు స్త్రీవేషంలోనే వెళ్తారు. అమ్మవారిని ప్రసన్నం చేసుకోవడానికి భక్తులు స్త్రీవేషధారణ ధరిస్తేనే కోరికలు తీరుతాయని ప్రతీతి. తమకు సమస్యలు, కష్టాలు, శుభాల సమయంలో అంకమ్మను వేడుకొంటారు. తాము అనుకున్నది నెరవేరితే స్త్రీవేషధారణతో తిరుణాళ్లలో నృత్యం చేస్తామని మొక్కుకుంటారు. దీనినే 'పాప వేషం' అంటారు. తిరునాళ్ల రోజు జలధిలో ఉంచిన అమ్మవారిని గ్రామోత్సవానికి నిర్వాహకులు సిద్ధం చేయగానే అక్కడి నుంచి పాప వేషం వేసిన పురుషులు చాటలు, వేపాకు చేత పట్టి సామూహికంగా నృత్యాలు చేస్తారు. ఇందులో సంవత్సరం వయసున్న బాలుడి నుంచి వృద్ధుని వరకు ఉంటారు.

◗ గతంలో కేవలం వడియరాజులు మాత్రమే పాప వేషధారణలో పాల్గొనేవారు. ఇప్పుడు అన్ని వర్గాల వారు ఇలా వేషధారణలో మొక్కులు తీర్చుకోవడం పరిపాటిగా మారింది. తిరునాళ్ల సమయంలో దూరప్రాంతాలైన హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబాయి, ఒడిశా ప్రాంతాల్లో స్థిరపడిన స్థానికులు వచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటుంటారు. ఇక్కడ ఎక్కువ మంది అమ్మవారి పేరు పెట్టుకోవడం కూడా విశేషం. అంకమ్మ, అంకమ్మరావు, అంకజ్యోతి, అంకబాబు.. ఇలా చాలా వరకు ఆ తల్లి పేరుతోనే ఉంటాయి.


అంకమ్మ తల్లి దేవాలయ ప్రవేశ ద్వారాలు

ఎనిమిది తరాలుగా ఆచారం...



గ్రామ దేవత అయిన అంకమ్మ తల్లి పిలిస్తే పలికే వరాల తల్లి. సుమారు ఎనిమిది తరాల నుంచి మేము దేవతను పూజిస్తున్నాం. భక్తుల మనోభీష్టాలు నెరవేర్చే దేవత అంకమ్మ తల్లి. మొక్కుబడిగా ఇలా స్త్రీ వేషధారణ ధరిస్తుంటాం. ఇంటి ఆడబిడ్డల సంక్షేమాన్నీ ఇలా కోరుకుంటాం.
– కుంచాల కొండయ్య

అమ్మవారే అభయం...



అమ్మ వారే ఊరి వాసులకు అభయం. తల్లిని మా పూర్వీకులే గ్రామానికి తీసుకొచ్చారు. అందుకే తిరునాళ్ల సమయంలో మా పెద్దలు అమ్మవారిని సముద్ర స్నానానికి, అక్కడి నుంచి దేవాలయానికి మోసుకొస్తుంటారు. అమ్మవారిని తలుచుకుని పనులు ప్రారంభిస్తే ఓ అభయం ఉంటుందని ప్రగాఢ నమ్మకం.
–కందుల కోటయ్య

పాలవెల్లి.. పెదగోగులపల్లి...

- ✦ ఊరి వాసులకు ఆదరువుగా పాడి ✦ కరవు పరిస్థితులకు విరుగుడు
- ✦ విస్తారంగా బహుళ వార్షిక గడ్డి సాగు

వ్యవసాయం ఓ జూదంలా మారింది. వెన్నాడుతున్న వర్షాభావ పరిస్థితులు.. ఆరుగాలం శ్రమించి పండించినా.. దిగజారే వ్యవసాయ ఉత్పత్తి ధరలు.. పెట్టిన పెట్టుబడీ ఒక్కోసారి చేతికి రాని దుస్థితి. ఇక కొద్ది సంవత్సరాలుగా ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పొలాలు సాగుకు నోచుకోక బీళ్లుగా పడి ఉంటున్నాయి. ఈ పరిస్థితుల్లో చాలా మంది ఉన్న ఊళ్లను వదిలి జీవనోపాధికి పట్టణాల వైపు పరుగులు తీస్తున్నారు. ఇలాంటి వాటిలో సీఎస్‌పురం మండలంలోని పెదగోగులపల్లి గ్రామం కూడా ఒకటి. ఇక్కడ పంటలు పండ లేదు. బత్తాయి చెట్లు ఎండిపోయాయి. అయినా వారు అధైర్య పడలేదు. కన్న తల్లి వంటి ఉన్న ఊరు విడిచి దూరప్రాంతాలకు వలస వెళ్లలేదు. పరిస్థితులకు అనుగుణంగా ఉన్న వనరులను తమకు అనుకూలంగా మలుచుకున్నారు. కరవుపై 'పశు'పాస్త్రాలను సంధించారు. పరిస్థితులను ఎదురొడ్డి నిలిచి అందులోనే ఉపాధి అవకాశాలను వెతుకున్నారు. మొత్తంగా ఊరిని ఓ పాలవెల్లిలా మార్చుకున్నారు.

–న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

మండలంలోని గ్రామాల్లో పెదగోగులపల్లి ఒకటి. ఇక్కడ రైతులు మొదటి నుంచి పాడికి ప్రాధాన్యం ఇచ్చేవారు. పాల ఉత్పత్తిని జీవనాధారంగా మార్చుకున్నారు. గతంలో ఇక్కడ తక్కువ పాడిగేదెలుండేవి. వర్షాభావం.. వరుస కరవు పరిస్థితుల నేపథ్యంలో ఇక్కడి రైతులు పశుపోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. గ్రామంలో 200 మంది రైతులు తమ వ్యవసాయ భూముల్లో విస్తారంగా బహుళ వార్షిక పశుగ్రాసం పెంచుతున్నారు. ఇది పాడి పశువులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. గ్రామంలో పాడిగేదెల సంఖ్య పెరగడంతో భూమి ఉండి నీటి వసతి ఉన్న రైతులు పశుగ్రాసాన్ని సాగు చేస్తున్నారు. పాడిపై రైతులు మక్కువ చూపుతుండటంతో ప్రభుత్వం 28 మందికి ముర్రా జాతి గేదెలను రాయితీపై అందజేసింది. గ్రామంలో 800 కుటంబాలు ఉంటే 95శాతం మందికి పైగా పాడిగేదెలుండటం విశేషం.

- గ్రామం పేరు...: పెదగోగులపల్లి
- కుటుంబాల సంఖ్య...: 800
- జనాభా...: 2500
- పశువుల సంఖ్య...: 1500
- పాలిచ్చే గేదెలు...: 600
- రోజూ ఉత్పత్తి అవుతున్న పాలు...: సుమారు 1800 లీటర్లు
- పాల కేంద్రాల సంఖ్య...: 04
- నెలకు పాల ఉత్పత్తిదారులకు అందుతున్న నగదు...: సుమారు రూ.24,30,000




బహుళ వార్షిక గడ్డిని కోస్తున్న మహిళ


పాలు పితుకుతున్న మహిళ

పాడి జీవనాధారమైంది...



మాకు రెండు పాడిగేదెలు ఉన్నాయి. రోజుకు నాలుగు లీటర్ల పాలు ఇస్తాయి. పాడి ద్వారా సరాసరి రూ.6 వేలు ఆదాయం వస్తుంది. పాడి ఇప్పుడు మాకు జీవనాధారమైంది. వ్యవసాయం వలన ప్రస్తుతం లాభాలు లేవు. గ్రామంలో చాలావరకు పాడిపై దృష్టి సారించి గేదెలను పెంచుతున్నాం. –పునుగుబాటి సుబ్బరత్నమ్మ, పశుపోషకురాలు

పశువులపై ప్రత్యేక శ్రద్ధ...



గ్రామంలో పశువులపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. చాలా మంది పశుపోషకులు బహుళ వార్షిక గడ్డిని సాగు చేస్తున్నారు. పాడి ద్వారా పాలఉత్పత్తి చేసి పోషకులు వేలాది రూపాలయల ఆదాయం పొందుతున్నారు. పాల కేంద్రం ద్వారా మాకు ఉపాధి లభిస్తోంది.
–గోగడి వెంకటనారాయణ, పాలకేంద్రం నిర్వాహకుడు

పశుపోషణలో మెలకువలు అవసరం...



మెలకువలు పాటించి పశుపోషణ చేపడితే మంచి ఆదాయం గడించవచ్చు. ప్రభుత్వం పశుపోషణకు అధిక ప్రాధాన్యం ఇచ్చి బహళ వార్షిక గడ్డి విత్తనాలను 75 శాతం రాయితీపై అందిస్తోంది. పెదగోగులపల్లి గ్రామంలోని పశుపోషకులకు 4 టన్నుల దాణా, ఒక టన్ను గడ్డిజొన్న విత్తనాలను పంపిణీ చేశాం. పెదగోగులపల్లి గ్రామంలో పాడి పోషణ బాగుంది. –షేక్ మునీర్, పశువైద్యాధికారి



విద్యార్థులకు విద్యతో పాటు శారీరక, మానసిక వికాసాన్ని అందించి పరిపూర్ణ వ్యక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పాఠశాలల్లో అనేక పథకాలను అమలు చేస్తోంది. అయితే వీటిని క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయడంలో విఫలమవుతున్నారు. అమలును కాగితాలకే పరిమితం చేస్తున్నారు. రాష్ట్రస్థాయి నుంచి పాఠశాల స్థాయి వరకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందజేస్తున్నారని పదే పదే చెబుతున్నారు. కానీ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే వాటి అమలుపై చిత్తశుద్ధితో కృషిచేయడం లేదనే విమర్శలున్నాయి. కాగితాలకే పరిమితమైన వాటిని ఆచరణలో అమలు చేయగలిగితే విద్యార్థులు భవిష్యత్తులో పరిపూర్ణమైన భావి భారత పౌరులుగా ఎదుగుతారనడంలో సందేహం లేదు. మరి ఆ పథకాలేమిటో ఓసారి తెలుసుకుందాం...

–న్యూస్‌టుడే, పొదిలి

వికసించని.. రేపటి భారతాన్ని..!!

- పేరుకు పథకాలు బోలెడు
- అమలుకే పడవు అడుగులు
- అలంకారప్రాయంగా వికాస పథకాలు
- సద్వినియోగంతో భవితకు బంగారం

ఆరోగ్యమే మహా భాగ్యం...

ప్రతి పాఠశాలలో చురుకైన విద్యార్థులతో ఆరోగ్య క్లబ్‌లు ఎంపిక చేసి వారి ద్వారా మిగతా వారికి వారం రోజుల పాటు రోజుకో ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించాలి. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య విషయాలను తెలిపి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారు చేయాలనేది ఈ పథకం లక్ష్యం. ప్రభుత్వ పాఠశాలల్లో ఆరోగ్యక్లబ్‌లు నామమాత్రంగా నడుస్తున్నాయి. అస్సలు కాగితాలకే పరిమితమయ్యాయని చెప్పవచ్చు. కేవలం పరిశుభ్రతా దినోత్సవం, డీవార్మింగ్ రోజున మాత్రమే తూతూ మంత్రంగా ఆరోగ్యవిషయాలపై అవగాహన కల్పిస్తున్నారు.

కానరాని 'డాక్టర్ చిన్నారి'...

పాఠశాలల్లోని పిల్లల రుగ్మతలను గుర్తించి నయం చేసేందుకు కృషిచేయడం ఈ పథకం లక్ష్యం. జవహర్ బాల ఆరోగ్యరక్ష కింద చిన్నారి డాక్టర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఏడాదిలో ఒక్కసారైనా పాఠశాలకు వైద్యులు సందర్శించి విద్యార్థుల రుగ్మతలను గమనించి వారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి. వైద్యుల కొరత వల్ల అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడం లేదు.

మొబైల్ సైన్స్ ప్రాజెక్టులు...

రాజీవ్ విద్యామిషన్ ద్వారా పాఠశాల విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని కలిగించి వారితో ప్రాజెక్టుల రూపకల్పన చేసే విధంగా తయారుచేసేందుకు రెండేళ్ల క్రితం మొబైల్ సైన్స్ వ్యాన్లు కేటాయించారు. ప్రస్తుతం జిల్లాలో సైన్స్ వ్యాన్లు తిరగడం లేదు. విద్యార్థులను చైతన్యపరిచిన సందర్భాలు లేవు. సైన్స్ దినోత్సవాల సందర్భంగా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులే చిన్న చిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య నేర్చుకుంటున్న విద్యార్థినులు

'మన టీవీ' కార్యక్రమాల పథకం...

పాఠశాల విద్యాశాఖ, రాష్ట్రీయ విద్యా మిషన్ శాఖలు నిర్దేశించిన కార్యక్రమాలను మన టీవీ ద్వారా ప్రసారం చేస్తారు. వీటి ద్వారా వచ్చే ప్రసారాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు చూపించాల్సి ఉంది. తద్వారా విద్యార్థుల్లో విద్య, వైజ్ఞానిక, సృజనాత్మకత, పరిశీలనశక్తి పెంపొందుతాయి. ఈ పథకం ప్రారంభించి సుమారు ఎనిమిది సంవత్సరాలు కావస్తున్నా నేటికీ అన్ని పాఠశాలల్లో టీవీ సౌకర్యం లేదు.

ఆటలూ సరిగా లేవు...

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వారానికి మూడు రోజుల్లో విద్యార్థులకు ఆసక్తి ఉన్న క్రీడలను ఆడించేందుకు విద్యార్థుల్లోనే గ్రూపులుగా క్రీడల క్లబ్బులు ఏర్పాటుచేయాల్సి ఉంది. తద్వారా విద్యార్థుల్లో శారీరక, మానసిక ఎదుగుదల సాధ్యమవుతుంది. కొన్ని పాఠశాలల్లో క్రీడల విషయంలో జోనల్స్ క్రీడలు ఉన్న రెండు నెలలు కొంతమంది విద్యార్థులకు మాత్రమే ఆటల్లో అవకాశం కల్పిస్తున్నారు. గతంలో పీఈటీలు పాఠశాలల మొత్తం విద్యార్థులతో వారంలో ఒకరోజు డ్రిల్ చేయించేవారు. ఇప్పుడు క్రీడల విషయంలో పెద్దగా ఆసక్తి చూపడం లేదు. తద్వారా విద్యార్థులకు శారీరక శ్రమ ఉండటం లేదు.

ఉక్కు క్రమశిక్షణకు ఉత్తమం...

ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు దేశభక్తి పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ అలవాటు చేయాలనే ఉద్దేశంతో ఎన్‌సీసీ పాఠశాలల్లో అమలుచేస్తున్నారు. చిన్నప్పటి నుంచే సమాజం పట్ల సేవా భావం అలవాటుచేయాలనేది దీని లక్ష్యం. ఎన్‌సీసీ ఉన్న పాఠశాలల్లో వారానికి రెండు తరగతులు తప్పనిసరిగా ఎన్‌సీసీలో డ్రిల్, శిక్షణ నిర్వహించాలి. పాఠశాలల్లో ఒక్కొక్క ఉపాధ్యాయుడికి ఎన్‌సీసీలో శిక్షణ కూడా ఇచ్చారు. కొన్ని పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు కాకుండా విద్యార్థుల్లోనే ఒకరితో నామమాత్రంగా తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులతో నిర్వహించే సేవా కార్యక్రమాలు కూడా తగ్గిపోయాయి.


ఎన్‌సీసీలో డ్రిల్ చేస్తున్న విద్యార్థినులు

హాయ్! బుజ్జీ!!

ఎదుటివారిని చూసి ప్రేమ పూర్వకంగా నవ్వగలిగితే అదే మనం వారికిచ్చే అందమైన బహుమతి

– మదర్ థెరెసా

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Produce = ఉత్పత్తిచేయు
- మధుకరం = తుమ్మెద


సరదా పదాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి

1. Summer	వే ☐ ☐	5. Pay	వే ☐ ☐
2. Flute	వే ☐ ☐	6. God	వే ☐ ☐
3. Speed	వే ☐ ☐	7. Function	వే ☐ ☐
4. Heat	వే ☐ ☐	8. Dawn	వే ☐ ☐

- డీ దయామతి, హన్మకొండ

దారేది?



చుట్టూ జంతువులు... మధ్యలో మనం!



హాయ్ నేస్తాలూ! బాగున్నారా? నేనీమధ్య ఓ జూ కాని జూకెళ్లొచ్చా. ఊపిరి బిగబట్టుకుని కాలం గడిపొచ్చా. తలుచుకుంటేనే ఈ పర్యటన ఎంతో వింతగా.. గమ్మత్తుగా.. అనిపిస్తోంది. ఆ భలే భలే విశేషాలన్నీ మీతో పంచుకోకుంటే ఎలా? అందుకే ఇలా వచ్చేశా.



చిన్నూ కబుర్లు

చుట్టూ పులులు తిరుగుతుంటే మధ్యలో కూర్చుని భోజనం చేశా. సింహం దగ్గరగా వస్తుంటే కాలు మీద కాలేసుకుని ఐస్‌క్రీంలు తింటూ ఆనందించేశా. జంతువులన్నీ భయంకరంగా అరుస్తుంటే రాత్రివేళ మెత్తని పక్కపై పడుకుని ఓ కునుకేసేశా. 'కోతల రాయుడు కోతలు కోస్తున్నాడు. అన్నీ అబద్ధాలే' అనుకుంటున్నారా? అదేం కాదు. ఇదంతా నిజంగా నిజమే.

* మామూలుగా మనం ఎప్పుడైనా జూకి వెళ్లామనుకోండి. జంతువులన్నీ బోనుల్లో ఉంటాయి. మనం బయట స్వేచ్ఛగా తిరుగుతూ వాటిని చూస్తుంటాం. అంతేకదూ!

* మరి నేనెళ్లిన చోటు మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. యూకేలోని కెంట్ దగ్గరుందిది.

* ఓ అద్దాల ఇంట్లో తలుపులేసుకుని నేనుంటే ఆ బయట అంతా పులులు, బోలెడు అడవి జంతువులూ తిరుగుతున్నాయి. లోపల నుంచి దగ్గరగా వాటిని చూస్తూ నేను ఆనందించేసానన్నమాట.

ఒక్కసారైతే నేనున్న అద్దం దగ్గరకి పెద్ద పులి వచ్చేసింది. అప్పుడు చాలా భయమేసి పక్క గదిలో ఉన్న అమ్మ దగ్గరికి పరిగెట్టేశా.

* అసలు ఈ చోటు ఏంటంటే..? ఇదో సఫారీ. మొత్తం 600 ఎకరాల్లో చిక్కగా చెట్లుంటాయి. వాటిలో రకరకాల జంతువులు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి.

* మామూలుగా సఫారీల్లో వీటిని చూసేందుకు మనల్ని జీపుల్లాంటివాటిపై ఎక్కించుకుని తిప్పి తీసుకొస్తారంతే. ఇక్కడ అదొక్కటే కాకుండా అద్దాలతో ఉన్న ఓ చక్కని ఇల్లుంది. దాంట్లో రెండు పడకగదులు, వంటిల్లు, హాలూ ఉన్నాయి. ఎవరైనా అద్దెకు తీసుకుని కొన్ని రోజులక్కడ బస చేయొచ్చు. నాలా వింత అనుభవాల్ని ఆస్వాదించొచ్చు. కావాలంటే మీరూ ఓసారి వెళ్లిరండి మరి. బైబై.

నవ్వుల జల్లులు!

టీచర్: రామూ! ఎన్ని సార్లు పిలుస్తున్నా పలకవేంటి?

రాము: మీరే కదా టీచర్ అనవసరమైన విషయాలు పట్టించుకోవద్దన్నారు!

టీచర్: 30 + 30 ఎంత అవుతుంది?

రఘు: ఆరు టీచర్...

టీచర్: కాస్త బుర్ర పెట్టి చెప్పు!

రఘు: నా జవాబు సరైనదే టీచర్. 0కి విలువ లేదని మీరే కదా చెప్పారు!

- బరాటం రామారావు, నిజామాబాద్

చిలిపి ప్రశ్న

నీళ్లు ఎందుకు తాగుతాం?

- జీ రమేష్, పెనుబర్తి

ఏది భిన్నం?



పరివర్తన

కథ

'నాన్నా! రేపు మా తరగతిలోని పిల్లలంతా పరీక్ష ఫీజు చెల్లించాలని హెడ్మాస్టారు చెప్పారు.' ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు రఘు.

అప్పుడే కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చిన కేశవులు కొడుకు మాటలు విని 'అలాగా! ఫీజు ఎంతేమిటి?' అని అడిగాడు.

రెండు వందలని మెల్లగా చెప్పాడు రఘు.

'అవునా! రెండు వందలా? ఈ సారి బాగా పెంచేశారే! సర్లే. రేపు బడికి వెళ్లేప్పుడు ఇస్తాలే' అంటూ పెరట్లోకి నడిచాడు కేశవులు.

మరుసటి రోజు ఉదయం రఘు బడికి వెళ్లేందుకు తయారవుతుండగా కేశవులు అతని వద్దకి వచ్చి 'ఇదిగోరా రెండు వందలు. జాగ్రత్త మరి. వెళ్లగానే టీచరుకి ఇవ్వు'. అంటూ జేబులో డబ్బులు పెట్టాడు. 'సరే నాన్నా!' అంటూ బయటకు నడిచాడు రఘు. రఘు కాస్తంత దూరం నడవగానే అతని స్నేహితుడు అమర్ ఎదురయ్యాడు.


'ఏరా మీ నాన్న ఫీజు డబ్బులిచ్చారా?' ఆత్రుతగా అడిగాడు అమర్.

'ఇచ్చార్రా. మరి మీ నాన్నా?' అమర్ కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు రఘు.

'నేను ఫీజు రెండు వందల యాభై రూపాయలని చెబితే మారు మాట్లాడకుండా ఇచ్చేశార్రా మానాన్న' గొప్పగా చెప్పాడు అమర్.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాళ్లు చెల్లించవలసిన ఫీజు వంద రూపాయలే. తమ తల్లిదండ్రుల నుంచి ఎక్కువ డబ్బు తీసుకుని, వాటితో సినిమాకి వెళ్లాలని పథకం వేసుకున్నారు రఘు, అమర్. ఇద్దరిదీ ఒకే తరగతి. ఒకే బెంచీలో కూర్చుంటారు. కలసి తిరుగుతుంటారు. తల్లిదండ్రుల్ని నమ్మించి భలేగా డబ్బులు తీసుకున్నామని ఇద్దరూ మురిసిపోయారు. చెరో వంద వారి తరగతి ఉపాధ్యాయుడికి ఫీజు చెల్లించారు.

మరునాడు ఆదివారం కావడంతో ఇద్దరూ ఆడుకోవడానికి వెళుతున్నామని చెప్పి టౌనుకు బయలుదేరారు. సినిమా చూసి, ఆ తర్వాత మిఠాయి దుకాణానికి వెళ్లి తమకు ఇష్టమైన తినుబండారాలెన్నో కొనుక్కుని తిన్నారు. ఆనందంగా గడిపారు. చీకటి పడే వేళకు ఇంటికి చేరుకున్నారు. రఘు ఆట నుంచి ఇంటికి వస్తున్నట్లుగా నమ్మించేందుకు ఒక క్రికెట్ బ్యాటు చేతిలో పట్టుకుని



మెల్లగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. అదే సమయంలో పక్క గదిలో తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న మాటలు విని ఆగిపోయాడు. కిటికీలోంచి లోపలికి చూశాడు. మంచం మీద కేశవులు జ్వరంతో వణికిపోతూ ఉన్నాడు. అతని భార్య సపర్యలు చేస్తూ 'వచ్చిన కూలి డబ్బులన్నీ పిల్లాడి ఫీజు కోసం ఇచ్చేశావు. మందులు తెద్దామంటే ఇంట్లో రూపాయి కూడా లేదు' అంది. అందుకు కేశవులు 'సమయానికి ఫీజు కట్టకపోతే రఘును పరీక్షలకు అనుమతించరు. నాకు మామూలు జ్వరమేగా వచ్చింది. రేపటికి తగ్గిపోతుందిలే' అన్నాడు మూలుగుతూ.

'అలా అంటే ఎలా? నేను పక్కింటి వాళ్ల దగ్గరకెళ్లి ఓ యాభై రూపాయలు అడిగి మందులు కొని తెస్తాను' అంటూ లేవబోయిన ప్రమీల చేయి పట్టుకుని ఆపి 'నా మాట విను రేపు చూద్దాంలే. ఇప్పుడు అప్పు చేయడం ఎందుకు?' అన్నాడు కేశవులు.

అదంతా చూస్తున్న రఘుకు బాధగా అనిపించింది. తన విలాసాల కోసం ఖర్చు చేసిన ఆ వంద రూపాయలు ఎంత విలువైనవో తెలిసి వచ్చింది. అదీగాక రోజు వారీ కూలికి వెళ్లి డబ్బు సంపాదించే తన తండ్రి శ్రమ విలువను అర్థం చేసుకోలేకపోయానని బాధపడ్డాడు. తన ఫీజు కోసం ఉన్న డబ్బులన్నీ ఇచ్చిన తండ్రి మంచితనాన్ని తలుచుకోగానే దుఃఖం తన్నుకు వచ్చింది. గదిలోకి పరుగున వెళ్లి తండ్రిని అమాంతం కౌగిలించుకున్నాడు. వెక్కివెక్కి ఏడుస్తూ జరిగిన సంగతంతా చెప్పాడు. తన తప్పును క్షమించమని విలపించాడు. వాస్తవాన్ని చెప్పినందుకు రఘును తల్లిదండ్రులు కోపగించుకోలేదు. పైగా 'చూడు రఘూ! నువ్వే మా సర్వస్వం. నీ కోసం, నీ చదువు కోసం ఏమైనా చేస్తాం. నువ్వు మాలా కూలి బతుకు బతక కూడదన్నదే మా కోరిక. జరిగింది మరిచిపో. చేసిన తప్పు తెలుసుకున్నావు కదా. అదే చాలు. ఇక మీదట నీకేం కావాలన్నా సంకోచం లేకుండా మమ్మల్ని అడుగు. మేం తెచ్చిపెడతాం. మళ్లీ ఇలాంటి పొరపాటు చేయకు' అంటూ అక్కున చేర్చుకున్నారు. ఆ ఘటన రఘులో గొప్ప మార్పు తెచ్చింది. ఎప్పుడూ మంచి ప్రవర్తనతో మెలుగుతూ, తన మిత్రుడిలోనూ అలాంటి పరివర్తన తీసుకొచ్చాడు.

- పెండెం జగదీశ్వర్

జవాబులు: **ఏది భిన్నం:** a **చిలిపిప్రశ్న:** తినలేం కాబట్టి! **సరదా పదాలు:** 1.వేసవి 2.వేణువు 3.వేగము 4.వేడిమి 5.వేతనం 6.వేలుపు 7.వేడుక 8. వేకువ

ఎడాపెడా... ఏం చేసినా... అంతా ఆయన ఇష్టం..!

(మొదటిపేజీ తరువాయి)

గుత్తేదారుల్లో ఎక్కువ మంది చేస్తున్న నిర్మాణాలు చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. వాస్తవానికి అమరావతి ఇసుక మాత్రమే నిర్మాణంలో వాడాలి. కానీ అక్కడి నుంచి తెచ్చే ఇసుక బహిరంగ విపణిలో టన్ను రూ. 850 వరకు ఉంది. దీంతో స్థానికంగా గుండ్లకమ్మలో దొరికే అత్యంత నాసిరకం ఇసుకవైపు గుత్తేదారులు మొగ్గు చూపారు. అమరావతి ఇసుకలో సుమారు సగం ధర కంటే తక్కువకే అది లభ్యమవుతోంది. గుండ్లకమ్మ ఇసుక వాడితే నిర్మాణాల్లో నాణ్యత లోపం కొట్టొచ్చినట్లు కనపడుతుంది. సిమెంటు కూడా తక్కువ నాణ్యత కలిగినదే వాడుతున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. సమపాళ్లలో సామగ్రిని కలపకపోవడం మరో ప్రధాన లోపం. ఇసుక, కంకరలో తగినంత మొత్తంలో సిమెంటు కలపాల్సి ఉన్నా అతి తక్కువ మోతాదులో ఉన్నట్లు తేటతెల్లమవుతోంది. మురుగు కాలువల పనుల్లో రెండు వైపు గోడలు పైన ప్లాస్టింగ్ పనులు మరీ దారుణంగా ఉన్నాయి. గతంలో మురుగు కాలువల పనుల్లో గుత్తేదారులు కింద వేసే బెడ్‌లో కక్కుర్తి ప్రదర్శించేవాళ్లు. కానీ ప్రస్తుతం మున్సిపాలిటీలో పనులు చేస్తున్న గుత్తేదారులు అన్ని స్థాయిల్లోనూ నాణ్యతను విస్మరించినట్లు అవగతమవుతోంది. ముఖ్యంగా తూర్పువీధిలో రూ. 16 లక్షలు, కంభం రోడ్డులో రూ. 18 లక్షలతో జరుగుతున్న పనుల్ని చూస్తే సామాన్యులు కూడా ముక్కున వేలేసుకోవాల్సిందే. నిర్మాణ సమయంలోనే ఆయా పనుల్లో లోపాలు బట్టబయలవుతున్నాయి. గోడలకు సంబంధించి కాంక్రీట్ పనులు పూర్తికాకముందే నెర్రెలు కొడుతున్నాయి. కొన్నిచోట్ల మిశ్రమంలో ఇసుక, సిమెంటు ఎక్కువగా లేకపోవడంతో కంకర బయటపడి కనపడుతోంది. సరైన విధంగా క్యూరింగ్ లేకపోవడంతో తెల్లగా దర్శనమిస్తున్నాయి.

బినామీలవే అధిక పనులు..: గతంలో ఎన్నడూ లేని విధంగా మున్సిపాలిటీలో ఎలాంటి టెండర్ ప్రక్రియ జరగాలన్నా మున్సిపాలిటీ ముఖ్య నాయకుడి అనుమతి ఉండాల్సిందే. పురపాలక సంఘంలో ఎక్కువగా పనులు చేసేది 10 మంది వరకు గుత్తేదారులు మాత్రమే. వారిలో ఎక్కువ మంది ఆ నాయకుడి బినామీలే. ఆయన్ను కాదని ఎవరైనా టెండర్ వేసినా తర్వాత నయానో, భయానో సదరు గుత్తేదారుడిని తన దారిలోకి తెచ్చుకుని పనులు చేయించడం ఇక్కడ రివాజు. ఎక్కువ పనులు ఆ నాయకుడి సోదరుడు, మరో కౌన్సిలర్ భర్త చేస్తున్నారు. గతంలో అభివృద్ధి పనుల విషయంలో కొందరు కౌన్సిలర్లు తమకు ప్రాధాన్యమివ్వాలని గొడవలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయినా ముఖ్య నాయకుడి ఇష్టం. తనకు అనుకూలంగా ఉంటేనే పనుల పందేరంలో వాటాలు కల్పిస్తారు. లేదంటే మిన్నకుండిపోవాల్సిందే. ప్రస్తుతం జరుగుతున్న రూ. 3 కోట్ల అభివృద్ధి పనుల్లో అన్నీ ఆయన మనుషులవే కావడంతో అధికార యంత్రాంగం పనుల వద్దకు వెళ్లేందుకు జంకుతున్నారు. గుత్తేదారులను ఇబ్బందులకు గురిచేస్తే బదిలీ వేటు పడుతుందనే భయంతో ఇంజినీరింగ్ విభాగం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతి పనిని క్వాలిటీ విభాగం తనిఖీ చేయాల్సి ఉన్నా, అదీ చేతులు తడుపుకొని చేసే నామమాత్రపు ప్రక్రియగానే నిలిచిపోయింది. పురపాలక సంఘంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పరిస్థితి ఈ విధంగా ఉన్నా ఆయా వార్డులకు ప్రాతినిధ్యం వహించే ప్రతినిధులు ఎవరూ వేలెత్తి కూడా చూపలేని దుస్థితి ఏర్పడింది.

గతంలో పనులదీ అదే పరిస్థితి..: పట్టణంలో గతంలో జరిగిన పనుల్లో నాణ్యత లోపాలు పలుమార్లు బయటపడ్డాయి. స్థానిక 21వ వార్డులోని సాయిబాలాజీ థియేటర్‌కు వెళ్లే రహదారిలో రెండేళ్ల క్రితం సుమారు రూ. 40 లక్షలతో ముఖ్య నాయకుడి అనుచరుడు మురుగు కాలువ పని చేశారు. అప్పట్లో నిర్మాణం జరుగుతున్న సమయంలోనే కాలువ మొత్తం కూలిపోయింది. అంతేకాక పలు వార్డుల్లో జరిగిన సీసీ రహదారి పనుల్లో కూడా నాణ్యత లోపాలు బయటపడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయినా అధికారులకు, నాయకులకు చీమకుట్టినట్లయినా లేదు.


కంభం రోడ్డులో పది రోజులకే నెర్రెలు కొడుతున్న మురుగు కాలువ


మాట్లాడుతున్న యుఎఫ్‌బీయూ నాయకులు రాజేశ్వరరావు

రేపు జాతీయ బ్యాంకు ఉద్యోగుల సార్వత్రిక సమ్మె

ఒంగోలు సంతపేట, న్యూస్‌టుడే: సామాన్య ప్రజలపై భారాలు మోపుతున్న బ్యాంకు విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 22న దేశవ్యాప్తంగా జాతీయ బ్యాంకు ఉద్యోగులు సార్వత్రిక సమ్మెలోకి వెళుతున్నట్లు యుఎఫ్‌బీయూ (యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్) నాయకులు పి.కె.రాజేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయం వద్ద సోమవారం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం, 22న సార్వత్రిక సమ్మె సందర్భంగా ఆంధ్రా బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద బహిరంగ సభ జరుగుతుందన్నారు. బినామీ పేర్లతో బడా వ్యాపారులు రుణాలు తీసుకుని ఎగవేయడం వల్ల బ్యాంకులు నష్టాల్లోకి వెళుతున్నాయని.. వాటిని పూడ్చేందుకు బ్యాంకు ఖాతాదారులైన సామాన్యుల నుంచి వివిధ సేవా రుసుముల పేరిట వసూలు చేయడం దుర్మార్గమని అన్నారు. మొండి బకాయిదారుల నుంచి సొమ్ము వసూలు చేయాలని, సామాన్య ప్రజలపై భారం మోపరాదని కోరుతూ బ్యాంకు ఉద్యోగులంతా సమ్మెలోకి వెళుతున్నట్లు చెప్పారు. ఖాతాదారులు సమ్మెకు మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో కెనరా బ్యాంకు అధికారుల సంఘం నాయకులు రామచంద్రరావు, సిండికేట్ బ్యాంకు అధికారుల సంఘం నాయకులు వేణుగోపాల్, బ్రహ్మయ్య, పీడీసీసీ బ్యాంకు అధికారుల సంఘం నాయకులు వేణుగోపాల్, కార్పొరేషన్ బ్యాంకు అధికారుల సంఘం నాయకులు సురేష్, రాజీవ్, కరూర్ వైశ్యాబ్యాంకు అధికారుల సంఘం నాయకులు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన తుఫాన్ వాహనం

ఉలవపాడు: దైవసన్నిధిలో శుభ కార్యాన్ని ముగించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన పెళ్లి బృందం ప్రయాణిస్తున్న తుఫాన్ వాహనం లారీని ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, మరో 12 మందికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన ఉలవపాడు సమీపంలోని దక్షిణ బైపాస్ రహదారిలో ఆదివారం చోటుచేసుకుంది. దర్శి మండలం బొట్లపాలెం గ్రామానికి చెందిన వారి వివాహ వేడుక తిరుమలలోని దైవసన్నిధిలో శనివారం నిర్వహించారు. దైవదర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో దర్శి వస్తున్నారు. మార్గమధ్యంలో ఉలవపాడు వద్ద ఎదుట వెళ్తున్న లారీని పెళ్లి బృందం వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మక్కిలి సుబ్బారావు, అతని భార్య రమణమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. నూతన వధూవరులు, బంధువులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు. తీవ్ర గాయాలైన సుబ్బారావు, రమణమ్మలను మెరుగైన వైద్యసేవల నిమిత్తం ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఉలవపాడు ఏఎస్ఐ మాలకొండయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడిన మిక్కిలి సుబ్బారావు, రమణమ్మ

చినపవనిలో ఇరువర్గాల ఘర్షణ.. ఉద్రిక్తం

లింగసముద్రం, న్యూస్‌టుడే: ఓ వివాహిత చరవాణికి సందేశాలు పంపిస్తున్నాడంటూ యువకుని ఇంటిపై దాడి చేసిన సంఘటన మండలంలోని చినపవనిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన ఓ సామాజిక వర్గానికి చెందిన వివాహితతో అదే గ్రామంలోని మరో సామాజిక వర్గానికి చెందిన యువకుడు వివాహేతర సంబంధం నడుపుతున్నాడు. ఈ క్రమంలో సదరు యువతి చరవాణికి అతను సంక్షిప్త సందేశాలు పంపడాన్ని ఆమె భర్త గుర్తించాడు. ఈ విషయమై నిలదీయడంతో యువకుతో తన వ్యవహారం గురించి ఆమె వివరించింది. దీంతో అతను తమ సామాజిక వర్గానికి చెందిన కొందరితో కలిసి గ్రామంలోని ప్రధాన కూడలిలో ఉన్న యువకుడి నివాస గృహం వద్దకు వచ్చి సామగ్రిని బయట వేసి నిప్పంటించారు. దీంతో రెండు వర్గాలకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ వివాదంలో ఇరువర్గాలకు చెందిన అయిదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గుడ్లూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరు వర్గాల వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయితే వారిని కూడా నెట్టి వేశారు. ఇరు వర్గాల ఘర్షణతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న కందుకూరు, గుడ్లూరు ఎస్సైలు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పర్యవేక్షిస్తున్నారు.

మాతంగి నృత్యాన్ని అడ్డుకున్న పోలీసులు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: యర్రగొండపాలెంలో ఆదివారం నిర్వహించిన ఎల్లమ్మ జాతరలో నృత్యం చేస్తున్న మాతంగిని పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న దృశ్యాన్ని ఏఎస్సై సుబ్బయ్య చూసి ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. పోలీసులు ప్రత్యేక వాహనంలో వచ్చి మాతంగిని వాహనంలో ఎక్కించారు. దీంతో ఒక్కసారిగా నిర్వాహకులు తిరగబడ్డారు. వాహనాన్ని కదలనీయకుండా అడ్డుకున్నారు. కాసేపు పోలీసులు, నిర్వాహకుల మధ్య వాగ్వాదం జరిగింది. బలవంతంగా మాతంగిని వాహనం నుంచి నిర్వాహకులు దించేయగా పోలీసులు మళ్లీ ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనను ఫొటోలు తీస్తున్న విలేకరులపై నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడి చేయబోయారు. మాతంగి, నిర్వాహకులపై కేసు నమోదు చేస్తున్నట్లు ఏఎస్సై సుబ్బయ్య తెలిపారు.

గొలుసు తెగింది...

(మొదటిపేజీ తరువాయి)

అమ్మకాలు జరుగుతున్నాయి. వీటిలో కొన్ని ఆబ్కారీ శాఖలో దిగువస్థాయి సిబ్బందికి తెలిసే జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కనిగిరి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పామూరు మేజర్ పంచాయతీ శివారు కాలనీలో నాలుగు, కనిగిరిలో తీగలగొంది, చెప్పులబజారు, శివనగర్ కాలనీలో రెండు దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ కొందరు ఎక్సైజ్ కానిస్టేబుళ్లతో వీరికి అనుబంధం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. గిద్దలూరు సమీపంలోని దిగువమెట్టలో రెండు, ఉయ్యాలవాడలో నాలుగు, తెలిసిన వాళ్లకు అమ్ముతున్నారు. అర్ధవీడు మండలం పాపినేనిపల్లిలో రెండు ఉన్నాయి. గిద్దలూరు పరిధిలోని ఓ కానిస్టేబుల్ పూర్తిగా ఈ వ్యవహారంలో తలదూరుస్తూ నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన తన స్నేహితులు కొందరితో దుకాణ దారుల వద్ద వసూళ్లకు పాల్పడుతూ అనధికారిక అమ్మకాలను ప్రోత్సహిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి.

పొన్నలూరు మండలం మాలపాడు, ముప్పాళ్ల, యల్లతూరు గ్రామాల్లో రెండేసి ఉన్నాయి. కొండపి మండలం తాటాకులపాలెం, రాళ్లపాలెంలో నిర్వహిస్తున్నారు. అద్దంకి పట్టణంలో భవానీ కూడలిలో అనుమతులున్న కొన్ని మద్యం దుకాణాల చెంతనే ఉన్న శీతల పానీయాల దుకాణాల్లో మద్యం అమ్ముతున్నట్లు సమాచారం. అధికారిక దుకాణాలు మూసేశాక ఇక్కడ విక్రయాలకు డిమాండ్ ఉంటోంది. సీసాపై రూ. 20 అధికంగా విక్రయిస్తున్నారు. పొదిలి స్టేషన్ పరిధిలోని పొదిలి, కొనకనమిట్ల సమీపంలోని ఇళ్లలోను, చిన్న దుకాణాల్లోను అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలోనూ సిబ్బందికి తెలిసే జరుగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. కందుకూరులో ఉదయం 7 గంటలకే దుకాణాలను తెరుస్తూ అర్ధరాత్రి వరకు మూయడం లేదు.

అద్దంకి, మార్కాపురం, కందుకూరు, చీరాల ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలపై మద్యం తీసుకువచ్చి ఓ చోట విక్రయిస్తున్నారు. ఎవరైనా తనిఖీలకు వస్తున్నారని తెలిసిన వెంటనే పరారవుతున్నారు. ఇదంతా అనుమతులు పొందిన వ్యాపారులే నిర్వహిస్తున్నారు.

పోలీసులు భళా... ఎక్సైజ్ డీలా...!

గొలుసు దుకాణాల నిర్మూలనను పోలీసులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఎస్పీ సత్య ఏసుబాబు ఈ విషయమై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో దిగువ స్థాయిలో కూడా ఎస్సైలు, సిబ్బంది చురుగ్గా పనిచేస్తున్నారు. సింగరాయకొండ, టంగుటూరు వంటి మండలాల్లో గొలుసు దుకాణాల సమాచారం ఇస్తే నజరానాలు ఇస్తామంటూ పోలీసులు ప్రకటించారు. ఒక్కో కానిస్టేబుల్‌కి ఒక గ్రామం బాధ్యత అప్పగించారు. ఎస్సైలు, సీఐలు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. అన్ని చోట్ల పోలీసుల వైఖరితో స్పష్టమైన మార్పులు వచ్చాయి. కానీ అనుమతులు పొందిన దుకాణదారుల నుంచి మామూళ్ల విషయంలో మాత్రం పోలీసులు వెనక్కుతగ్గడం లేదు. కొందరు సిబ్బంది దుకాణాల నిర్వాహకుల లొసుగులు చూపుతూ నెలవారీ కచ్చితంగా వసూళ్లు కొనసాగిస్తున్నారు.

గొలుసు దుకాణాల తొలగింపులో పోలీసులు పనిచేస్తున్నంతగా ఎక్సైజ్ సిబ్బంది పనిచేయలేకపోతున్నారు. అక్కడక్కడా సిబ్బంది లేకపోవడం, క్షేత్రస్థాయిలో వ్యాపారులతో సన్నిహితంగా మెలుగుతుండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. స్థానికంగా రాజకీయ ఒత్తిళ్లు అధికంగా ఉండడం కూడా మరో కారణం. అద్దంకి, పొదిలి, కనిగిరి, గిద్దలూరు తదితర ప్రాంతాల్లో కొంత ఉదాసీనత కనిపిస్తోందని ఎక్సైజ్ ఉన్నతాధికారులు కూడా అంగీకరిస్తున్నారు. నెలవారీ మామూళ్ల విషయంలోనూ ఆ శాఖ అధికారులు పట్టు వీడడం లేదని తెలుస్తోంది. సమయపాలన, బయట అమ్మకాలు, చెంతనే కూర్చునే స్థానాల ఏర్పాటు వంటి లొసుగులు చూపుతూ దుకాణదారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇదే అలుసుగా తీసుకుంటున్న వ్యాపారులు గొలుసు దుకాణాలను కూడా కొనసాగిస్తున్నారు.

ఫలితాలు వస్తున్నాయి: డీసీ జోసెఫ్

జిల్లాలో గొలుసు దుకాణాల విషయమై ఎక్సైజ్ డీసీ జోసెఫ్‌ను వివరణ కోరగా, 'గతంతో పోలిస్తే చాలా చోట్ల గొలుసు దుకాణాలు తొలగించాం. ఎక్కడ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుతున్నా పోలీసులతో కలిసి దాడులు జరుపుతున్నాం. మాతో పాటు పోలీసులు, రెవెన్యూ అధికారులు కూడా పనిచేస్తున్నారు. దీనివల్ల చాలా వరకు నిర్మూలించగలిగాం. కొన్ని ప్రాంతాల్లో మా సిబ్బందిపై ఆరోపణలు వస్తున్నాయి. వాటిపై పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటాం. ద్విచక్ర వాహనాలపై కూడా మద్యం తెచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం వస్తోంది. ఇలాంటి వాటిని కూడా అరికడతాం' అని చెప్పారు.

పడకేసిన పారదర్శకత!

(మొదటిపేజీ తరువాయి)

గత ఏడాది చివర్లో పంపిణీ చేశారు. 323 ఉన్నత పాఠశాలలు, 341 ప్రాథమికోన్నత పాఠశాలలకు, పది ఆదర్శ పాఠశాలలకు, ఎంఈవో కార్యాలయాలకు అందజేశారు. 100 మంది విద్యార్థులకు ఒక బయోమెట్రిక్ పరికరం చొప్పున సమకూర్చారు. వీటి వినియోగంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినా అత్యధిక పాఠశాలల్లో ఉపయోగించడంలేదు. సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నందునే సాధ్యం కావడంలేదని ఉపాధ్యాయులు అంటున్నారు. మరి కొన్ని చోట్ల గత ఏడాది నమోదు చేసిన పేర్లు యథాతథంగా ఉన్నాయి. ఈ ఏడాది విద్యార్థుల వివరాలను సరిచేసుకోలేదు. పూర్తిస్థాయి అవగాహన లేక కొన్నిచోట్ల, కొత్త విధానంలో తమకు ఇబ్బందులు వస్తాయనే తప్పుడు ఆలోచనతో మరికొన్ని చోట్ల ఉపాధ్యాయులు వీటిని ఉపయోగించేందుకు ఆసక్తి చూపడంలేదు. అంతర్జాలం సమస్య ఉంటే ఆ ప్రాంతంలో అందుబాటులో ఉండే కంపెనీకి చెందిన సిమ్‌కార్డులు అమర్చుకోవచ్చు. అయినా అందుకు తగిన చర్యలు తీసుకోవడంలేదు. ఎవరికి వారు మాకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత సిబ్బందికి ఫోన్ చేస్తే స్పందించడంలేదని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. బయోమెట్రిక్ పరికరాలను సరఫరా చేసిన కంపెనీ సిబ్బంది, విద్యాశాఖాధికారులు సంయుక్తంగా పాఠశాలలను సందర్శించి పరికరాల వినియోగాన్ని పరిశీలిస్తే కొంత వరకు ప్రయోజనం ఉంటుంది.

చీరాల నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల్లో 8 ఉన్నత పాఠశాలలకు పరికరాలను పంపిణీ చేశారు. వేటపాలెం బాలికోన్నత పాఠశాలలో 1100 మంది విద్యార్థులు ఉన్నారు. కాని ఇక్కడకు సరఫరా చేసిన బయోమెట్రిక్ యంత్రాల్లో గత ఏడాది విద్యార్థుల సంఖ్యను నమోదు చేయటంతో వాటిని ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడింది. పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలోనూ దీన్ని అమలు చేయటంలేదు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో కూడా ఇంతే పరిస్థితి.

TENTH English

ప్రతిభ

It goes without saying that language is the dress of thought. As such, we express our feelings and thoughts through words. The words we use in a sentence need to be precise, accurate and forceful. So to say, prepositions are such forceful, nay powerful words which govern the entire sentence. Therefore, a thorough practice of using correct prepositions is needed for the learner.

Nithin is fond *of* eating..

PREPOSITIONS

A Preposition is a word such as in, on, at or beside that is used before a noun or a noun phrase or a pronoun to show a link with another word or phrase.

★ Study the prepositions under lined in the following sentences:

1. Vaccination protects us <u>from</u> many diseases.
2. A man is known <u>by</u> the company the keeps.
3. Foundation of a house lies <u>below</u> the ground level.
4. Srinidhi has no appetite <u>for</u> sweets.

The words from, by, below and for are prepositions.

Kinds Of Prepositions

Prepositions have different functions: to indicate time, place, movement, direction, means, manner, purpose, source, concession, etc.

Examples: 1. The train arrived <u>on</u> time. (Time)
2. I met Sahithi <u>at</u> the theatre. (Place)
3. Shirisha went to the market <u>for</u> fruits. (Purpose)
4. Rishita drove <u>along</u> the main road in a hurry. (Direction)

A. Simple Prepositions: in ★ on ★ at ★ to ★ for ★ from ★ of ★ off out ★ by ★ till ★ with ★ through, etc.

Study the following sentences and observe the prepositions used in each sentence and note the function of the prepositions given in the brackets.

1. Vaishnavi waited for the doctor <u>till</u> he returned. (Time)
2. Naveen left Boath <u>for</u> Dubai. (Place)
3. <u>Inspite of</u> the hurdles, Kavya succeeded in her efforts. (Concession)

B. Compound Prepositions

about ★ above ★ across ★ along ★ amidst ★ among ★ around ★ before ★ behind ★ below ★ beneath ★ beside ★ between ★ beyond ★ inside ★ out side ★ within ★ with out

Examples: 1. A narrow path ran in <u>between</u> the two houses.
2. The moon moves <u>around</u> the Earth.
3. <u>Inside</u> the box was a diamond studded watch.
4. I cannot allow the work to continue <u>beyond</u> the end of December.

Exercise - 1

✪ *Fill in the blanks with suitable Simple Prepositions.*

1. Nithin is fond .... eating sweets.
2. English is quite different .... Telugu.
3. Malavika fell ... her bicycle and broke her leg.
4. Ashwini drove her car .... the side gate.
5. I'll return your book .... a week.

Exercise - 2

✪ *Fill in the blanks with suitable Compound prepositions.*

1. Apple and banana are .... the most popular fruits.
2. Moiz usually sits .... Saikumar in the class.
3. There is something special .... our Headmaster.
4. A new bridge is being built .... the river.
5. She looks nice .... make-up.

C. Compound Prepositional Phrases

Compound Prepositional Phrases consist of two or more words, such as due to, because of, together with, etc,

Examples:

1. The rowdy was arrested <u>according to</u> IPC 420.
2. I cannot see the film because a tall man is sitting <u>infront of</u> me.
3. Vijayendra Prasad goes to school <u>along with</u> Vamsi Krishna daily.
4. Ring the alarm bell <u>in case of</u> emergency.

✪ *Study the following compound Prepositional Phrases and note the meanings given to each of them*

Comp.Prep.Phrases	Meanings
along with	together with
on account of	because of
by means of	through the agency of
apart from	separate from
ahead of	earlier than something/ somebody
in front of	located before
in place of	as a substitute for
inspite of	disregarding the difficulty
in case of	in the event of
by way of	via
due to	on account of
for the sake of	for the good of
in addition to	added to
in accordance with	in agreement with

Examples: The thief entered the house <u>by means of</u> a broken window.
2. Shruthi attends special classes on Sundays <u>in addition to</u> regular practice.
3. We postponed our trip to Ramoji Film City <u>due to</u> bad weather.
4. <u>Inspite of</u> being rich, my neighbour is not happy.

Exercise - 3

✪ *Fill in each blank with the correct Compound Prepositional Phrases from those given under each sentence.*

1. .... his injury, Umesh will play in Sunday's match.
a) Due to b) For the sake of c) In spite of
2. He sent me some flowers .... an apology.
a) by way of b) in case of c) apart from
3. Is there parking space .... the hotel?
a) ahead of b) in front of c) along with
4. She lost her way when she went into the jungle .... firewood.
a) for the sake of b) in addition to c) in search of

Answers

Ex-1: 1) of 2) from 3) off 4) through 5) in
Ex-2: 1) among 2) beside 3) about 4) across 5) without
Ex-3: 1-c 2-a 3-b 4-c.



రచయిత
డి.నారాయణ,
విషయ నిపుణులు

జనరల్ స్టడీస్
ఫిజిక్స్

గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?



రచయిత
డి. అనంత రామకృష్ణ
విషయ నిపుణులు

1. ఒక వాహనం తన ప్రయాణ దూరంలోని మూడు సమ దూరాలను వరుసగా 80, 60, 30 కి.మీ. / గంట వేగంతో ప్రయాణిస్తే దాని సగటు వేగం ఎంత? (కి.మీ./గంటల్లో)
1) 60 2) 50 3) 48 4) 24

2. ఖగోళశాస్త్రంలో 'పార్‌సెక్‌' దేనికి ప్రమాణం?
1) దూరం 2) కాలం 3) వేగం 4) పౌనఃపున్యం

3. ట్రాన్స్‌ఫార్మర్‌ మార్చలేని AC విద్యుత్‌కి సంబంధించిన అంశం?
1) వోల్టేజీ 2) కరెంట్‌ 3) పౌనఃపున్యం 4) పైవన్నీ

4. భూస్థావర (జియోస్టేషనరీ) ఉపగ్రహం భూమి కేంద్రం నుంచి సుమారు ఎంత ఎత్తులో ఉంటుంది?
1) 36000 కి.మీ. 2) 6,400 కి.మీ.
3) 21,000 కి.మీ. 4) 42,400 కి.మీ.

5. రేడియో రిసీవర్లలో ఉపయోగించే వలయం ఏది?
1) శుద్ధ నిరోధ వలయం 2) LC - ట్యాంక్‌ వలయం
3) శుద్ధ ప్రేరక వలయం
4) శుద్ధ కెపాసిటర్‌ వలయం

6. టెఫ్లాన్‌ పూత పూసిన లోహ పరికరాలను ఉపయోగించి అధిక వోల్టేజీ విద్యుత్‌ ప్రసారాలను నిలిపివేయకుండానే వాటిని తీసుకుని వెళ్లే తీగలను ముట్టుకుంటారు. ఎందుకంటే టెఫ్లాన్‌ ఒక...
1) విద్యుత్‌ బంధకం 2) అర్ధ వాహకం
3) విద్యుత్‌ వాహకం 4) అతివాహకం

7. గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?
1) పీడనం 2) ఆర్ద్రత
3) గాలి (పవన) వేగం 4) ఉష్ణోగ్రత

8. ప్రతిపాదన **(A):** పాలీవినైల్‌ క్లోరైడ్‌తో తయారైన రెయిన్‌ కోట్లను వర్షం నీరు తడపదు.
కారణం (R): పాలీవినైల్‌ క్లోరైడ్‌, నీటి మధ్య స్పర్శ కోణం 90° కంటే ఎక్కువ.
1) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ.
2) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ కాదు.
3) A, R రెండూ సరైనవి కావు.
4) A సరైంది. కానీ, R సరైంది కాదు.

9. శక్తి నిత్యత్వ నియమానికి ప్రతిరూపం -
1) లెంజ్‌ నియమం
2) ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం
3) కిర్కాఫ్‌ రెండో నియమం 4) పైవన్నీ

10. శూన్య కెల్విన్‌ ఉష్ణోగ్రతకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
1) శూన్య కెల్విన్‌ ఉష్ణోగ్రతను చేరిన వాయువు ఘన పరిమాణం శూన్యం అవుతుంది.
2) శూన్య కెల్విన్‌ ఉష్ణోగ్రతను చేరిన వాయువు పీడనం శూన్యం అవుతుంది.
3) శూన్య కెల్విన్‌ ఉష్ణోగ్రతను పొందడం అసాధ్యం.
4) పైవన్నీ సరైనవే

11. కేంద్రక బలాలు....
1) ఆకర్షణ బలాలు 2) స్వల్ప అవధి బలాలు
3) అత్యంత బలమైన బలాలు 4) పైవన్నీ

12. రాకెట్‌ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
1) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
2) శక్తి నిత్యత్వ నియమం
3) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం 4) పైవన్నీ

13. ఉష్ణశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చేది ఏది?
1) థర్మోకపుల్‌ 2) ఎలక్ట్రిక్‌ హీటర్‌
3) ఎలక్ట్రిక్‌ బల్బు 4) ఫొటో సెల్‌

14. స్వేచ్ఛగా కిందపడే వస్తువు...
1) మొత్తం యాంత్రిక శక్తి స్థిరం
2) స్థితిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
3) గతిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
4) 1, 3

15. ఎత్తయిన ప్రదేశం (విమానం) నుంచి చూస్తే ఇంద్రధనస్సు ఏ ఆకారంలో కనిపిస్తుంది?
1) అర్ధ వృత్తం 2) వృత్తం
3) పరావలయం 4) ఏదీకాదు

16. 40°C వద్ద ఉన్న 500 మి.లీ. నీటిని అంతే పరిమాణంలో, 70°C వద్ద ఉన్న నీటికి కలిపితే ఫలిత ఉష్ణోగ్రత విలువ ఎంత?
1) 110° C 2) 55°C 3) 40°C 4) 65°C

17. ఒక వ్యక్తికి సరైన దృష్టి కోసం డాక్టర్‌ +2D కటకం వాడమని సలహా ఇచ్చారు. అది ఏ రకమైన కటకం? దాని నాభ్యాంతరం ఎంత?
1) కుంభాకార, 100 సెం.మీ.
2) పుటాకార, 10 సెం.మీ.
3) కుంభాకార, 50 సెం.మీ.
4) పుటాకార, 50 సెం.మీ.

18. కాంతి విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రసరిస్తే, దాని తరంగదైర్ఘ్యం (λ), పౌనఃపున్యం (υ) విలువలు ఏ విధంగా ఉంటాయి?
1) λ, υ రెండూ పెరుగుతాయి
2) λ పెరుగుతుంది, υ స్థిరం
3) λ తగ్గుతుంది, υ స్థిరం
4) λ, υ రెండూ తగ్గుతాయి

19. వస్తువు గతిజ శక్తి వేటిపై ఆధారపడుతుంది?
1) ద్రవ్యరాశి, ఎత్తు 2) వేగం, కాలం
3) ఎత్తు, త్వరణం 4) ద్రవ్యరాశి, వేగం

20. సమ వేగంతో వెళ్లే వస్తువు ....
1) చలన దిశ స్థిరం, వడి అస్థిరం
2) వడి స్థిరం, చలన దిశ అస్థిరం
3) వడి, చలన దిశ రెండూ అస్థిరం
4) వడి, చలన దిశ రెండూ స్థిరం

21. మానవుడి గుండె సగటున నిమిషానికి 75 సార్లు కొట్టుకుంటుంది. అయితే దాని స్పందన పౌనఃపున్యం ఎంత? (హెర్ట్జ్‌లలో)
1) 1.25 2) 3.25 3) 4.25 4) 2.25

22. R నిరోధం ఉన్న n నిరోధాలను సమాంతరంగా కలిపితే, ఫలిత నిరోధం...
1) nR 2) n^2 R 3) $\frac{R}{n^2}$ 4) $\frac{R}{n}$

23. వర్షాకాలంలో రోడ్లపై నూనె పొరలు రంగుల్లో కనిపించడానికి కారణం?
1) ధ్రువణం 2) వ్యతికరణం
3) పరిక్షేపణం 4) విక్షేపణం

24. పౌనఃపున్య మాడ్యులేషన్‌లో (FM) వాహక తరంగం పౌనఃపున్యం దేనికి అనుగుణంగా మారుతుంది?
1) సంకేత తరంగ తక్షణ పౌనఃపున్యం
2) సంకేత తరంగ తక్షణ దశ
3) సంకేత తరంగ తక్షణ కంపన పరిమితి
4) సంకేత తరంగ తక్షణ వేగం

25. నక్షత్రం నుంచి వెలువడే కాంతి క్రమంగా ఎరుపు రంగుకి మారితే, అది దేన్ని సూచిస్తుంది?
1) నక్షత్రం భూమి వైపు రావడాన్ని
2) నక్షత్రం విరామ స్థితిలో ఉండటాన్ని
3) నక్షత్రం భూమికి దూరంగా వెళ్లడాన్ని
4) నక్షత్రం ఉష్ణోగ్రత క్రమంగా తగ్గడాన్ని

జవాబులు

1-3	5-2	9-4	13-1	17-3	21-1	25-3
2-1	6-1	10-4	14-4	18-3	22-4	
3-3	7-1	11-4	15-2	19-4	23-2	
4-4	8-1	12-3	16-2	20-4	24-1	

కరెంట్ అఫైర్స్

ప్రతిభ



క్రీడలు టెస్ట్ సిరీస్ నెగ్గిన భారత్ — ఆగస్టు 14

శ్రీలంకలో శ్రీలంకతో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 3-0 తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లీ సేన ఘనత సాధించింది. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా శిఖర్ ధావన్ నిలిచాడు.

జీవించదగిన అత్యుత్తమ నగరం ఏది..?

జాతీయం

ఆగస్టు 13: కీలక బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బాధ్యతలు చేపట్టిన మూడు వారాల్లో ఆరు కీలక బిల్లులపై సంతకాలు చేశారు. ఆయన ఆమోదం లభించడంతో ఇకపై అవి చట్టాలుగా రూపుదాల్చనున్నాయి.

★ బ్రిటిష్ కాలంనాటి రెండు చట్టాల స్థానంలో రూపొందించిన ది అడ్మిరాలిటీ (పరిధి, మారిటైమ్ క్లెయిమ్‌ల చెల్లింపు) బిల్లు; బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు (సవరణ) బిల్లు; జమ్మూ-కశ్మీర్‌కు వర్తించే గణాంకాల సేకరణ (సవరణ) బిల్లు; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) బిల్లు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (సవరణ) బిల్లు; ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ బిల్లులపై రామ్‌నాథ్ సంతకాలు చేశారు.

ఆగస్టు 14: భారతీయ భాషల్లో గూగుల్ వాయిస్ సెర్చ్

టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ తన వాయిస్ సెర్చ్ ఫీచర్‌కు కొత్తగా 8 భారతీయ భాషలను జోడించింది. ఇప్పటి వరకు హిందీ, ఇంగ్లిష్ భాషల్లోనే గూగుల్ వాయిస్ సెర్చ్ సౌలభ్యం అందుబాటులో ఉంది. ఇప్పుడు తెలుగు, బెంగాలీ, మలయాళం, తమిళం, గుజరాతీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ భాషల్లోనూ దీన్ని అందించనున్నామని సంస్థ తెలిపింది.

★ గూగుల్ యాప్‌లో వాయిస్ సెట్టింగ్స్‌లో కావాల్సిన భాషను ఎంచుకోవాలని సూచించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 149 భాషలకు ఈ వెసులుబాటు ఉంది.

ఆగస్టు 15: 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

దేశవ్యాప్తంగా 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆధార్ నుంచి అంతరిక్షం దాకా అన్ని అంశాలను స్పృశించారు.

★ 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2022 నాటికి ప్రతి పేద వ్యక్తికి పక్కా ఇల్లు నిర్మించేలా పని చేయాలని పిలుపునిచ్చారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, నల్లధనంపై కొరడా సహా తన ప్రభుత్వం చేపట్టిన అనేక సంస్కరణలు, పథకాలను ప్రస్తావించారు. స్వాతంత్ర్య సాధన కోసం 'భారత్ చోడో' అని నినదించినట్లు ఇప్పుడు 'భారత్ జోడో' నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

★ సమష్టి సంకల్ప శక్తి ద్వారా 2022 నాటికి స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేసే దిశగా నవభారతాన్ని ఆవిష్కరించాలని మోదీ పేర్కొన్నారు.

★ ప్రధాని హోదాలో మోదీ చేసిన నాలుగు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ఇదే అత్యంత చిన్న ప్రసంగం (సుమారు 56 నిమిషాలు) కావడం విశేషం.

ఆగస్టు 16: రికార్డు స్థాయిలో ఆహారధాన్యాల ఉత్పత్తి

గత జూన్‌తో ముగిసిన 2016-17 పంట సంవత్సరంలో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 27.56 కోట్ల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అంచనా వేసిన దానికంటే 20.30 లక్షల టన్నులు అధిక దిగుబడి వచ్చినట్లు పేర్కొంది.

★ 2015-16 (జులై - జూన్)లో 25.17 కోట్ల టన్నుల దిగుబడి వచ్చింది. 2013-14 లో వచ్చిన 26.50 కోట్ల టన్నుల దిగుబడే ఇంతవరకు రికార్డు.

★ వరి దిగుబడులు 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు, గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, తృణధాన్యాలు 3.85 కోట్ల టన్నుల నుంచి 4.41 కోట్ల టన్నులకు, పప్పుధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగాయి.

★ కంది, మినపప్పుల దిగుబడులు చాలా బాగుండటం గమనార్హం. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది.



ఆగస్టు 17: అమెరికా నుంచి అపాచీ హెలికాప్టర్లు

సైన్యం కోసం అమెరికా నుంచి ఆరు అధునాతన అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన దిల్లీలో సమావేశమైన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రూ. 4,168 కోట్ల విలువైన ఈ ప్రతిపాదన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. దీనికి తోడు అధునాతన గ్రిగోరివిచ్ శ్రేణి స్టెల్త్ యుద్ధనౌకలకు రూ. 490 కోట్లతో రెండు జోర్యా గ్యాస్ టర్బైన్ ఇంజిన్లు కొనుగోలు చేయడానికి కూడా డీఏసీ ఆమోదం తెలిపింది

అంతర్జాతీయం

ఆగస్టు 12: కెన్యా అధ్యక్షుడిగా మళ్లీ ఉహురు కెన్యట్టా



ఆఫ్రికా దేశమైన కెన్యా అధ్యక్షుడిగా ఉహురు కెన్యట్టా రెండోసారి ఎన్నికయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో 54.27 శాతం ఓట్లు దక్కించుకున్న కెన్యట్టా విజయం సాధించినట్లు కెన్యా ఎన్నికల సంఘం ప్రకటించింది.

★ ప్రతిపక్ష నేత రైలా ఓడింగా 44.74 శాతం ఓట్లు పొందారు. అయితే ఎన్నికలు సక్రమంగా జరగలేదని, రిగ్గింగ్, ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందని ఓడింగా ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులు నిర్వహించిన ఆందోళనలు హింసాత్మకంగా మారి, 11 మంది మరణించారు.

ఆగస్టు 14: కలరా బారిన యెమన్

యెమన్‌లో కలరా విజృంభిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. 2017 ఏప్రిల్ నుంచి 5 లక్షలకుపైగా ప్రజలు దీని బారినపడగా 1975 మంది మృతి చెందినట్లు పేర్కొంది.

వార్తల్లో ప్రదేశాలు

ఆగస్టు 14:

హైదరాబాద్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు

ప్రపంచ పారిశ్రామికవేత్తల (వ్యవస్థాపకుల) వార్షిక శిఖరాగ్ర సదస్సును 2017 నవంబరు 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరుకానున్నారు. అగ్ర రాజ్యమైన అమెరికా ఈ సదస్సును నిర్వహిస్తుండటం విశేషం.

ఆగస్టు 16: అత్యుత్తమ నగరంగా మెల్‌బోర్న్

ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ రూపొందించిన గ్లోబల్ లివబిలిటీ నివేదిక ప్రకారం ప్రపంచంలో జీవించదగిన అత్యుత్తమ నగరంగా ఆస్ట్రేలియా రాజధాని మెల్‌బోర్న్ ప్రథమస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో వియన్నా (ఆస్ట్రియా), వాంకోవర్ (కెనడా) ఉన్నాయి.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

ఆగస్టు 17:

స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలు



తెలుగు రాష్ట్రాల్లోని 35 ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు ఎంపికయ్యాయి. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల నుంచి 172 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికకగా వీటిలో 35 పాఠశాలలు తెలుగు రాష్ట్రాలకు చెందినవి కావడం విశేషం (ఏపీ నుంచి 21, తెలంగాణ నుంచి 14 ప్రభుత్వ పాఠశాలలు).

★ స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్రం ఈ పురస్కారాలను అందిస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు ఉన్న సౌకర్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం వీటిని ప్రకటించింది.

★ తమిళనాడు నుంచి అత్యధికంగా 25 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికయ్యాయి. అత్యుత్తమ ఆరోగ్య-పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్న ఒక్కో పాఠశాలకు రూ. 50 వేల చొప్పున నగదు బహుమతి అందిస్తారు.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్

ఆగస్టు 15: తిరుపతిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిరుపతిలోని తారకరామ మైదానంలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టుల కోసం రూ. 43 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల పింఛనును రూ. 7 వేల నుంచి రూ. 15 వేలకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. 2019 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించారు.

పురుషోత్త పట్నం ఎత్తిపోతల ప్రారంభం

✪ గోదావరి నదిని ఏలేరుతో అనుసంధానించే పురుషోత్త పట్నం ఎత్తిపోతల పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

ఆగస్టు 16: ఐయూఐహెచ్ శంకుస్థాపన

రాజధాని అమరావతిలో ప్రతిష్టాత్మక ఇండో-యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఐయూఐహెచ్), అమరావతి మెడిసిటీ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుపై ఐయూఐహెచ్ రూ. 1600 కోట్లు వెచ్చించనుంది.

రాష్ట్రీయం - తెలంగాణ

ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

తెలంగాణ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించి, అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది కొత్తగా 84,876 ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు కేసీఆర్ చెప్పారు.

★ 1936 లో నిజాం కాలంలో భూసర్వే జరిగిందని, ఆ తర్వాత మళ్లీ తమ ప్రభుత్వమే సమగ్ర భూ సర్వేను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బడ్జెట్‌లో సింహభాగాన్ని సంక్షేమానికే వెచ్చిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను పరిపూర్ణం చేసేందుకు నడుం బిగించినట్లు చెప్పారు.

★ 2016-17 ఆర్థిక సంవత్సరంలో 21.7 శాతం ఆదాయ వృద్ధి రేటుతో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు.

సిద్దిపేటకు ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రం

✪ అభివృద్ధి, సంస్కరణలతో దూసుకెళ్తున్న సిద్దిపేట పురపాలిక మరో ఘనత సాధించింది. ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రానికి ఎంపికై, రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి పురపాలికగా నిలిచింది.

ఆగస్టు 16: తెలంగాణ పదాలతో నిఘంటువు

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణ ప్రజల భాష, యాస చిరకాలం ఉండేలా లక్ష పదాలతో నిఘంటువు తయారీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అరుదైన పదాలన్నింటినీ సేకరించి అక్షరబద్ధం చేయాలనేది ప్రణాళిక. పదాల అన్వేషణకు అమరేశం రాజేశ్వర్ శర్మ, కట్టా శేఖర్ రెడ్డి, రవ్వా శ్రీహరి, ఘంటా చక్రపాణి, డాక్టర్ నలిమెల భాస్కర్‌లతో కమిటీ ఏర్పాటు చేశారు.

'ఓడీఎఫ్'గా హైదరాబాద్

✪ హైదరాబాద్ మహా నగరాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా (ఓడీఎఫ్) ప్రకటిస్తూ జీహెచ్ఎంసీ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.

వార్తల్లో వ్యక్తులు

ఆగస్టు 11:

సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్ ప్రసూన్ జోషి



సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్‌గా కవి, పద్మశ్రీ ప్రసూన్ జోషి నియమితులయ్యారు. వచ్చే మూడేళ్ల కాలానికి ప్రసూన్ ఈ పదవిలో కొనసాగుతారు. పహ్లాజ్ నిహ్లాని స్థానంలో ప్రసూన్ నియమితులయ్యారు. సెన్సార్ బోర్డు సభ్యులుగా విద్యాబాలన్, గౌతమి, జీవిత తదితరులు నియమితులయ్యారు.

✪ నాటి తరం పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సౌహార్ద్ర రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి డబ్ల్యూహెచ్ఓ ఆయన్ను ఎంపిక చేసింది.

ఆగస్టు 14:

ఎంతోమంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందించి, డాక్టర్ 'దీదీ'గా ప్రఖ్యాతిగాంచిన భక్తియాదవ్ (91) ఇండోర్‌లో మరణించారు. మధ్యప్రదేశ్ తొలి మహిళా వైద్యురాలిగా గుర్తింపు పొందిన భక్తియాదవ్ గైనకాలజిస్టుగా అందించిన సేవలకు కేంద్రం పద్మశ్రీతో సత్కరించింది.

అవార్డులు

ఆగస్టు 14:

శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

కేంద్ర ప్రభుత్వం 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల్లో ప్రతిభావంతమైన సేవలు అందించిన 990 మందికి అత్యున్నత పోలీసు పతకాలు ప్రకటించింది. వామపక్ష తీవ్రవాదులతో జరిగిన పోరులో ప్రాణాలర్పించిన చత్తీస్‌గఢ్ పోలీసు జవాను కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని ప్రకటించారు. కీర్తిచక్ర పురస్కారాన్ని అయిదుగురికి ప్రకటించారు. హవల్దార్ గిరిస్ గురుంగ్, మేజర్ డేవిడ్ మన్లుం, కమాండెంట్ ప్రమోద్ కుమార్ మరణానంతరం కీర్తిచక్రకు ఎంపికయ్యారు. మిగిలిన ఇద్దరిలో మేజర్ ప్రీతం సింగ్ కున్వార్, చేతన్ కుమార్ చీతా ఉన్నారు.



రచయిత
- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

నెలాఖరుకల్లా లబ్ధిదారుల ఎంపిక పూర్తి

ఎల్‌డీఎం టి.వెంకటేశ్వరరావు

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని కార్పొరేషన్ల పరిధిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయడానికి అధికారులు, బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎం టి.వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అధికారులకు కొన్ని సూచనలు చేశారు. లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ఎంపీడీవోలు, కమిషనర్లు సోమవారం సంబంధిత బ్యాంకు బ్రాంచి మేనేజర్లు, ఎంపిక కమిటీ సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 23వతేదీ ఎస్టీ, మైనారిటీ; 24న బీసీ, కాపు; 28న ఎస్సీ అభ్యర్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. 31వ తేదీలోగా లబ్ధిదారులతో పొదుపు ఖాతాలను బ్యాంకుల్లో తెరిపించి, సెప్టెంబరు 15వతేదీలోగా రాయితీ విడుదల చేయించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అక్టోబరు పదో తేదీనాటికి లబ్ధిదారుల ఆస్తులను థర్డ్ పార్టీ ద్వారా పరిశీలించి జియో ట్యాగింగ్ పూర్తి చేయాలన్నారు. నిర్ణీత తేదీల్లో కార్యక్రమాలు పూర్తి చేయని సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకు అధికారులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను ప్రతి శాఖలోనూ అమలు చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసే వరకూ బ్యాంకు మేనేజర్లు ఎవరూ సెలవులో వెళ్లరాదని అన్నారు. బ్యాంకు సర్వీసు ఏరియా రెండు, మూడు మండలాల పరిధిలో ఉంటే, అలాంటి వారు అధికారులతో మాట్లాడుకుని డిప్యూటేషన్లను ఏర్పాటు చేయించుకోవాలన్నారు. గత మూడేళ్లలో రాయితీ విడుదలైన లబ్ధిదారులకు ఈ నెలాఖరులోగా గ్రౌండింగ్ పూర్తి చేసి వివరాలు అందజేయాలని ఎల్‌డీఎం ఆదేశించారు.

ట్యాంకర్ల సరఫరాకు రూ.7.22 కోట్ల మంజూరు

పొదిలి: నీటి సరఫరా విభాగం పరిధిలోని అయిదు నియోజకవర్గాల్లో ట్యాంకర్ల నీటి సరఫరాకు సంబంధించి... అయిదు నెలల బిల్లులు రూ.7.22 కోట్లు మంజూరు చేసినట్లు ఈఈ మల్లికార్జునరావు తెలిపారు. మార్కాపురం, దర్శి, యర్రగొండపాలెం, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లోని 1342 హ్యాబిటేషన్లు ఉండగా నీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి ప్రజల అవసరాలు తీర్చినట్లు చెప్పారు. ప్రస్తుతం వర్షాలు పడి బోర్లకు నీరందుతున్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా నిలిపివేస్తామన్నారు. ఇంకా సమస్య ఉన్న ప్రాంతాలకు సరఫరా కొనసాగిస్తామన్నారు. మే, జూన్, జులై నెలల బిల్లులు కూడా మరో వారం పది రోజుల్లో పూర్తిచేస్తామన్నారు. వేసవి జలాశయాల్లో ఉన్న నీటిని సెప్టెంబరు మొదటి వారం వరకు పొదుపుగా సరఫరా చేస్తామన్నారు. సాగర్ నీరు వస్తే తప్ప... ఆ తరువాత నీటి సరఫరా చేయడం కష్టమన్నారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: స్పెషల్ ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం పోలాల అమావాస్యరోజు ఏం చేయాలి? ఇంట్లో పూజించే విగ్రహాల ఎత్తు ఎంత ఉండాలి? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆమె (శ్రీకాంత్, ఊహ).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభి'రుచి': ఘుమఘుమలు 'పుదీనా వాంగీబాత్', మీచేతివంట 'మునగాకు జీడిపప్పువేపుడు', 'పాలకూరపచ్చడి', జస్ట్ ఎమినిట్ 'ఉప్మాబోండా' తయారు చేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00:వసంతం(డైలీ సీరియల్), 04-30: ఢీ 10 (సుప్రీండాన్స్‌షో) (రిపీట్), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఆలీతో సరదాగా: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో.., 10-30: సినీవారం: (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00జబర్దస్త్ రిమిక్స్
01:00 మైకేల్ మదన్ కామరాజు రిపీట్
01:15 ది బ్రేకప్ కన్సల్టెంట్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యో రామ రిపీట్
03:30 హంగామా రిపీట్
సాయంత్రం
04:30 నా షో నా ఇష్టం
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 ఈ-జంక్షన్
09:00 పటాస్
09:30 అల్లరే అల్లరి
10:00 సరదాగా కాసేపు
10:30 తారక్ మామా అయ్యో రామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
డా.ఈటీవీ – (ఉ.6:30, 11:00, మ. 3:30, సా. 7:30)
యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.5:00, రా.10:30)
అమృతం (ఉ.8:00, మ.12:30, రా.8:00)
హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ.01:00, రా.8:30)
ఆరోగ్యమస్తు (ఉ.9:00, మ.03:00, సా.4:00, రా.9:00)
ఆయుష్ (ఉ.9:30)
లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఉ.10:00)
అందరికి ఆరోగ్యం (ఉ.10:30)
విహారి (మ.12:00, సా.6:30, రా.10:00)
హెల్దీ డయాబెటిక్ - (మ.1:30)
జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (మ.2:00, రా.7:00)
బాడీ మైండ్ & సోల్– అంతరంగం (మ.2:30, రా.9:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: బందీ (కృష్ణంరాజు విజయశాంతి), 10-00: మార్నింగ్ షో: గృహప్రవేశం (ఎల్.వి.ప్రసాద్, భానుమతి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: సందడే సందడి (జగపతిబాబు, శ్రీకాంత్), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఇందు (ప్రభుదేవా, రోజా), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: పెద్దక్కయ్య (హరనాథ్, కృష్ణకుమారి), 10-00: సెకండ్‌షో: అసెంబ్లీ గూండా (దేవరాజ్, అరుంధతినాగ్).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - చికెన్ మసాలా ఇడ్లీ సాండ్విచ్ & హార్స్‌గ్రామ్ ఫ్రైడ్ రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – స్పినాచ్ & చీజ్ స్టఫ్డ్ క్రిప్స్ & తెలగపిండి రవ్వ పులిహోర, ఉ.9:30: వావ్ ఏమి రుచి – అఖిడీ టుకో అప్యక్ & బోహేమనియన్ డ్రెస్సింగ్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – జీలు & చిలకడదుంప గులాబ్ జామ్, ఉ.11.00: గోరు ముద్దలు – ఆఫ్రికాట్ చికెన్ బ్రౌన్ రైస్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – ఫ్రూటీ ఓట్స్, ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్ - పెసరట్టు ఉప్మా & అల్లం పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - సార్సో బాత్ ఇర్షాన్ మచ్ (బెంగాలీ క్యూసైన్), మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – ఓట్స్ మసాల పూరీ, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - ఘీ ఆనియన్ ఎగ్ ఫ్రైడ్ రైస్, మ.12.45, సా.6.15: సూప్స్ & స్టార్టర్స్ - డ్రమ్ స్టిక్ లీఫ్ & హార్స్ గ్రామ్ సూప్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి – గ్రిల్డ్ ప్రాన్స్ విత్ యుజు సాస్ (జపాన్ క్యూసైన్), మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - ఆ కాకరకాయ పుల్ల బెల్లం పెట్టిన కూర, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – ఛాక్లెట్ కప్ కేక్ & ఫిష్ ఫింగర్స్, మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్ – బీన్స్ ఉసిలి, మ.2.30, సా.6.00: చోటా షెఫ్ – సాబూదాన చుడ్వా, మ.2.45, రా.10.45: జిల్ – నట్టీ క్యారెట్ స్మూతీ & సిట్రస్ మింట్ ఫిజ్, మ.3.00: ఛాయ్ బిస్కెట్ – కాల్ జోన్స్ & ఛాక్లెట్ ఆల్మండ్ కాఫీ, మ.3.15: సూప్స్ & స్టార్టర్స్ - ఎగ్ డ్రాప్ సూప్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: **శ్రీ భోగేశ్వర స్వామి ఆలయం, పామిడి, అనంతపురం జిల్లా,** 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ,** 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: **శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, కందూరు మహబూబ్‌నగర్ జిల్లా, సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ,** 10-00 ఘంటారావం,10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 21-08-2017

SVBC (TTD) — **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తోమాలసేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయే - శివుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 పంచభూత లింగాలు, 03-30 విష్ణుపురాణం, **సాయంత్రం:** 04-30 క్షేత్ర దర్శిని, 05-00 లైవ్ ఎస్.డి. సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 భక్తిచైతన్యం, 08-30 ధర్మసోపానాలు - శ్రీ చాగంటి, 09-00 ఆలయ దర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవిసప్తసతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనికపర్వం.

భక్తి TV — **ఉదయం:** 06-00 శ్రీ శివ సహస్రం, 06-30 నమకంచమకం, 07-00 అర్చన, 07-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 శ్రావణసోమవార వైభవం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శివస్తోత్రం, 05-30 శ్రీశివసహస్రం, 06-00 నమకంచమకం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు — **ఉదయం:** 07-30 ఓంకారం, 08-00 సినిమా: కృష్ణ, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: రాక్షసుడు.

మా — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: బన్ని, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్‌బాస్, 02-30 బిగ్‌బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 బిగ్‌బాస్ రిపీట్, 05-30 ఓకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్‌బాస్, 10-30 బిగ్‌బాస్ రిపీట్.

GEMINI — **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: **రాజాబాబు, మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావు (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: రైడ్, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వునాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు. 10-00 సినిమా: కితకితలు.

HBO — ఉదయం: 06-00 ఆల్మోస్ట్ హీరోస్, 07-21 10,000 బీసీ, 09-20 ద గాడ్‌ఫాదర్, **మధ్యాహ్నం:** 12-29 ద హ్యాంగోవర్ పార్ట్-2, 2-15 ట్యాక్సీ 4, **సాయంత్రం:** 04-15 ద డార్క్ నైట్ రైజెస్, **రాత్రి:** 07-16 ఫైనల్ డెస్టినేషన్ 5, 9-00 టీనేజ్ మ్యూటెంట్ నింజ టర్టిల్స్: ఔట్ ఆఫ్ ది షాడోస్, 11-03 పారానార్మల్ ఆక్టివిటి 4.

రైతేరాజు

ETV అన్నదాతలో... రేపు ఉదయం 6.30 గం.లకు
1. పత్తిలో గులాబీరంగు పురుగు - సమగ్ర నివారణ
2. దక్షిణ మండలంలో సాగు చేసుకోదగ్గ ప్రత్యామ్నాయ పంటలు
3. డ్రమ్‌సీడర్ యంత్రంతో వరి నాట్లు, కలుపు నివారణ పద్ధతులు

ఉచిత హెల్ప్‌లైన్ నెం.1800-425-4085కు ఉ.10-11 గం.ల మధ్య ఫోన్ చేయవచ్చు

ETV ఆంధ్రప్రదేశ్ జైకిసాన్‌లో... నేటి సాయంత్రం 6.30 గంటలకు
1. ప్రకాశం పశ్చిమ ప్రాంతంలో వర్షాలు- నిండిన చెక్‌డ్యాములు
2. కొబ్బరికి గిరాకీ- ఊరట పొందుతున్న గోదావరి జిల్లాల రైతులు

జైకిసాన్ కార్యక్రమాన్ని www.youtube.com/etv2jaikisan ద్వారా కూడా వీక్షించవచ్చు.

యాంత్రీకరణ తోనే గిట్టుబాటు సాగు

పనులకు వినియోగించే పశుసంపద తరిగిపోవడం, కూలీల కొరత ఏర్పడటంతో వ్యవసాయం పెనుభారంగా మారింది. ఈ పరిస్థితుల్లో వ్యవసాయాన్ని యంత్రాలతో చేయక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. యంత్రాలు రైతుల శ్రమను, సాగు ఖర్చును 30 నుంచి 60 శాతం వరకు తగ్గించే అవకాశాలున్నాయి. కనుక వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలంటే యాంత్రీకరణ అవసరమని చిత్తూరు రైతు శిక్షణ కేంద్రం సహాయ సంచాలకులు భాస్కరయ్య అన్నారు.

యంత్ర పరికరాలు: నేల దున్నటానికి కల్టివేటరు, రోటోవేటరు, విత్తనం వేయడానికి సీడ్‌డ్రిల్లర్, ప్లాంటర్, అంతరకృషి కోసం పవర్‌వీడర్, సస్యరక్షణ కోసం చిన్న స్ప్రేయర్లు, పవర్‌స్ప్రేయర్, పంట కోత యంత్రాలు, మల్టీ క్రాప్ క్రషర్, వరికోత యంత్రం తదితర అధునాతన యంత్రాలతో పాటు నీటి సరఫరా కోసం స్ప్రింక్లర్లు, జల ఫిరంగులు, బిందుసేద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఈ పరికరాలన్నింటిని ట్రాక్టర్లకు అనుసంధానం చేసుకుని ఉపయోగించుకోవచ్చు. వ్యవసాయ శాఖ యాంత్రీకరణ పథకం కింద పెద్ద ఎత్తున రాయితీపై యాంత్రీకరణ ఉపకరణాలను అందచేస్తున్నది. వ్యవసాయాధికారులను సంప్రదించి రాయితీ



యంత్రంతో వరి నాటుతున్న రైతు

ధరలకు రైతులు కొనుగోలు చేసుకోవచ్చు. రాయితీపై జల ఫిరంగులు, స్ప్రింక్లర్లు, బిందుసేద్యం పరికరాలను ఆయా మండలాల్లోని సూక్ష్మ నీటిపారుదల పథకం ఏరియా అధికారులు, డ్రిప్ కంపెనీల ప్రతినిధులను సంప్రదించి దరఖాస్తు చేసుకుంటే నిబంధనల ప్రకారం పంపిణీ చేస్తారు. సాగులో యాంత్రీకరణ పద్ధతులను అవలంభిస్తే వ్యవసాయ రంగం లాభాల బాట పట్టే అవకాశం ఉంది. ఇందుకు అవసరమైన ఆచరణాత్మక ప్రణాళికలు రైతులకు ఎంతో అవసరం.

–న్యూస్‌టుడే, చిత్తూరు (వ్యవసాయం)

సజ్జ పంటలో సస్యరక్షణ

జొన్న తర్వాత రైతులు అధికంగా పండించే పంట సజ్జ. ఇందులో మంచి పోషకాలు ఉంటాయి. ప్రస్తుతం పంటల సాగు మొదలై నెలన్నరకు పైగా అవుతుందని, సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని, మండల వ్యవసాయాధికారి షేక్షావలి తెలిపారు.

పచ్చకంకి లేదా వెర్రికంకి తెగులు: తెగులు సోకిన మొక్క కాండంపై పూర్తిగా లేదా అసంపూర్తిగా ఆకులుగా మారిన పుష్పగుచ్ఛం ఏర్పడుతుంది. తెగులు లక్షణాలు మొదట లేత మొక్కలపై, 3-4 ఆకులు వేసే దశలో కనిపిస్తాయి. తెగులు సోకిన మొక్కలు పసుపురంగు లోకి మారుతాయి. గాలిలో తేమ అధికంగా ఉంటే ఆకుల అడుగుభాగంలో తెల్లని బూజు పెరుగుదల కనిపిస్తుంది. తెగులు తీవ్రదశలో మొక్కలు గిడసబారి 30 రోజులు లోపు చనిపోతాయి. తెగులు సోకిన మొక్కలో కంకులు పూర్తిగా లేదా పాక్షికంగా ఆకుపచ్చని ఆకులుగా మారిపోతాయి. దీని నివారణకు కిలో విత్తనానికి 6 గ్రా. ఆప్రాన్ ఎస్.డి 35 మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలి. తెగులు సోకిన మొక్కలను ఏరి కాల్చివేయాలి. విత్తిన 21 రోజులకు తెగులు సోకే అవకాశం ఉంటుంది. తెగులు సోకిన మొక్కలు 5 శాతం మించి ఉంటే రిడోమిల్ (25డబ్లూపీ) లీటరు నీటికి 1 గ్రా. వంతున కలిపి పైరుపై పిచికారి చేయాలి.

తేనెబంక తెగులు: తెగులు సోకిన కంకి నుంచి గులాబి లేదా ఎర్రరంగుగా ఉన్న తేనె వంటి చిక్కటి ద్రవం బొట్లు బొట్లుగా కారుతుంది. ఈ ద్రవంతో శిలీంద్ర బీజాలు ఏర్పడతాయి. మొక్కలు పుష్పించే దశలో మబ్బుతో కూడిన ఆకాశం, వర్షపు తుంపరలు, వాతావరణం చల్లగా ఉండటంతో ఈ తెగులు వ్యాప్తికి దోహదం చేస్తుంది. దీని నివారణకు విత్తనాలను లీటరు నీటికి 20 గ్రా. ఉప్పు కలిపిన నీటి ద్రావణంలో శుద్ధి చేసి, ఆరనిచ్చి కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ మందు కలిపి విత్తన శుద్ధి చేయాలి. పైరు పూతదశలో మాంకోజబ్ 2.5 గ్రా. లేదా కార్బండిజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి వారం వ్యవధితో



వెర్రికంకి తెగులు సోకిన మొక్క


రెండుసార్లు పిచికారీ చేయాలి.

తేలిక నేలల్లో చెదల నివారణకు ఎకరాకు 8 కిలోల 2 శాతం మిథైల్‌పెరాథియాన్ పొడిని దుక్కిలో వేసి కలియదున్నాలి. లేత మొక్క దశలో మిడతల నుంచి పంటను కాపాడటానికి 5 శాతం కార్బరిల్ పొడి లేదా 2 శాతం మిథైల్‌పెరాథియాన్ పొడిని ఎకరాకు 8-10 కిలోలు చొప్పున చల్లాలి.

–న్యూస్‌టుడే, హాలహర్వి.

పత్తా లేని ఫసల్ బీమా!

గత ఖరీఫ్ పంట నష్టాలకు అందని పరిహారం





ప్రస్తుత ఖరీఫ్‌లో కళ కళలాడుతున్న కంది పైరును చూపిస్తున్న ఈ రైతు త్రిపురాంతకం మండలం రామసముద్రం గ్రామానికి చెందిన దేశిరెడ్డి శ్రీనివాసరెడ్డి. ఈయన గత ఖరీఫ్‌లో గొట్టపు బావి కింద అయిదున్నర ఎకరాల్లో కంది పంట సాగు చేశాడు. తీవ్ర వర్షాభావంతో భూగర్భ జలాలు అడుగంటడంతో గొట్టపు బావి ఎండిపోవడంతో పాటు కాపు దశలోని పంట నిలువునా ఎండిపోయింది. రూ.30 వేలకు పైగా పెట్టుబడులు, రూ.75 వేలకు పైగా దిగుబడులు నష్టపోయారు. గత ఖరీఫ్‌లో ప్రదాని ఫసల్ బీమా పథకం కింద ఎకరాకు రూ.286 లెక్కన రూ.1,320 చెల్లించాడు. 10 నెలలు దాటినా అధికారులు బీమా గురించి పట్టించుకోవడం లేదన్నది ఈ రైతు ఆవేదన. గత మూడేళ్లుగా కరవు పరిస్థితులతో సాగులో తీవ్రంగా నష్టపోయినందున ప్రభుత్వం త్వరగా బీమా కింద నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నారు.



సాగు నీరు రాక వర్షానికి సాగర్ ఆయకట్టు భూమిలో సాగు చేసిన సజ్జ పంటను చూపిస్తున్న రైతు త్రిపురాంతకం మండలం మేడపి గ్రామానికి చెందిన కోలగాని కోటయ్య. ఈయన ఏటా అయిదెకరాల్లో వరి సాగు చేస్తుంటారు. గత ఏడాది ఎ.3.60 సెంట్లకు వరి సాగు కింద ఎకరాకు రూ.580 చొప్పున మొత్తం రూ.1,680 నగదు చెక్కును బ్యాంకులో తీసి వెలుగు సిబ్బందికి ఫసల్ బీమా చెల్లించారు. సాగర్ నీరు విడుదల కాలేదు. వర్షాలు లేకపోవడంతో మెట్ట పంటలను కూడా సాగు చేయలేదు. దీంతో పొలం బీడుగా ఉంచారు. ఏడాది కావస్తున్నా బీమా కింద నష్టపరిహారం అందలేదు.

త్రిపురాంతకం, న్యూస్‌టుడే

అన్నదాతపై ప్రకృతి పగబట్టింది. మూడేళ్లుగా సరైన వర్షాలు లేవు. సాగు చేసిన అరకొర పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఫలితంగా అప్పుల ఊబిలో కూరుకుపోయారు. వారిని ఆదుకోవాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలో గత ఏడాది ఖరీఫ్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాని ఫసల్ బీమా యోజన పథకంలో చేరి పంటలు నష్టపోయిన రైతుకు అందాల్సిన నష్టపరిహారం నేటికీ అందక పరిహాసంగా మారింది. కొన్ని నెలల్లో పంట నష్టపరిహారం అందుతుందని వెలుగు, వ్యవసాయాధికారులు పెద్ద ఎత్తున ప్రచారం చేసి అధిక సంఖ్యలో రైతులను ఫసల్ బీమాలో చేర్పించారు. ఆ తర్వాత అందాల్సిన పంట నష్ట పరిహారం గురించి అడిగితే అధికారులు సమాధానమివ్వలేని స్థితి.

అయోమయంలో అన్నదాత

2016 ఖరీఫ్‌లో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్‌బీమా గురించి విస్తృత ప్రచారం నిర్వహించారు. దీని అమలు బాధ్యతను డీఆర్‌డీఏ వెలుగు సిబ్బందికి, బ్యాంకులకు అప్పజెప్పారు. వారి ప్రచార ఫలితంగా జిల్లాలోని 29,914 మంది రైతులు 21,366 హెక్టార్లకు సంబంధించి రూ. 6,46,72,893 ప్రధాని ఫసల్ బీమా చెల్లించారు. అయితే 39 మండలాల్లోని 3,901 మంది రైతులకు రూ. 4,50,76,673 పరిహారం మంజూరైంది. జిల్లాలో పశ్చిమ ప్రాంత మండలాలైన యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దదోర్నాల, పెద్దారవీడు, త్రిపురాంతకం, మార్కాపురం, కంభం, గిద్దలూరు, బేస్తవారపేట, రాచర్ల, కొమరోలు, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి తదితర ప్రాంతాల్లో సాగు చేసిన కంది, మిర్చి, పత్తి, సజ్జ పంటలు తీవ్ర వర్షాభావంతో అధిక శాతం విస్తీర్ణంలో ఎండిపోయాయి. కంది పంట అత్యంత దారుణంగా దెబ్బతింది. ఎకరాకు బస్తా దిగుబడి కూడా రాలేదంటే ఆశ్చర్యపోక తప్పదు. సాగర్ కాలువలకు నీరు విడుదల కానందున అక్కడక్కడ బోర్ల కింద మినహా మిగతా చోట్ల తిండి గింజలు కూడా కరువయ్యాయి. కరవు వల్ల 50 శాతం లోపు పంట దిగుబడులు పడిపోతే అతివృష్టి, అనావృష్టి తదితర ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల వ్యవసాయ, రెవెన్యూ శాఖలు చేపట్టే పంట కోత ప్రయోగాల్లో గ్రామంలో సాధారణ దిగుబడి కన్నా 50 శాతం దిగుబడులు తగ్గితే ప్రధాని ఫసల్ బీమా కింద పరిహారం అందించాలి. పశ్చిమ ప్రాంత మండలాల్లోని రైతులకు నేటికీ ఫసల్‌బీమా పరిహారం అందకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వెలుగు సిబ్బంది చేపట్టిన ఫసల్ బీమా పరిహారం లెక్కల్లో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 4,50,76,673 బీమా నిధులు ఇంత వరకు రైతుల ఖాతాల్లోకి చేరలేదు. ఆ పరిహారం ఏయే మండలాల్లో ఎంత మంది రైతులకు మంజూరు చేశారో కూడా ఇప్పటికీ సరైన స్పష్టత లేదు.

రూ. 30 లక్షలు చెల్లించినా...

జిల్లాలో 2016 ఖరీఫ్‌లో 2.35 లక్షల హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికి గాను 2.34 హెక్టార్లలో సజ్జ, కంది, జొన్న, పత్తి, వేరుసెనగ, మిర్చి తదితర పంటలు సాగు చేశారు. ఈ లెక్కన గమనిస్తే 99 శాతం మేర సాగయ్యాయి. మూడేళ్ల నుంచి కరవు సంభవిస్తున్నా గత ఏడాది రైతులకు తీవ్రమైన గడ్డు దుస్థితి ఏర్పడింది. పంట దశలో కంది, సజ్జ, వేరుసెనగ పూర్తిస్థాయిలో ఎండిపోయాయి. బోరు బావుల కింద మిర్చి అరకొరగా పండినా దిగుబడులతో పాటు ధరలు పతనమయ్యాయి. దీంతో రైతులు నష్టాలను ఎదుర్కొని అప్పులపాలయ్యారు. వైపాలెం సబ్‌డివిజన్‌లో 22,568 హెక్టార్లలో పంటలు సాగైనా తీవ్ర వర్షాభావంతో పంటలు నిలువునా ఎండిపోయాయి. త్రిపురాంతకం మండలంలో 720 మంది వరకు ఫసల్ బీమా ప్రీమియం చెల్లించారు. జిల్లాలో కెల్లా పెద్దదోర్నాల మండలంలో అత్యధిక సంఖ్యలో రెండు వేల మంది రైతులు రూ. 30 లక్షల ప్రీమియం చెల్లించారు. ఈ నేపథ్యంలో పశ్చిమ ప్రాంత మండలాల్లో వెలుగు సిబ్బందికి చెల్లించిన బీమా ప్రీమియం తాలూకు పరిహారం ఎవరికీ అందకపోవడం గమనార్హం.

గత ఖరీఫ్‌లో ప్రధాని ఫసల్ బీమా ప్రీమియం వివరాలు

పంట	బీమా మొత్తం (ఎకరాకు రూపాయల్లో)	రైతు చెల్లించాల్సిన ప్రీమియం(ఎకరాకు రూపాయల్లో)
వరి	28,000	500
సజ్జ	9,000	180
మొక్కజొన్న	22,000	440
కంది	14,300	286
ఆముదం	12,500	250
మిర్చి(నీటి వసతి)	80,000	4,000
మిర్చి(వర్షాధారం)	80,000	2,800

బ్యాంకుల్లో జమ చేశాం

బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతుల వద్ద నుంచి బ్యాంకర్లు కట్టించిన ఫసల్ బీమా ప్రీమియంకు సంబంధించిన పరిహారం ఇటీవల బీమా సంస్థలు బ్యాంకులో రూ. 4. 50 కోట్లు జమ చేశాయి. అయితే వెలుగు సిబ్బంది వద్ద రైతులు చెల్లించిన ప్రీమియం గురించి మా వద్ద సమాచారం లేదు.

–వెంకటేశ్వరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్, ఒంగోలు

రూ.20 వేల బీమా చెల్లించాను



ఆరెకరాల్లో మిర్చి, పదెకరాల్లో కంది సాగు చేశాం. మిర్చి ఎకరాకు రూ. 2,800 చొప్పున రూ. 16,800, కందికి ఎకరాకు రూ. 288 లెక్కన రూ. 2,880 మొత్తం రూ. 19,680 ఫసల్ బీమా చెల్లించాను. తీవ్ర వర్షాభావంతో కాపు దశలో కంది, మిర్చి ఎండిపోయాయి. రూ. మూడు లక్షల నష్టం వాటిల్లినా ఇప్పటికీ బీమా పరిహారం జాడ లేదు. –నారాయణరెడ్డి, రైతు, బొమ్మలాపురం, పెద్దదోర్నాల మండలం

బీమా పరిహారం ఎన్నడో?



అయిదెకరాల్లో సాగు చేసిన కందికి రూ. 1,440 వెలుగు సిబ్బంది ద్వారా ఫసల్ బీమా చెల్లించాను. గత ఏడాది నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులతో కంది ఎండిపోయింది. దుక్కులకు, విత్తనాలకు, సాగుకు రూ. 10 వేలు ఖర్చయ్యాయి. పంట పండితే రూ. 75 వేల ఆదాయం లభించేది. పంట ఎండిపోవడంతో పెట్టుబడులు కూడా దక్కలేదు. పంట దెబ్బతిని ఏడాది కావస్తున్నా బీమా పరిహారం అందించలేదు. చెల్లిస్తారో లేదో కూడా చెప్పేవారే కరువయ్యారు. – కుడుముల లాలయ్య, పుల్లలచెరువు



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీడీ లక్ష్మీసుధ

విద్యార్థినులను కొడితే సహించేది లేదు

నాణ్యమైన భోజనం వడ్డించాలి ఎస్సీ వసతి గృహాల డీడీ లక్ష్మీసుధ

కంభం, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదివే విద్యార్థినులతో అక్కడ పనిచేసే సిబ్బంది అసభ్యంగా ప్రవర్తించడం, కొట్టడం వంటి చర్యలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సీ వసతి గృహాల డీడీ లక్ష్మీసుధ తెలిపారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఆ సమయంలో వార్డెన్ అందుబాటులో లేడు. సిబ్బంది మాత్రమే ఉన్నారు. విద్యార్థినులతో ఆమె కొద్దిసేపు నేలపై కూర్చొని మాట్లాడారు. తరువాత తరగతుల వారీగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గతంలో వచ్చి వెళ్లిన సమయంలో ఇబ్బందులపై తాము ఫిర్యాదు చేశామని.. తమను వంటచేసే బీబీజాన్ కొట్టడంతో పాటు వార్డెన్‌కు చెప్పి కొట్టించారని తెలిపారు. వెంటనే అక్కడే ఉన్న బీబీజాన్‌ను డీడీ లక్ష్మీసుధ పిలిచి మందలించారు. తాను కొట్టలేదని, భోజనం చేయడానికి రాకపోవడంతో మందలించానని వంటమనిషి తెలిపింది. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాలన్నారు. విద్యార్థిలతో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు తీసుకున్నారు. పలు సమస్యల గురించి విద్యార్థులు విన్నవించారు. పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయినులు తమపై వసతి గృహ విషయాలపై బెదిరిస్తున్నారని ఆమెకు తెలిపారు. ఆ విషయంపై కూడా ఆమె వెంటనే స్పందించి ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరాజుతో మాట్లాడారు. వసతి గృహ విషయాల్లో తలదూర్చి విద్యార్థినులను ఇబ్బంది పెడితే కలెక్టరుకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. వసతి గృహంలో వారు పడుతున్న ఇబ్బందులపై షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆకస్మిక తనిఖీ చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా వసతి గృహ సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

ఒంగోలు సంతపేట, న్యూస్‌టుడే: దేశంలోని వివిధ స్థాయి న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) జాతీయ కౌన్సిల్ సభ్యులు, జిల్లా కార్యదర్శి యడవల్లి రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయస్థానాల్లో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. చాలినంత మంది న్యాయమూర్తులు లేక, ఉన్నవారిపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతోందన్నారుఉ. దానిని తప్పించాలని కోరారు. ఆ దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాద రహిత క్వారీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

గనుల భద్రత డీడీ స్వప్నకుమార్ దత్తా

ముగిసిన భద్రతా వారోత్సవాలు



మైన్‌సేఫ్టీ వీక్ సెలబ్రేషన్స్‌కు హాజరైన గ్రానైట్ క్వారీల యజమానులు

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: గనుల్లో భద్రత నియమాలను అతిక్రమిస్తే తీవ్ర అనర్థాలు జరుగుతాయని హైదరాబాద్ రీజియన్-2 మైన్ సేఫ్టీ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్ సేఫ్టీ సౌత్ సెంట్రల్ జోన్ స్వప్నకుమార్ దత్తా హెచ్చరించారు. మిడ్‌వెస్ట్ గ్రానైట్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ కె.రాఘవరెడ్డి అధ్యక్షతన ఆదివారం రాత్రి ఒంగోలు శివారులోని విష్ణుప్రియ కన్వెన్షన్ హాలులో జరిగిన ప్రకాశం, గుంటూరు జిల్లాల 18వ గనుల భద్రత వారోత్సవాల ముగింపు సభలో దత్తా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనుల భద్రతపై చైతన్యం వచ్చిందని అన్నారు. రానున్న రోజుల్లో ప్రతి యజమాని క్వారీలను ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని సూచించారు. తగిన మైనింగ్ ప్లాన్, గనుల నిబంధనలు, భద్రతా నియమాలు పాటించాలన్నారు. గనుల రంగంలో నెలకొన్న పోటీని ప్రస్తావిస్తూ ప్రతీ యజమాని గనుల యాజమాన్య పద్ధతులను కచ్చితంగా పాటిస్తే ఎక్కడా ఎలాంటి సమస్యలు రావన్నారు. అధునాతన యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయంటూ.. గనుల్లో పని చేస్తున్న కార్మికులకు వారి విభాగాల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. కార్మికులకు వ్యక్తిగత భద్రతపై అవగాహన పెరగాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ప్రస్తావిస్తూ పర్యావరణ పరిరక్షణతో పాటు గనుల్లో కాలుష్య నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, భద్రత విషయంలో అమలులోకి వచ్చిన నిబంధనలను వివరించారు. నెల్లూరు రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ మైన్‌స్టేఫ్టీ నీరజ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని గనుల్లో అమలవుతున్న గనుల భద్రత గురించి ప్రస్తావించారు. ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన యంత్రాలను ఉపయోగించి గనుల్లో భద్రతకు పెద్దపీట వేయాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కె.రాఘవరెడ్డి మాట్లాడుతూ గనుల్లో భద్రతతోపాటు పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతూ మైనింగ్ చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. వారోత్సవాల కమిటీ ప్రధాన కార్యదర్శి డి.వి.అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ క్వారీని ప్రమాదరహితంగా తీర్చిదిద్దడానికి అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ గనుల భద్రత నియమాలను పాటించాలన్నారు. భూగర్భ గనులశాఖ ఏడీ బి.రామచంద్రరావు మాట్లాడుతూ ఈ ఏడాది రాయల్టీ లక్ష్యాన్ని రూ.250 కోట్లకు పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా స్వప్నకుమార్ దత్తా చేతుల మీదుగా సావనీర్‌ను ఆవిష్కరించారు. గనుల భద్రత ఓవరాల్ కప్‌ను మిడ్‌వెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అందజేశారు. దత్తా చేతుల మీదుగా రాఘవరెడ్డి ఆ కప్పును అందుకున్నారు. భద్రత విషయంలో ప్రతిభ కనబరిచిన 210 మందికి బహుమతులను అందజేశారు. సభలో గెలాక్సీ గ్రానైట్ యజమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.అజీమ్, వీటీసీ అధ్యక్షుడు ఆర్.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎ.సుభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న స్వప్నకుమార్ దత్తా

పట్టు బిగించిన గుంటూరు



గుంటూరు - విజయనగరం జట్ల మధ్య మ్యాచ్ దృశ్యం

ఒంగోలు క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-16 గ్రూప్-బి టోర్నీలో భాగంగా ఒంగోలు శర్మ కళాశాల మైదానంలో విజయనగరం జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో గుంటూరు జట్టు పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో విజయనగరం జట్టును 50 పరుగులకే కట్టడి చేసిన గుంటూరు జట్టు- తొలి ఇన్నింగ్స్‌లో 161 పరుగులకు ఆలౌటైంది. 101 పరుగుల ఆధిక్యం సాధించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి విజయనగరం జట్టు 30 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 53 పరుగులు చేసింది. ఇప్పటికీ 58 పరుగులు వెనుకబడి ఉంది. అద్భుతమేదైనా జరిగితే తప్ప విజయనగరం జట్టు పరాజయం ఖాయంగా కనిపిస్తోంది.

చెలరేగిన వాసు

వికెట్లేమీ నష్టపోకుండా రెండు పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన గుంటూరు జట్టును విజయనగరం జట్టు లెఫ్టార్మ్ స్పిన్నర్ వాసు కట్టడి చేశాడు. 27.2 ఓవర్లు బౌలింగ్ చేసిన వాసు 14 మెయిడెన్లు విసిరి 32 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. దీంతో గుంటూరు జట్టు 79.2 ఓవర్లలో 161 పరుగులకే కుప్పకూలింది. ఈ జట్టులో షేక్ రషీద్ అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. 184 బంతుల్లో ఎనిమిది బౌండరీలతో 59 పరుగులు చేశాడు. జి.సాల్మన్ జాయ్ 24 పరుగులతో రాణించాడు. మిగిలిన బ్యాట్స్‌మెన్ రాణించక పోవడంతో గుంటూరు జట్టు 161 పరుగులకే పరిమితమైంది.

కష్టాల్లో విజయనగరం జట్టు

అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు రెండో రోజు ఆటముగిసే సమయానికి 30 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 53 పరుగులు చేసింది. ఎం.రవికిరణ్ 76బంతుల్లో 12 పరుగులు చేసి ఔటయ్యాడు. ఎ.హరీష్ 12 పరుగులతో అజేయంగా క్రీజ్‌లో నిలిచాడు. గుంటూరు బౌలర్లు పి.అక్షయ్‌కుమార్, పి.హరీష్ చెరో వికెట్ పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో గుంటూరు జట్టు విజయం దిశగా సాగుతోంది.



ఆరు వికెట్లు పడగొట్టిన విజయనగరం బౌలరు వాసు



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీ నృసింహస్వామి దేవాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. ఆశ్లేష నక్షత్రం అమావాస్య తిథి. ఉదయం ఆరు గంటలకు అభిషేకం, మధ్యాహ్నం, 1.00 నుంచి 1.30 గంటల వరకు పంచహారతులు ఇస్తారు. 1.30 నుంచి 2.00 వరకు స్వల్ప విరామం ఉంటుంది. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఆలయశుద్ధికి దర్శనాలు నిలిపివేస్తారు. రాత్రి 7.00 నుంచి 7.45 గంటలకు ప్రదోష కాలార్చన అనంతరం ఆలయ తలుపులు మూసివేస్తారు. నిత్యాన్నదాన పథకం ద్వారా 50 మంది భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు వేదపండితులు వంగల హరిశంకరావధాని తెలిపారు. షిర్డీ సాయిబాబా మందిరంలో అన్నదానం చేస్తారు.

- న్యూస్‌టుడే, శింగరకొండ(అద్దంకి).

సాహిత్య కేంద్రంగా గుండ్లకమ్మ తీరం

ఆహారం- ఆరోగ్యం పుస్తకావిష్కరణలో వక్తలు

ఒంగోలు సాంస్కృతిక విభాగం, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి, ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ జి.వి.పూర్ణచంద్ రచించిన ఆహారం- ఆరోగ్యం పుస్తకావిష్కరణ కార్యక్రమం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు సాహితీవేత్తలు హాజరై ప్రసంగిస్తూ గుండ్లకమ్మ తీరం నవ్యాంధ్ర సాహిత్య కేంద్రంగా రూపుదిద్దుకుంటోందన్నారు. అందుకు ఇలాంటి పుస్తకాల ఆవిష్కరణ ఇక్కడ జరగడమే తార్కాణమని అన్నారు. జిల్లా రచయితల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, ప్రధాన కార్యదర్శి కుర్రా ప్రసాద్‌బాబు నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ పుస్తకాన్ని ఆవిష్కరించగా- అధ్యక్షురాలు కళావతి(కడప) మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సాహితీవేత్తలకు నిలయమైన ప్రకాశం జిల్లాకు తాను రావడం సంతోషంగా భావిస్తున్నానని అన్నారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు (విజయవాడ) మాట్లాడుతూ ఇక్కడ కవులకు, కళాకారులకు లభిస్తున్న ప్రోత్సాహాన్ని చూస్తుంటే- తెలుగు భాషకు త్వరలోనే మహద్భాగ్యం పట్టడం ఖాయమని అన్నారు. రచయిత పూర్ణచంద్ వ్యక్తిత్వ విశేషాలు వెల్లడిస్తూ ఆయన చేపట్టని సాహిత్య ప్రయోగం లేదని.. తెలుగుభాషకు ప్రాచీన హోదా వచ్చేందుకు ఆయన రాసిన పలు పుస్తకాలూ కారణమయ్యాయని కొనియాడారు. పుస్తక సమీక్ష చేసిన విశ్లేషకులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు(హైదరాబాద్) మాట్లాడుతూ రచయిత పరిశోధన- ఆయనకు తెలుగువారి ఆహారపు అలవాట్ల మీద ఉన్న సాధికారతను తెలుపుతోందన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తి(విహారి)-హైదరాబాద్ ప్రసంగిస్తూ పూర్ణచంద్ రాసిన సప్త సింధు, కాంతి స్వప్న మొదలైన రచనలను ఉటంకిస్తూ ఆయన సాహిత్య వైవిధ్యాన్ని వివరించారు. గ్రంథాలయ తాత్కాలిక(ఇన్‌ఛార్జి) కార్యదర్శి సజ్జా మధుసూదనరావు మాట్లాడుతూ గ్రంథాలయ డైరెక్టర్ పయ్యావుల పార్వతి సూచనల మేరకు తమ సంస్థలో విరివిగా సాహిత్య కార్యక్రమాలు నిర్వహించేందుకు కవులు, రచయితలకు తగిన ప్రోత్సాహం ఇస్తున్నామని అన్నారు. చివరగా రచయిత పూర్ణచంద్ మాట్లాడుతూ సాహిత్యవేత్తలు తమ రచనల్లో సామాజిక బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఒంగోలులో తన పుస్తకాన్ని ఆవిష్కరించడం ఎనలేని ఆనందాన్ని ఇస్తోందని చెబుతూ.. ప్రభుత్వాలు, ప్రజలు భాషాపరమైన అభివృద్ధి సిద్ధాంతంతో ముందుక సాగాలని కోరారు. సమాఖ్య గౌరవాధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు, కోశాధికారి డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరావు ఆధ్వర్యంలో ఆహూతులకు సత్కారాలు జరిగాయి. వివిధ సాహిత్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



తన గురువు విహారి ద్వారా సత్కారం అందుకుంటున్న జి.వి.పూర్ణచంద్